thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 291 కరీంనగర్ ఆదివారం, 28 డిసెంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## 'తుంగభద్ర'పై కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం..

బెంగళూరు : తుంగభద్ర డ్యాం కు గతేడాది కొట్టుకుపోయిన 19వ క్రస్ట్ గేటు స్థానంలో కొత్త గేటును అమర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయ్యిందని బీజేపీ నాయకులు ఆరోపించారు. టీబీడ్యాంపై కొప్పళ జిల్లా బీజేపీ బృందం పర్యటించింది. ప్రతిపక్ష నాయకుడు దొడ్డగౌడ పాటిల్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బసవరాజ్ కావటూర్, రమేష్, గణేష్, మంజునాథ్, మల్లికార్జున తదితర నాయకులు బృందంలో ఉన్నారు. దెబ్బతిన్న 19వ క్రస్ట్ గేటు స్థానంలో కొత్త గేటు అమర్చేందుకు రూ.2 కోట్ల వ్యయంతో టెండర్ పిలిచారని, కానీ మళ్లీ రద్దు చేశారన్నారు. ఇక మిగిలిన గేట్లకు ఎప్పుడు టెండర్ పిలుస్తారో.. ఎప్పుడు మరమ్మత్తుచేస్తారో ఆయోమయంగా ఉందని మండిపడ్డారు. డ్యాంకు నీరు వస్తున్న తరుణంలో గేట్లు పటిష్టంగా లేకుంటే నీరు ఎలా నిలుస్తాయని ప్రశ్నించారు. ఇది పూర్తిగా సర్కార్ వైఫల్యమేనన్నారు. పలువురు బీజేపీ నాయకులు డ్యాంను పరిశీలించారు.

# రూ.4 వేల పెన్షన్ పెంపు...

# ముహూర్తం ఖరారు!




## ముందుగా వీరికే..!?

హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం మరో కీలక హామీ అమలుకు సిద్దమైంది. ఇందు కోసం పూర్తి వివారాలను సేక రిస్తోంది. ఆర్థిక వనరుల సమీకరణ పై కసరత్తు చేస్తోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఈ హామీ అమలుకు దాదాపు ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లోనూ తామే గెలుస్తాం.. తానే సీఎం అని చెబుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ దిశగా హామీల అమలు వేగవంతం చేయాలని డిసైడ్ అయ్యారు. అందు లో భాగంగా మరో ఎన్నికల హామీ అమలు పైన నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నట్లు సమాచారం. తెలంగాణ ప్రభుత్వం మరో కీలక హామీ అమలు దిశగా అడుగులు వేస్తోంది. అధికారంలోకి వచ్చి రేవంత్ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకుంది. దీంతో, పెండింగ్ హామీల అమలు పైన ప్రతిపక్ష పార్టీల నుంచి విమర్శలు వస్తున్నాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో విజయం తరువాత సీఎం రేవంత్ మరింత దూకుడుగా కనిపిస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రతిపక్షాలకు అవకాశం లేకుండా మరింత బలం పెంచుకోవాలని భావిస్తున్నారు. 2018 డిసెంబరు 7వ తేదీన ప్రమాణ స్వీకారం చేస్తే తొమ్మిదో తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని అమల్లోకి తెచ్చారు. ఈ పథకం విజయవంతంగా నడుస్తుంది. రెండు వందల యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్తు కూడా అమలు చేసింది. రైతులకు రెండు లక్షల వరకూ రైతు రుణ మాఫీ అమలు చేసింది. కాగా, మహాలక్ష్మి పథకం కింద ఐదు వందలకే వంట గ్యాస్ సిలిండర్ పథకం కొనసాగుతోంది. ఇక.. వెనుకబడిన తరగతులకు చెందిన మహిళలకు నెలకు రెండు వేల పథకం ఇంకా అమలు కాలేదు. వరి రైతులకు ఐదు వందల బోనస్ ను అందచేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు కూడా ప్రారంభమయ్యాయి. యువ వికాసం పథకం కింద ఐదు లక్షల విద్యాభరోసా కార్డు ను కూడా అమలు చేస్తున్నారు.

వృద్ధులు, వితంతవుల పింఛను ను పెంపుదల చేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. ఇందు కోసం లెక్కలు సిద్దం చేసారు. ఈ హామీ అమలు చేయటం ద్వారా ఖజానాపై ఎంత భారం పడుతుంది? నెలకు ఎంత ఖర్చవుతుందన్న వివరాలను ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు సేకరించినట్లు సమాచారం. ఏపీలో కూటమి ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన తరువాత వృద్ధులు, వితంతవులకు నెలకు నాలుగు వేల రూపాయలు ఇస్తుండటంతో ఇక్కడ కూడా పింఛను మొత్తాన్ని పెంచాలని ఆలోచన ప్రభుత్ చేస్తున్నట్లు తెలు స్తోంది. తాజా లెక్కల మేరకు తెలంగాణలో వృద్ధులు 12,30,000, దివ్యాంగులు ఐదు లక్షలు, వితంతువులు దాదాపు ఇరవై లక్షలు, నేత కార్మికులు 36,872, కల్లు గీత కార్మికులు 62,164, బీడి కార్మికులు 4,07,374, ఒంటరి మహిళలు 1,33,936, హెచ్ఐవీ రోగులు 32,718, కళాకారులు ముప్పయి వేల మందికి పైగానే ఉన్నారు. వీరిందరికీ పింఛను మొత్తాన్ని పెంచాల్సి ఉంది.

అంటే దాదాపు నలభై లక్షల మందికి పైగా పింఛను మొత్తాన్ని పెంచాల్సి ఉంది. ప్రస్తుతం వీరికి 2,116 పింఛను ఇస్తున్నారు. దీంతో.. ఆర్థికంగా సమస్యలు.. ఈ పథకం కోసం నిధుల సమీకరణ పైన కసరత్తు జరుగుతోంది. త్వరలోనే పథకం అమలు పైన అధికారికంగా ప్రకటన ఉండే అవకాశం కనిపిస్తోంది.

# కేసీఆర్ చుట్టూ ఆ పది మంది..!



హైదరాబాద్ : అధినేత కేసీఆర్ నుంచి మొదలు కీలక నేతలైన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావును..నేతలు, కార్యకర్తలతో కలవనివ్వకుండా కొంత మంది అడ్డుగోడల్లా నిలుస్తున్నారన్న చర్చ తెలంగాణ భవన్ వర్గాల్లో జరుగుతోంది. కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో అంటే ప్రోటోకాల్, సెక్యూరిటీ, ఆయన బిజీ షెడ్యూల్ కారణంగా చాలా మంది పార్టీ నేతలు, కార్యకర్తలు కలవలేకపోయారు. కానీ ఆ తర్వాత అడపాదడపా కేసీఆర్ పాల్గొంటున్న సభలు, సమావేశాల్లోనూ ఆయన దరిదాపుల్లోకి కూడా ఎవ్వరిని రానివ్వడం లేదన్న టాక్ వినిపిస్తోంది. అయితే ఇలా కేసీఆర్


## కేటీఆర్, హరీశ్ చుట్టూ వారే.. మరెవ్వరిని దగ్గరకు రానివ్వని ఆ పది మంది..

దగ్గరకు వెళ్లకుండా అడ్డుకుంటున్నది ఆయన గన్ మెన్‌లో, సెక్యూరిటీ సిబ్బంది కాదట. బీఆర్ఎస్ పార్టీలోని కొంత మంది ముఖ్యనేతలు మిగతా పార్టీ నేతలెవ్వరిని కేసీఆర్ దగ్గరకు రానివ్వడం లేదన్నది ఇక్కడ పాయింట్. తొమ్మిదిన్నరేళ్లు అధికారంలో ఉన్నప్పుడు, ఇప్పుడు ప్రతిపక్షంలోకి వచ్చాక కూడా ఈ పరిస్థితిలో ఏ మాత్రం మార్పు రాలేదన్నది పార్టీ నేతల వాదన. అధినేత కేసీఆర్ వచ్చినప్పుడే కాదు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు విషయంలోనూ ఇలాగే జరుగుతోందన్న చర్చ జరుగుతోంది. కేసీఆర్‌ను ఎలాగూ కలవలేకపోతున్నామని భావించే చాలా మంది లీడర్లు, కార్యకర్తలు కేటీఆర్, హరీశ్‌రావును కలిసేందుకు తెలంగాణ భవన్‌కు వస్తుంటారు.

కానీ ఇక్కడ కూడా ఆ పది మందే ఉంటారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కేటీఆర్, హరీశ్‌రావుల వచ్చిరాగానే ఆ పది మంది వాళ్ల చుట్టూ చేరిపోతారట. కేటీఆర్, హరీశ్ తిరిగి తెలంగాణ భవన్ నుంచి వెళ్లిపోయే వరకు పక్కకు జరగకుండా అడ్డుగోడలా ఉండిపోతున్నారట. దీంతో మిగతా నేతలు, కార్యకర్తలు అస్సలు కేటీఆర్, హరీశ్‌రావును కలిసేందుకు వీలుపడటం లేదట. మొన్న పార్టీ అధినేత కేసీఆర్ తెలంగాణ భవన్‌కు వచ్చినప్పుడు కూడా ఆ పది మంది నేతల హడావుడే ఎక్కువగా కనిపించిందన్న చర్చ జరుగుతోంది. కేసీఆర్ తెలంగాణ భవన్‌కు వచ్చే వరకు హడావుడి చేసి, మళ్లీ కేసీఆర్ రాగానే ఆయన చుట్టూ ఉండాలని ఆ పది మంది ప్రయత్నించడంతో ఒక్కసారిగా గందరగోళం నెలకొంది.

**నేతలు, కార్యకర్తలు తోసుకుంటూ వచ్చేసరికి..** కేసీఆర్‌ను చూసేందుకు నేతలు, కార్యకర్తలు తోసుకుంటూ వచ్చేసరికి కేటీఆర్ కూడా కింద పడబోయారు. ఓ సందర్భంలో కేటీఆర్‌ను వెనక్కి లాగే పరిస్థితి నెలకొంది. ఇక పార్టీ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ భవన్ ఇంచార్జ్ రావుల చంద్రశేఖర్ రెడ్డి కేసీఆర్‌కు కండువా కప్పిన తర్వాత లోపలికి వెళ్లే క్రమంలో తోపులాటకు కింద పడిపోయారు. ఆయనపై నుంచి నేతలు, కార్యకర్తలు వెళ్లడంతో అలర్ట్ అయిన మరికొంత మంది ఆయనను పక్కకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో రావుల చంద్రశేఖర్ రెడ్డి మొహానికి, కాలికి గాయాలయ్యాయి.

ఈ పరిస్థితిపై కేటీఆర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. పార్టీ సమావేశంలో పాల్గొనేందుకు తెలంగాణ భవన్‌కు కేసీఆర్ వచ్చేంత వరకు క్రౌడ్ కంట్రోల్ చేసిన నేతలు.. అధినేత రాగానే ఎప్పటిలా అయన చుట్టూ చేరిపోవడంతో పెద్దఎత్తున తోపులాట జరిగింది. పోనీ కేసీఆర్ అంటే ఎప్పుడో ఒకసారి తెలంగాణ భవన్‌కు వస్తారని సరిపెట్టుకున్నా..రెగ్యులర్‌గా తెలంగాణ భవన్ వచ్చే కేటీఆర్, హరీశ్‌రావు విషయంలోనూ ఇదే జరుగుతోందన్న టాక్ వినిపిస్తోంది. భవన్‌లోనే కాకుండా ఎక్కడ పార్టీ కార్యక్రమం జరిగినా ఆ పది మంది చుట్టూ చేరి మరెవ్వరిని కేటీఆర్, హరీశ్‌రావు దగ్గరకు రానివ్వడం లేదని పార్టీ నేతలు, కార్యకర్తలు వాపోతున్నారట. మరి ఈ విషయాన్ని కేటీఆర్, హరీశ్‌రావులు గమనించారో లేదో గానీ..ఇది పార్టీకి నష్టం చేస్తుందన్న చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతోంది.



## ఎన్టీఆర్ ఎడ్యుకేషనల్స్..

### ఒక చిన్న మొక్క నుంచి పెద్ద వృక్షంగా మారింది

హైదరాబాద్ : ఎన్టీఆర్ ఎడ్యుకేషనల్స్‌ను ఆరోజు 131 మందితో ప్రారంభించామని.. ఇప్పుడు వేల మంది పిల్లలు చదువుకుం టున్నారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. హెరిటేజ్ ఫుడ్స్‌ను 1993లో.. ఆ తర్వాత ఎన్టీఆర్ ట్రస్ట్‌ను ప్రారంభించామని పేర్కొన్నారు. తనకు గండిపేటకు వస్తే చాలా విషయాలు గుర్తుకు వస్తాయని.. మొదట్లో ఇది తెలుగుదేశం పార్టీ హెడ్ ఆఫీస్ అని గుర్తుచేసుకున్నారు. ఒకప్పుడు రాజకీయ నాయకులకు ఇది శిక్షణ కేంద్రమని.. ఇప్పుడు పిల్లలకు శిక్షణ ఇస్తున్నారని వివరించారు. గండిపేటలోని ఎన్టీఆర్ ఎడ్యుకేషనల్స్ ఇనిస్టిట్యూషన్స్ వార్షికోత్సవం ఇవాళ జరిగింది. ఈ వేడుకలో పాల్గొని ప్రసంగించారు సీఎం చంద్రబాబు. ఇప్పుడు విద్యార్థులు చదువుకుంటున్న క్లాస్ రూముల్లో.. ఆరోజు రాజకీయ నాయకులు శిక్షణ తీసుకున్నారని గుర్తుచేశారు. పది ఎకరాలు ఉన్న ఈ క్యాంపస్.. అప్పుడు ఒక చిన్న మొక్కలా ఉందని.. ఇప్పుడు పెద్ద వృక్షంలాగా మారిందని చెప్పుకొచ్చారు. తన సతీమణి భువనేశ్వరి ఎన్టీఆర్ ఎడ్యుకేషనల్స్ ఇనిస్టిట్యూషన్స్ ను సమర్ధవంతంగా నిర్వహిస్తున్నారని కొనియాడారు. ఎన్టీఆర్ ఎడ్యుకేషనల్స్‌లో చదువుకున్న విద్యార్థులు ఉన్నత స్థానంలో ఉన్నారని కీర్తించారు. కొంతమంది విద్యార్థులు గ్రూప్ వన్ పాస్ అయ్యారని.. మరి కొంతమంది దేశంలోని ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు తెచ్చుకున్నారని ప్రశంసించారు. 1995లో తాను మొదటిసారిగా ముఖ్యమంత్రి అయ్యాక ఐటీని ప్రారంభించానని గుర్తుచేశారు. ఒక్క ఇంజనీరింగ్ కాలేజ్‌తో ఎన్టీఆర్ ఎడ్యుకేషనల్స్‌ను ప్రారంభించామని.. ఇప్పుడు వందల కాలేజ్‌లు ఉన్నాయని చెప్పుకొచ్చారు. దేశంలో ఇప్పుడు చాలా మంది హైదరాబాద్ వచ్చి చదువుకుంటున్నారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# రేవంత్ దూకుడు !

## వెంటనే మున్సిపల్ ఎన్నికలు




హైదరాబాద్ : పంచాయతీ ఎన్నికలను పూర్తి చేసిన తెలంగాణ ప్రభుత్వం ఇప్పుడు మున్సిపల్ ఎన్నికలపై దృష్టి పెట్టింది. గ్రేటర్ హైదరాబాద్ పాలకవర్గం ముగిసిపోయే నాటికి మొత్తం ఇతర మున్సిపల్ సహా..గ్రేటర్ పాలక వర్గానికీ ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించుకున్నట్లుగా తెలుస్తోంది. ఆలస్యమయ్యే కొద్దీ సమస్యలు వస్తాయని.. నిర్వహించేయాలని నిర్ణయానికి వచ్చినట్లుగా కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే అన్ని మున్సిపాల్టీల్లోని కాంగ్రెస్ నేతలకు.. ఎన్నికలకు సిద్ధం కావాలని సమాచారం వెళ్లినట్లుగా చెబుతున్నారు.

**మున్సిపాలిటీ కార్యవర్గాల పదవి కాలం ముగిసి ఏడాది...** మున్సిపాలిటీల కార్యవర్గాల పదవి కాలం ముగిసి ఏడాది అవుతోంది. ఇప్పటికే స్పెషల్ ఆఫీసర్ల పాలనలో ఉన్నాయి. ఫిబ్రవరి వరకూ గ్రేటర్ హైదరాబాద్ పాలకవర్గం గడువు ఉంటుంది. చట్టబద్ధంగా గడువు ముగిసేలోపే ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ పరిపాలనాపరమైన కారణాల వల్ల నిర్ణయం తీసుకోలేదు. బీసీ రిజర్వేషన్ల అంశంతో ప్రభుత్వం రాజకీయం చేయడంతో.. ఎన్నికల నిర్వహణ పెండింగ్ పడిపోయింది. ఆ అంశం తేలే అవకాశం లేకపోవడంతో కోర్టు ఉత్తర్వుల ప్రకారం పంచాయతీ ఎన్నికలునిర్వహించారు. ఇప్పుడు అదే పద్దతిలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలనుకుంటున్నారు.

**గతంలో అధికార బీఆర్ఎస్ స్వీప్...** తెలంగాణ రాష్ట్రంలో గత మున్సిపల్ ఎన్నికలు జనవరి 2020లో జరిగాయి. ఆ సమయంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 120 మున్సిపాలిటీలు , 9 మున్సిపల్ కార్పొరేషన్లకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది.

అప్పటి అధికార పార్టీ అయిన భారత్ రాష్ట్ర సమితి క్లీన్ స్వీప్ చేస్తూ దాదాపు 109 మున్సిపాలిటీలను, మొత్తం 9 కార్పొరేషన్లను కైవసం చేసుకుని రికార్డు సృష్టించింది. కాంగ్రెస్, బిజెపి , ఎంఐఎం పార్టీలు స్వల్పంగా మున్సిపాలిటీలను దక్కించుకోగలిగాయి. కాంగ్రెస్ పార్టీ 4 మున్సిపాలిటీల్లో మాత్రమే విజయం సాధించింది. బిజెపి ఆమనగల్ , తుక్కుగూడ వంటి 2 మున్సిపాలిటీల్లో జెండా పాతగా, ఎంఐఎం భైంసా , జల్పల్లి మున్సిపాలిటీలను గెలుచుకుంది.

2020లో కొలువుదీరిన ఈ మున్సిపల్ పాలకవర్గాల ఐదేళ్ల పదవీకాలం జనవరి 2025 నాటికి ముగియనుంది.

**ఇప్పుడు కాంగ్రెస్ వంతు...** ఇప్పుడు అధికారంలో కాంగ్రెస్ ఉంది. సర్పంచ్ ఎన్నికల్లో మంచి ప్రభావం చూపించామని అనుకుంటున్నందున ఇక పట్టణాల్లోనూ కాంగ్రెస్ పార్టీ హవా తగ్గలేదని నిరూపించాలని అనుకుంటున్నారు. అందుకే మున్సిపల్ ఎన్నికలు తెలంగాణ రాజకీయాల్లో అత్యంత కీలకం కానున్నాయి. ప్రతిపక్ష బిఆర్ఎస్ తన పాత కోటలను కాపాడుకోవాలని ప్రయత్నిస్తోంది. మరోవైపు బిజెపి పట్టణ ప్రాంతాల్లో తనకున్న బలాన్ని ఓట్లుగా మలుచుకోవాలని ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

ఇంకా ఆలస్యం చేస్తే సమస్యలు వస్తాయని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. అందుకే రేవంత్ ఎన్నికలు నిర్వహించేస్తాని నమ్మకంగా .. ఏర్పాట్లు ప్రారంభించుకున్నారు.




హైదరాబాద్ : మాసబ్‌ట్యాంక్ డ్రగ్స్ కేసుపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈకేసులో నిందితుడు ప్రముఖ హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ సోదరుడు అమన్ ప్రీత్ సింగ్ పరారీలో ఉన్నాడు. హీరోయిన్ సోదరుడి కోసం ఈగల్ టీం, మాసబ్ ట్యాంక్ పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. ట్రూప్ బజార్‌కు చెందిన నితిన్ సింఘానియా, శ్రనిక్ సింఘ్విల అరెస్టుతో నటి సోదరుడు పేరు బయటకు వచ్చిన విషయం తెలిసిందే. పట్టుబడ్డ ఇద్దరు వ్యాపారులకు నలుగురు రెగ్యులర్ కస్టమర్లు సప్లై చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇద్దరు వ్యాపారవేత్తల నుంచి నటి సోదరుడు డ్రగ్స్ కొనుగోలు చేసినట్లు బయటపడింది. వ్యాపారవేత్తల నుంచి 43 గ్రాముల కొకైన్, ఎండీఎంఏ డ్రగ్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే టాలీవుడ్, బాలీవుడ్‌లో మంచి గుర్తింపు ఉన్న ప్రముఖ నటి సోదరుడి కోసం పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. కాగా.. న్యూఇయర్ వేడుకల సందర్భంగా ఈగల్ టీం హైదరాబాద్ వ్యాప్తంగా దృష్టి సారించింది. డ్రగ్స్ నివారణకు ఎక్కడికక్కడ తనిఖీలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ఇటీవల డిసెంబర్ 19న మాసబ్ ట్యాంక్ వద్ద ట్రూప్‌బజార్‌కు చెందిన ఇద్దరు వ్యాపారులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ సోదరుడు తరచుగా డ్రగ్స్ కొనుగోలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో అతని కోసం పోలీసులు వెతుకుతున్నారు. కాగా.. గత సంవత్సరం కూడా డ్రగ్స్ కేసులో సైబరాబాద్ పోలీసులకు నటి సోదరుడు పట్టుబడిన విషయం తెలిసిందే. ఇప్పుడు తాజాగా మరోసారి డ్రగ్స్ వ్యవహారంలో ఇరుక్కోవడం సంచలనంగా మారింది.




## ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచా.. ఉప ఎన్నిక వస్తే మళ్లీ విజయమే: దానం నాగేందర్

హైదరాబాద్: రాజీనామా అంశం, ఉపఎన్నికల్లో పోటీ చేయడంపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హిమాయత్‌నగర్ డివిజన్ కార్యకర్తలతో ఆయన సమావేశమై మాట్లాడారు. రాజీనామా చేసి ఉపఎన్నికలకు వెళ్లేందుకు తనకు ధైర్యం ఉందని.. అది కార్యకర్తల ద్వారా వచ్చిందని చెప్పారు. కార్యకర్తల అండతోనే ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలిచినట్లు చెప్పారు. ఉపఎన్నిక వస్తే మళ్లీ గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. సీఎం పదవికి గౌరవం ఇవ్వడం మరిచింది బీఆర్ఎస్ నేతలే అని విమర్శించారు. ముఖ్యమంత్రిని ఏకవచనంతో అగౌరవంగా మాట్లాడింది ఆ పార్టీ వాళ్లేనని మండిపడ్డారు. విమర్శలు చేస్తే.. ప్రతివిమర్శలూ ఎదుర్కోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

## అకున్ సబర్వాల్ సేకరించిన ఆధారాలు ఏమయ్యాయి?: కేంద్ర మంత్రి బండి సంజయ్



హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ కేసులను తీవ్రంగా పరిగణించడంలేదని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం పండుగలు, నూతన సంవత్సర వేడుకల సమయంలోనే డ్రగ్స్ కేసుల నమోదుకు పరిమితమవుతున్నారని ఆక్షేపించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అకున్ సబర్వాల్ ఆధ్వర్యంలో జరిపిన 'డ్రగ్స్ కేసు' విచారణ నివేదికపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని బండి సంజయ్ విడుదల చేసిన ప్రకటనలో ప్రశ్నించారు. "నాటి డ్రగ్స్ కేసులో అనేక మంది బడా వ్యక్తులు, సినీ ప్రముఖులు ఉన్నారు. పట్టుబడిన వాళ్లను అకున్ సబర్వాల్ టీం నాడు విచారణ చేస్తే.. ఆ వాంగ్మూలంతో కూడిన ఆడియో, వీడియో రికార్డులు బయటకు రాకుండా అడ్డుకున్నారు. అదే సమయంలో ఆ కేసుపై అకున్ సబర్వాల్ టీం రూపొందించిన నివేదిక, రికార్డు చేసిన ఆడియో, వీడియో, స్టేట్ మెంట్లన్నింటినీ నాటి సీఎస్ సోమేశ్ కుమార్ స్వాధీనం చేసుకున్నారు. ఆ తరువాత డ్రగ్స్ కేసును పూర్తిగా నీరుగా ర్చారు. అకున్ సబర్వాల్ సేకరించిన ఆధారాలు, ఆడియో, వీడియో రికార్డులు, స్టేట్ మెంట్లను సోమేశ్ కుమార్ తదుపరి విచారణ టీమ్‌కు అప్పగించలేదు.. వాటిని కోర్టుకు స్వాధీనం చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజంగా డ్రగ్స్ నిర్మూలనపై చిత్తశుద్ధి ఉంటే సీఎం ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఈగల్ టీమ్ వెంటనే రంగంలోకి దిగి సోమేశ్ కుమార్‌ను విచారించాలి. ఈగల్ టీమ్‌లో సమర్థులైన అధికారులు ఉన్నప్పటికీ, ఒకరిద్దరు మాత్రం డ్రగ్స్ పెడ్లర్లతో రాజీపడుతున్నారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా పెరుగుతున్న డ్రగ్స్ విక్రయాలపై ఉక్కుపాదం మోపాలంటే.. అకున్ సబర్వాల్ వంటి సమర్థులైన అధికారులకు తిరిగి 'డ్రగ్స్ కేసు' విచారణ బాధ్యతలను అప్పగించాలని డిమాండ్ చేశారు.

## కార్మికులపై కక్ష కట్టినట్లుగా సీఎం వ్యవహారం: హరీశ్‌రావు



హైదరాబాద్: డిపెండెంట్ ఉద్యోగుల అంశంలో రాష్ట్ర ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. మొత్తం ఉద్యోగుల్లో సగం మంది డిపెండెంట్ ఉద్యోగులే ఉన్నారని చెప్పారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మెడికల్ బోర్డు ఏర్పాటు చేస్తామని చెప్పిందన్నారు. కార్మికులపై కక్ష కట్టినట్లుగా సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. "సింగరేణి నిధులను ముఖ్యమంత్రి దుర్వినియోగం చేస్తున్నారు. మెస్సీ టూర్ కోసం సింగరేణి నిధులు ఎందుకు వాడారు? దీనిపై అధికారంలోకి వచ్చాక విచారణ చేయిస్తాం. తప్పు చేసిన వారిని జైల్లో పెడతాం. సింగరేణిని ప్రైవేటుపరం చేసే కుట్ర జరుగుతోంది. తక్షణమే మెడికల్ బోర్డు పెట్టి కార్మికుల పిల్లలకు ఉద్యోగాలకు ఇవ్వాలి. లేదంటే వారితో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇల్లు ముట్టడిస్తాం. జర్నలిస్టుల అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం. వారికి ధర్నా చేసే హక్కు లేదా.. ప్రశ్నించే హక్కు లేదా? కేసీఆర్ హయాంలో 26 వేల అక్రిడిటేషన్ కార్డులు ఇచ్చాం. వారి సంక్షేమం కోసం రూ.100 కోట్ల నిధి ఇచ్చాం.

డెస్కుల్లో పని చేసే జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వబోమని రేవంత్‌రెడ్డి అంటున్నారు. కార్డులను 26 వేల నుంచి 10 వేలకు తగ్గిస్తున్నారు" అని హరీశ్‌రావు అన్నారు.




కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ కీలక వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్‌లో మారుతున్న సైనిక వ్యూహాలు, అభివృద్ధి చెందుతున్న హైపర్ సోనిక్ క్షిపణి వ్యవస్థలను.. భారత్ తేలిగ్గా తీసుకోకూడదని హెచ్చరించారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ థరూర్ ఈ వ్యాఖ్యలు చేశారు. పాక్‌తో ఉన్న గత అనుభవాల నుంచి భారత్ చాలా నేర్చుకున్నందున ఏ పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు పూర్తి సిద్ధంగా ఉండాలన్నారు. డ్రోన్లు, రాకెట్లు, క్షిపణుల తర్వాత హైపర్‌సోనిక్ సాంకేతికతపై పాక్ దృష్టిసారించిందన్నారు.

ఇది భారత్ తేలికగా తీసుకునే విషయం కాదన్నారు. పాక్‌లో ప్రజాస్వామ్యం నామమాత్రంగానే ఉందని.. ఇప్పటికీ సైనిక ఆధిపత్యమే కొనసాగుతుందన్నారు. ఆర్థికంగా దుర్భర పరిస్థితిలో ఉన్న ఆ దేశం.. విదేశాల నుంచి అందే సాయంపైనే ఆధారపడుతుందని థరూర్ అన్నారు. ఇక, బంగ్లాదేశ్ దాని సొంత సమస్యలతో సతమతమవుతోందన్నారు. పాక్‌తో రక్షణ ఒప్పందానికి బంగ్లా చేస్తున్న చర్చల గురించి ప్రస్తావిస్తూ.. భారత్ మాకు శత్రువు అనే అభిప్రాయాన్ని కల్పించే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

పొరుగు దేశాల్లో పెరుగుతున్న భారత వ్యతిరేకతపై ఆయన మాట్లాడుతూ.. బంగ్లాలో స్థిరమైన, శాంతియుత వాతావరణం మనకు చాలా కీలకమన్నారు. ఈశాన్య రాష్ట్రాలను భారత్ నుంచి విడదీస్తామంటూ వస్తోన్న హెచ్చరికలపై ఆందోళన వ్యక్తం చేశారు.




## ఇటుకలతో దాడి.. బంగ్లాదేశ్‌లో ప్రముఖ సింగర్ కార్యక్రమంలో షాకింగ్ ఘటన

బంగ్లాదేశ్‌లో పరిస్థితులు నానాటికీ దిగజారుతున్నాయి. కళాకారులు, సాంస్కృతిక సంస్థలే టార్గెట్‌గా మతమౌఢ్యం పేరుకుపోయిన కొందరు రెచ్చిపోతున్నారు. తాజాగా అల్లరి మూకలు ఇలా నానా రభసా సృష్టించడంతో ఓ ప్రముఖ గాయకుడి సంగీత కార్యక్రమం రద్దయిపోయింది. ప్రముఖ సింగర్ జేమ్స్ ఆధ్వర్యంలో ఫరీద్‌పూర్‌లో ఓ సంగీత కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక స్కూల్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ ఈవెంట్‌ను ప్లాన్ చేశారు. రాత్రి 9.00 గంటలకు కార్యక్రమం ప్రారంభం కావాల్సి ఉంది. ఇంతలో అల్లరి మూకలు వేదిక వద్ద రణరంగాన్ని సృష్టించాయి. ప్రేక్షకులపైనా, వేదికపైనా ఇటుకలు, రాళ్లు విసిరి నానా రభసా చేశాయి. అక్కడున్న విద్యార్థులు వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. పరిస్థితి చేయి దాటడంతో చివరకు నిర్వాహకులు ఈవెంట్‌ను రద్దు చేశారు. స్థానిక అధికారుల సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ఘటనలో సుమారు 25 మంది గాయపడ్డట్టు తెలుస్తోంది. ఈ ఘటనపై ప్రముఖ రచయిత్ర తస్లీమా నస్రీన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒక సాంస్కృతిక వేదిక బూడిదగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ సంస్కృతుల మధ్య వారధిగా నిలవాల్సిన మరో సంస్థ కూడా బూడిదగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల మరో మాయిస్ట్రో కళాకారుడు సిరాజ్ అలీ ఖాన్‌కు కూడా ఇలాంటి అనుభవం ఎదురైందని ఆవేదన వ్యక్తం చేశారు. అల్లరి మూకల రభసతో ఆయన తన ప్రదర్శన ఇవ్వకుండానే వెనుదిరగాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. సంగీతాన్ని ద్వేషించే జీహాదీలు ఉన్న బంగ్లాదేశ్‌లో ప్రదర్శన ఇచ్చేది లేదని అర్మాన్ ఖాన్ కూడా స్పష్టం చేసినట్టు పేర్కొన్నారు. ప్రభుత్వ అధికార యంత్రాంగం, పోలీసులు చూసీచూడనట్టు వ్యవహరిస్తూ బంగ్లాదేశ్‌లో మతమౌఢ్యాన్ని ప్రోత్సహిస్తున్నారు. దీంతో, అల్లరి మూకలు రెచ్చిపోతున్నాయి. ఛాయానౌత్, ఉడిచి వంటి సాంస్కృతిక సంస్థలతో పాటు ఆర్టిస్టులు, జర్నలిస్టులపైనా దాడులు పెరిగాయి. వచ్చే ఫిబ్రవరిలో జరగాల్సిన ఎన్నికలు వాయిదా పడేలా చేసేందుకు ప్రభుత్వమే ఇలాంటి అల్లర్లను ప్రోత్సహిస్తోందన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.

## దళితుల భూములను దౌర్జన్యంగా లాక్కున్నారు.. కవిత ఫైర్



నాగర్ కర్నూల్ జిల్లా,డిసెంబరు 27 : కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డిపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డిది డైవర్షన్, కరప్షన్ పాలన అని విమర్శలు చేశారు. ఇవాళ(శనివారం) నాగర్ కర్నూలు జిల్లాలో జనం బాటలో భాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టకి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని ధైర్యం చెప్పారు. అనంతరం మీడియాతో మాట్లాడారు కవిత. మెడికల్ కాలేజీకి 40 ఎకరాల దళితుల భూములను దౌర్జన్యంగా లాక్కున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో కాంట్రాక్టర్లకు అడ్వాన్స్‌డ్ కల్చర్‌ని సీఎం రేవంత్‌రెడ్డి తీసుకువచ్చారని ఆక్షేపించారు. దుందిబీ నదిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు పోటాపోటీగా ఇసుక దోపిడీ చేస్తున్నారని ఆరోపణలు చేశారు. అభివృద్ధి అవకాశాలు అందరికీ సమానంగా రావాలని సూచించారు. సామాజిక తెలంగాణ సాధనకు తాను కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో కాళేశ్వరాన్ని పరుగులు పెట్టించినట్లుగా పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టును ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. నల్ల మట్టి తీసేందుకు రైతుల వద్ద తీసుకున్న900 ఎకరాల భూమిని వారికి వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. పదేళ్లలో డిండి ప్రాజెక్టకి నీటిని తరలించలేదని.. ప్రభుత్వం మారిన కూడా ఇంకా సర్వేలే జరుగుతున్నాయని కవిత విమర్శించారు.

## మహిళా కమిషన్ విచారణకు నటుడు శివాజీ.. స్టేట్‌మెంట్ రికార్డ్

హైదరాబాద్ : నటుడు శివాజీ బుద్ధభవన్‌లో మహిళా కమిషన్ ఎదుట విచారణకు హాజరయ్యారు. హీరోయిన్స్‌ను ఉద్దేశించి శివాజీ చేసిన అభ్యంతర వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపాయి. ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరించిన మహిళా కమిషన్ వివరణ ఇవ్వాలని శివాజీకి నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో విచారణకు హాజరైన శివాజీ.. ఆ వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. శివాజీ స్టేట్‌మెంట్‌ను మహిళా కమిషన్ రికార్డ్ చేసుకుంది. ఇప్పటికే ఈ అంశంపై సోషల్ మీడియా వేదికగా శివాజీ క్షమాపణలు చెప్పారు. అనుకోకుండా మాటలు దొర్లాయని మహిళా కమిషన్ ముందు శివాజీ స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు తెలుస్తోంది. మరోసారి ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకుంటామని నటుడు చెప్పినట్లు సమాచారం. కాగా.. ఇటీవల దండోరా చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో హీరోయిన్‌ల వస్త్రధారణను ఉద్దేశించి నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దానిపై సోషల్ మీడియాలో స్పందించిన శివాజీ.. తాను అన్న మాటలను వెనక్కి తీసుకుంటున్నాను.. క్షమించాలని కోరారు. అయినప్పటికీ మహిళా కమిషన్ మాత్రం.. ఆ వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాల్సిందే అంటూ నటుడికి నోటీసులు ఇచ్చింది. దీంతో శివాజీ వ్యక్తిగతంగా విచారణకు హాజరై.. మహిళా కమిషన్‌కు వివరణ ఇచ్చారు.




పుష్ప 2 తొక్కిసలాట ఘటనకు సంబంధించి చిక్కడపల్లి పోలీసులు ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. పోలీసులు 23 మంది నిందితులను ఛార్జ్‌షీట్‌లో చేర్చారు. సంధ్య థియేటర్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే తొక్కిసలాట జరిగిందని పోలీసులు నిర్ధారించారు. పుష్ప 2 హీరో అల్లు అర్జున్‌ను ఏ11గా.. సంధ్య థియేటర్ యాజమాన్యాన్ని ఏ1గా చేర్చారు. ముగ్గురు మేనేజర్లు , 8 మంది బౌన్సర్లను సైతం ఛార్జ్ షీట్‌లో చేర్చారు. అంతేకాదు నలుగురు ప్రత్యక్ష సాక్షులను కూడా పోలీసులు ఛార్జ్‌షీట్‌లో చేర్చారు. 2024 డిసెంబర్ నెలలో తొక్కిసలాట ఘటన చోటుచేసుకున్న సంగతి తెలిసిందే.


**డిసెంబర్ 3వ తేదీ రాత్రి విషాదం...** అల్లు అర్జున్, రష్మిక మందన్నా జంటగా నటించిన పుష్ప 2 సినిమా డిసెంబర్ 3వ తేదీ రాత్రి ప్రీమియర్లు పడ్డాయి. ప్రీమియర్ షో చూడ్డానికి హైదరాబాద్‌కు చెందిన రేవతి, ఆమె కుమారుడు శ్రీతేజ్ సంధ్య థియేటర్‌కు వెళ్లారు. ఈ నేపథ్యంలోనే థియేటర్ దగ్గర తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ తొక్కిసలాటలో రేవతి అక్కడికక్కడే చనిపోయింది. శ్రీతేజ్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడ్ని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ఇక, ఈ తొక్కిసలాట కేసుకు సంబంధించి గతంలో అల్లు అర్జున్ అరెస్ట్ అయ్యారు. జైలులో కూడా ఉన్నారు. కాగా, ప్రమాదం జరిగి సంవత్సరం అయినా కూడా శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితి మెరుగుపడలేదు. ఇప్పటికీ మాట్లాడలేకుండా.. నడవలేకుండా ఉన్నాడు. కొడుకు ఆరోగ్య పరిస్థితిపై శ్రీతేజ్ తండ్రి భాస్కర్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ పరిస్థితి గురించి చెబుతూ కన్నీళ్లు పెట్టుకున్నారు. ఇక, శ్రీ తేజ్ ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం గతంలో అల్లు అర్జున్, అల్లు అరవింద్ 75 లక్షల రూపాయలు సాయం చేశారు. అంతేకాదు.. భాస్కర్ కుటుంబాన్ని ఆదుకోవటానికి 2 కోట్ల రూపాయలు అకౌంట్‌లో డిపాజిట్ చేసినట్లు నిర్మాత దిల్ రాజు తెలిపారు.

# భారత శిక్షా స్మృతి సృష్టి కర్త మెకాలే

## – భారత్ లో మెకాలే మెగా సేవలు

## – డిసెంబర్ 28... లార్డ్ మెకాలే వర్ధంతి

లార్డ్ మెకాలే ... ఈ పేరు వినగానే వెంటనే సూరేణకు వచ్చేది భారత దేశంలో ఆంగ్ల విద్యకు పునాది వేసిన వ్యక్తి. కానీ చాలా మందికి తెలియని విషయం... మెకాలే భారత శిక్షా స్మృతి (ఇండియన్ పీనల్ కోడ్ 1860) సృష్టికర్త అని. ఆయన లా కమిషన్ ఛైర్మన్ గా నేటికీ చెక్కుచెదరని మూల రూపం గల ఐ పి సి చిత్తు ప్రతి తయారు చేయబడిందని. 19వ శతాబ్దపు కవి, చరిత్రకారుడు, రాజనీతివేత్త, లార్డ్ మెకాలే (థామస్ బాబింగ్టన్ మెకాలే, ఫస్ట్ బేరన్ మెకాలే పి.సి. (1800 అక్టోబరు 25 .. 1859 డిసెంబర్ 28) వర్ధంతి సందరరేగా, ఇండియన్ పీనల్ కోడ్ పూర్వా పరాలను తెలుసుకుందాం. 1830కి ముందు, భారతదేశంలో, 'ది ఇంగ్లీష్ క్రిమినల్ లా', అనేక చట్ట సవరణలతో, నాటి ప్రెసిడెన్సీ టౌన్లు.. బొంబాయి, కలకత్తా, మద్రాసులలో అమలు జరిగేది. లార్డ్ మెకాలే, నాటి "ఫ్రెంచి పీనల్ కోడ్", "లివింగ్‌స్టోన్స్ కోడ్ ఆఫ్ లూసియానా" అనే రెండు ప్రామా ణిక గ్రంథాలను ఆదర్శంగా తీసు కుని, ఇండియన్ పీనల్ కోడ్ 'చిత్తుప్రతి'ని తయారు చేసాడు. భారతీయుల ప్రామాణిక గ్రంథాలైన మనుస్మృతి ని, యాజ్ఞవల్క్య స్మృతిని, నాటి వైదిక పండితుల సలహా, సహాయం కూడా తీసు కున్నాడు. శిక్షల విషయంలో, ఆ నాటి పెద్దలు, పండితులు, రాజులు అభిప్రాయాలను కూడా లెక్కలోకి తీసుకున్నాడు. లార్డ్ మెకాలే మహా మేధావి అయినా, తన అభిప్రాయాల కంటే, నాటి భారత దేశ మత, సాంఘిక, సామాజిక వ్యవస్థలకు, ఆచార వ్యవహారాలకు విలువ ఇచ్చి, వారి అభిప్రాయాలను గౌరవించి, తన మేధస్సుతో 'ఇండియన్ పీనల్ కోడ్' చిత్తుప్రతి తయారు చేశాడు. ఇండియన్ పీనల్ కోడ్ 1837 లోనే నాటి గవర్నర్ జనరల్ ఆఫ్ ఇండి యా ఇన్ – కౌన్సిల్ కి నివేదించినా, 1860 సంవత్సరం వరకూ అది వెలుగు చూడలేదు. లార్డ్ మెకాలే తయారుచేసిన 'చిత్తు ప్రతి' ని, నాటి ఛీఫ్ జస్టిస్ సర్ బార్నెస్ పీకాక్, కలకతా సుప్రీమ్ కోర్టు న్యాయాధిపతి (ఇతను నాటి లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యుడు కూడా) సునిశితంగా, సుదీరంగా, పరిశీ లించి, పరీక్షించాడు. అయన సుదీర పరిశీలన తర్వాత ఇండి యన్ పీనల్ కోడ్ 1860 అక్టోబరు 6 నాడు చట్టసభ ఆమోదం పొందింది. ఇండియన్ పీనల్ కోడ్ మూలాలు 1860 నాటి ఆంగ్లేయుల వలస పాలనలో (బ్రిటిష్ ఇండియా) ఉన్నాయి. 1860 నాటి బ్రిటిష్ ఇండియా చేసిన 45వ చట్టం ద్వారా ఇండియన్ పీనల్ కోడ్ అమలులోకి వచ్చింది. మొట్ట మొదటి ఇండియన్ పీనల్ కోడ్ చిత్తుప్రతి 1860 లో, మొదటి లా కమిషన్ అజమా యిషిలో జరి గింది. మొదటి లా కమిషన్ ఛైర్మన్ లార్డ్ మెకాలే (థామస్ బాబింగ్టన్ మెకాలే). మొదటి ఇండియన్ పీనల్ కోడ్ 1862 సంవత్సరంలో, అమలులోకి వచ్చింది. నాటినుంచి ప్రపంచం లోను, భారతీయ సమాజాల లోను, విద్యాపరంగా, వైజ్ఞానికంగా, అనేక రంగాలలో,అనేక రకాలుగా జరిగిన సమస్తమైన మార్పుల ప్రాతిపదికగా భారతీయ శిక్షాస్మృతి అనేకమైన మార్పులు, చేర్పులకు గురి అవుతూ, నేటి రూపాన్ని పొందింది. అందుకు గృహ హింస సెక్షన్ 498–ఎ ఒక ఉదాహరణగా తీసుకో వచ్చు. మన



భారతీయ శిక్షాస్మృతి లో 511 సెక్షన్లు ఉన్నాయి. వరకట్నం చట్టాలు మరో ఉదా హరణ. వరకట్న సమస్య, ఐరోపా, అమెరికా దేశాలలో లేదు కాబట్టి, వరకట్న చట్టాలు, శిక్షలు వారి శిక్షాస్మృతిలో లేవు. పాకిస్తాన్ స్వాతంత్ర్యం పొందిన తర్వాత, ఇండియన్ పీనల్ కోడ్ ను యధాతధంగా పాకిస్తాన్ తన దేశంలో అమలు చేసింది. దాని పేరు "పాకిస్తాన్ పీనల్ కోడ్" (పి.పి.సి). బంగ్లాదేశ్ కూడా "బంగ్లాదేస్ పీనల్ కోడ్" పేరుతో అమలు చేసింది. బ్రిటిష్ వలస దేశాలైన, మియన్మార్ (నాటి బర్మా), శ్రీలంక (నాటి సిలోన్), మలేసియా, సింగపూర్, బ్రూనీ దేశాలు కూడా ఇండియన్ పీనల్ కోడ్ ను యధాతధంగా అమలు చేస్తున్నాయి. ఇండియన్ పీనల్ కోడ్ జమ్ము కాశ్మీర్లో కూడా అమలు లో ఉంది. కానీ, ఈ రాష్ట్రంలో ఇండియన్ పీనల్ కోడ్ అనరు. "రన్‌బీర్ పీనల్ కోడ్" (ఆర్.పి.సి) అని పిలుస్తారు. ఇండియన్ పీనల్ కోడ్ సృష్టికర్త లార్డ్ మెకాలే, 1859 డిసెంబరు 28 న, తన 59వ ఏట, మరణించిన క్రమంలో తన కృషి సాకారమై, చట్టమై, అమలు జరగటం చూడనే లేదు. నాటి ఇండియన్ పీనల్ కోడ్ చిత్తుప్రతి, మూల రూపం, నేటికీ చెక్కు చెదరలేదు. దీనిమీద కొన్ని విమర్శలు ఉన్నప్పటికీ, ఈ నాటికీ, న్యాయశాస్త్రంలో, దీనికి తిరుగు లేదు. 161 ఏళ్లల్లో మార్పులు ఎన్ని వచ్చినా, శిక్షాస్మృతి చెక్కు చెదరకుండా ఉన్నది అంటే, మెకాలే దూరదృష్టి అమోఘం. మేధస్సు అదుతేం. ఆయన కృషి అనితర సాధ్యం.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాల మిస్ట్...9440595494**

# భారత పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా

## డిసెంబర్ 28...రతన్ నవల్ టాటా జయంతి

భారత దేశ పారిశ్రామిక రంగంలో గొప్ప మార్పులను సృష్టించిన వ్యక్తి రతన్ నవల్ టాటా. ఆయన నిపుణత, వ్యాపార దృష్టి, సమాజం పట్ల ఉన్న బాధ్యతభావం భారతీయ వ్యాపార రంగంలో ఒక కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాయి. టాటా గ్రూప్‌ను అంతర్జాతీయ స్థాయికి చేర్చడమే కాకుండా, భారతీయుల జీవితాలను మెరుగుపరిచే అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.

**ప్రారంభ జీవితం...** 1937 డిసెంబర్ 28న ముంబైలో జన్మించిన రతన్ టాటా, టాటా కుటుంబానికి చెందినవారు. ఆయన తండ్రి నవల్ టాటా, తల్లి సోనూ టాటా. చిన్నతనంలో తల్లిదండ్రుల విడాకుల కారణంగా ఆయన నానమ్మ సారస్వతీ టాటా సంరక్షణలో పెరిగారు. చిన్నప్పటి నుంచే రతన్ టాటాలో వినూత్న ఆలోచనల పట్ల ఆసక్తి కనిపించేది. విద్యలోనూ ఆయన ప్రావీణ్యం ప్రత్యేకమైంది. ముంబైలోని క్యాంపియన్ స్కూల్‌లో తన పాఠశాల విద్యను పూర్తి చేసిన తర్వాత, అమెరికాలోని కార్నెల్ యూనివర్సిటీ నుండి ఆర్కిటెక్చర్‌లో డిగ్రీని సంపాదించారు. అదే సమయంలో హార్వార్డ్ బిజినెస్ స్కూల్‌లో మేనేజ్‌మెంట్ కోర్సును కూడా పూర్తి చేశారు.

**టాటా గ్రూప్‌లో ప్రవేశం..** రతన్ టాటా తన కెరీర్‌ను 1962లో టాటా స్టీల్ డివిజన్‌లో ప్రారంభించారు. ఫ్లోర్ మేనేజర్‌గా చిన్నస్థాయి ఉద్యోగం నుంచి ప్రారంభించి, సమర్థత, వినయం, కృషి ద్వారా అత్యున్నత స్థాయికి ఎదిగారు. 1991లో, జెఆర్డీ టాటా పదవీ విరమణ అనంతరం, రతన్ టాటా, టాటా గ్రూప్ ఛైర్మన్‌గా నియమితులయ్యారు.

**టాటా గ్రూప్‌పై రతన్ టాటా ప్రభావం..** రతన్ టాటా ఛైర్మన్‌గా ఉన్న కాలంలో, టాటా గ్రూప్ అనేక కొత్త విజయాలను సాధించింది.


**వ్యాపార విస్తరణ...** రతన్ టాటా నాయకత్వంలో టాటా గ్రూప్ అనేక కొత్త రంగాలలోకి ప్రవేశించింది. ఆటోమొబైల్స్, టెక్నాలజీ, గ్లోబల్ హొటల్స్, రిటైల్, టెలికమ్యూనికేషన్ వంటి విభాగాలలో టాటా గ్రూప్ ప్రపంచంలో పేరు తెచ్చుకుంది.

**మైలురాయిగా నిలిచిన ప్రాజెక్టులు...** టాటా నానో: ప్రపంచంలో అతి తక్కువ ధరతో కార్‌ను రూపొందించడం ద్వారా సామాన్యుడి కలను నిజం చేశారు. జాగ్వార్–ల్యాండ్ రోవర్: బ్రిటన్‌కు చెందిన ఈ బ్రాండ్లను కొనుగోలు చేసి, టాటా మోటార్స్‌ను అంతర్జాతీయంగా గుర్తింపును తెచ్చిపెట్టారు. టాటా టీ: బ్రిటిష్ బ్రాండ్ టెట్‌లీ టీని కొనుగోలు చేసి, టాటా గ్రూప్‌ను అంతర్జాతీయ పానీయ మార్కెట్లోకి ప్రవేశపెట్టారు.

**నూతన ఆవిష్కరణలు:** రతన్ టాటా నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించి, టాటా గ్రూప్‌లో సాంకేతిక పరిజ్ఞానానికి పెద్దపీట వేశారు.

**సామాజిక బాధ్యత..** రతన్ టాటా కేవలం వ్యాపార ప్రయోజనాలకు మాత్రమే కాకుండా, సమాజానికి సేవ చేయడంలోనూ విశేషంగా ముందున్నారు. టాటా ట్రస్ట్స్ ద్వారా ఆరోగ్యం, విద్య, గ్రామీణ అభివృద్ధి రంగాలలో అనేక కార్యక్రమాలను అమలు చేశారు. పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేసి, పునరుత్పాదక శక్తి పై దృష్టి పెట్టారు.

**పురస్కారాలు, గుర్తింపు...** రతన్ టాటా అందుకున్న కొన్ని ముఖ్యమైన గౌరవాలలో... పద్మభూషణ్ (2000), పద్మ విభూషణ్ (2008), టైమ్ మ్యాగజైన్ "ప్రపంచ అత్యంత ప్రభావవంతమైన వ్యక్తులు"



జాబితాలో స్థానం, అనేక విశ్వవిద్యాలయాల నుంచి గౌరవ డాక్టరేట్‌లు.

**వ్యక్తిత్వం, విలువలు**... రతన్ టాటా తన సాదాసీదా జీవనశైలికి ప్రసిద్ధి. ఆయన తక్కువ ఆరాటేంతో జీవిస్తూ, సహజత్వాన్ని పాటించారు. న్యాయం, నైతికత, సమాజ సేవ పట్ల ఆయన చూపే ఆసక్తి నేటి యువతకు మార్గదర్శకంగా నిలుస్తోంది. రతన్ నవల్ టాటా, భారత వ్యాపార రంగానికి సూర్తేనిచ్చిన ఒక దిగ్గజం. వ్యాపారంలో విజయం సాధించడం మాత్రమే కాకుండా, సమాజానికి సేవ చేయడాన్ని కూడా ఆయన జీవన విధానంగా మార్చుకున్నారు. ఆయన ఆదర్శాలు, ధైర్యం, సృజనాత్మకత భారతీయ పారిశ్రామిక రంగానికి, సమాజానికి మార్గదర్శకంగా నిలిచాయి. రతన్ టాటా చేసిన కృషి తరతరాల పాటు ప్రజల మనసుల్లో నిలిచిపోతుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాల మిస్ట్...9440595494**




న్యూఇయర్ వేడుకల నేపథ్యంలో దిల్లీ పోలీసులు భారీ ఆపరేషన్ చేపట్టారు. భారీఎత్తున డ్రగ్స్‌తో పాటు 40కి పైగా ఆయుధాలను స్వాధీనం చేసుకొన్నారు.

ఈనేపథ్యంలో 285 మందిని అదుపులోకి తీసుకున్నారు. 'ఆపరేషన్ ఆఘాత్ 3.0' పేరిట ఆగ్నేయ దిల్లీలోని పలు ప్రాంతాల్లో పోలీసులు అర్ధరాత్రి వేళ తనిఖీలు చేపట్టారు. వీధి రౌడీలు, నేరస్థులతో సంబంధం ఉన్న అనుమానితులే లక్ష్యంగా తనిఖీలు చేశారు. కొత్త సంవత్సర వేడుకల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా దీన్ని నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. ఆపరేషన్‌లో భాగంగా దాదాపు 285 మందిని అరెస్టు చేశామని.. మరో 504 మందిని అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు. వారినుంచి దేశీయంగా తయారుచేసిన 21 పిస్టల్స్, 20 తూటాలు, 27 కత్తులతో పాటు పెద్దఎత్తున మాదక ద్రవ్యాలు, అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

నిందితుల నుంచి దాదాపు రూ.2 లక్షలు పట్టుకున్నట్లు వివరించారు. ఈ క్రమంలో 310 మొబైల్ ఫోన్‌లు, 231 ద్విచక్ర వాహనాలను కూడా స్వాధీనం చేసుకున్నామని.. ఇవన్నీ దొంగిలించిన వస్తువులుగా గుర్తించామని పేర్కొన్నారు.

# తిరుపతి, విజయవాడలకు గ్రేటర్ హోదాపై మంత్రి నారాయణ క్లారిటీ



అమరావతి,డిసెంబరు 27 : తిరుపతి, విజయవాడలకు గ్రేటర్ హోదా కల్పించడానికి కొన్ని ఇబ్బందులు ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ క్లారిటీ ఇచ్చారు. జనగణన ఉన్నందున విలీనానికి సంబంధించిన కొన్ని ఇబ్బందులు ఉండటంతో ఈ విషయంపై చర్చించలేదని తెలిపారు. జనగణన జరగబోతోంది కాబట్టి ప్రస్తుతం డీలిమిటేషన్ చేయకూడదనే కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. అందుకే ప్రస్తుతం గ్రేటర్ విజయవాడ, గ్రేటర్ తిరుపతి ప్రక్రియను కొంతకాలం వాయిదా వేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు మంత్రి నారాయణ. జిల్లాలు, డివిజన్లు, మండలాల పునర్విభజనపై మంత్రులు, అధికారులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇవాళ (శనివారం) ఏపీ సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు మంత్రి నారాయణ. ఈ సమావేశంలో కొత్త జిల్లాల ఏర్పాటుపై చర్చించామని తెలిపారు. మరోసారి సమావేశమై గ్రేటర్ తిరుపతి, గ్రేటర్ విజయవాడ అంశాలపై కీలక నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. జరీబు, నాన్ జరీబు భూములపై రాష్ట్రస్థాయి కమిటీ ఏర్పాటు చేశామని వ్యాఖ్యానించారు. శాటిలైట్ చిత్రాల ఆధారంగా సమస్య పరిష్కరిస్తామని పేర్కొన్నారు. గన్నవరం విమానాశ్రయం భూములకు సంబంధించి కలెక్టర్‌కు ఆదేశాలు ఇచ్చామని అన్నారు. రాజధాని రైతులకు రిటర్నబుల్ ప్లాట్స్‌లో 42మంది మార్పులు కోరారని తెలిపారు. రిటర్నబుల్ ప్లాట్ మార్చుకోవాలనుకునే అన్నదాతలు దరఖాస్తు చేసుకుంటే వాటిని మారుస్తామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.




# తృటిలో ప్రమాదం తప్పిందిగా.. వెనక్కి జారిన ట్రైన్

విశాఖపట్నం, డిసెంబర్ 27: విశాఖ కైలాసగిరిలో రైలుకు తృటిలో పెను ప్రమాదం తప్పింది. బ్రేకులు ఫెయిల్ అవడంతో రైలు వెనక్కి జారింది. ఘటన జరిగిన సమయంలో రైలులో వంద మందికిపైగానే పర్యాటకులు ఉన్నారు. అయితే ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో నిర్వాహకులు ఊపిరిపీల్చుకున్నారు. విశాఖపట్నంలో పర్యాటక ప్రాంతమైన కైలాసగిరిలో ఉన్న టాయ్ రైలు.. అక్కడకు వచ్చిన పర్యాటకులను కొండపైన తిప్పుతుంది. ఈ క్రమంలో నిన్న మధ్యాహ్నం తరువాత పర్యాటకులను తీసుకెళ్తుండగా స్టేషన్ సమీపంలోకి వచ్చాక బ్రేకులు పడకపోవడంతో తిరిగి వెనక్కి వెళ్లింది. అయితే ఎక్కడా డౌన్ లేకపోవడంతో ప్రమాదం జరగలేదు. వెనక్కి కొంత దూరం పాటు వెళ్లిన తర్వాత యదావిధిగా రైలు ఆగిపోయింది. కానీ ఆ సమయంలో సుమారు వంద మంది ప్రయాణికులు రైలులో ఉన్నారు. ఓవర్ లోడ్ అవడం వల్లనా లేక టెక్నికల్ సమస్యనా అనేది తెలియాల్సి ఉంది. దీనిపై అధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఉంది. కైలాసగిరికి పర్యాటకులు భారీ సంఖ్యలో వస్తున్నారని, ఏదైనా ప్రమాదం జరిగితే అటు ప్రభుత్వానికి ఇటు అధికారులకు కూడా తీవ్ర ఇబ్బంది కలిగే అవకాశం ఉంది. దీంతో నిర్వాహకులపై కచ్చితంగా చర్యలు తీసుకోవాలనే డిమాండ్‌లు వినిపిస్తున్నాయి. ప్రమాదం జరిగితే ఎంతో మంది ప్రయాణికులు గాయపడే అవకాశం ఉన్నందున దీనిపై అధికారులు దృష్టిపెట్టాలని ప్రతీఒక్కరూ కోరుతున్న పరిస్థితి. ఇక గత వారం రోజులుగా విశాఖకు పర్యాటకుల తాకిడి భారీగా పెరిగింది. కైలాసగిరికి పెద్ద ఎత్తున పర్యాటకులు రావడంతో రైలులో ఓవర్‌లోడ్ వల్లే ఇలా జరిగి ఉంటుందనే అనుమానిస్తున్నారు.

# రైతుల సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం...

అమరావతి: రాజధాని ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సీఆర్డీఏ కార్యాలయంలో త్రీ మెన్ కమిటీ ఈరోజు (శనివారం) సమీక్ష నిర్వహించింది. అనంతరం కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మీడియాతో మాట్లాడుతూ.. జరీబు భూ సమస్యలపై సర్వే పూర్తయిందన్నారు. జరీబు భూములపై జెన్యూన్‌గా ఎవరికి ఇవ్వాలి అనేదానిపై కమిటీ రిపోర్ట్ తర్వాత నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. పది సెంట్లు కంటే తక్కువ ప్లాట్లు ఉన్నవాళ్లు 415 మంది ఉన్నారని... వారి సమస్యలు కూడా పరిష్కరిస్తున్నామన్నారు. 2013 కంటే ముందు భూములు ఇచ్చిన రైతులు కూడా తమను ల్యాండ్ పూలింగ్ కింద పరిగణించమని అడుగుతున్నారని... కానీ అవి చట్టపరంగా సాధ్యం కావడం లేదని కేంద్రమంత్రి అన్నారు. వీధి పోటు భూములకు సంబంధించి సుమారు 150 ఉన్నాయని.. వీధి పోటుకు సంబంధించి మరో రెండు అంశాలు రైతుల కోరుతున్నారని. ఆ అంశాలను తర్వాత పరిగణిస్తామని స్పష్టం చేశారు. త్రీ మెన్ కమిటీ నిర్ణయం ప్రకారం తిరిగి లంక భూముల విషయంలో 356కు గాను 79 మంది మాత్రమే రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని చెప్పారు. మిగిలిన వారిని కూడా రిజిస్ట్రేషన్ చేయించుకోమని కోరారు. గన్నవరం ఎయిర్పోర్ట్ సమస్యలపై కూడా ఈ రివ్యూలో చర్చించినట్లు తెలిపారు. లార్జ్ రిటర్నబుల్ ప్లాట్స్ విషయంలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయని.. పరిష్కారం దిశగా వర్క్ చేస్తున్నామన్నారు. హెల్త్ కార్డ్స్, పెన్షన్లు తదితర అంశాలపై కూడా చర్చించినట్లు చెప్పారు. స్థానికంగా 1596 మందిని క్యాపిటల్ వర్క్స్‌లో అధికారులు జాయిన్ చేసుకున్నారని.. ఇవి కాకుండా మరో 10 వేల మందిని రాజధానిలో ఉండే స్థానికులను కలిపే విధంగా ప్రయత్నిస్తున్నామని అన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులను జనవరి 1 నుంచి ప్రారంభించేందుకు సన్నహాలు చేస్తున్నామన్నారు. పెండింగ్ ఉన్న 2% రైతులకు కొన్ని సమస్యలు ఉన్నాయని.. వాటిని ఒక్కోటిగా పరిష్కరిస్తూ వస్తున్నామన్నారు. ఇప్పటి వరకు లంక భూములు, అసైన్డ్ భూముల సమస్యలను పరిష్కరిస్తూ వస్తున్నట్లు కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పుకొచ్చారు.

**వారందరికీ పెన్షన్లు ఇస్తాం: ఎమ్మెల్యే శ్రావణ్..** ప్రతి గ్రామంలో కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ అన్నారు. రోడ్ల నిర్మాణలు, భారీ వాహనాల రాకపోకల వల్ల కొన్ని చోట్ల స్మశాన ప్రాంతాలు ఇబ్బందికరంగా మారుతున్నాయన్నారు. మల్కాపురం, వెంకటాపురం గ్రామాల్లో స్మశానాలు లేవని... అలాగే మరికొన్ని ప్రాంతాల్లో బరెల గ్రౌండ్ ఏర్పాటు చేయాలని చెప్పామన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో నాలుగు వేలకు పైగా పెన్షన్లను రిజెక్ట్ చేశారని.. ఎవరెవరికి పెన్షన్లు మిస్ అయ్యాయో వాటి వివరాలు సేకరిస్తున్నామన్నారు. అలాగే కొత్తగా పెళ్లయిన వారికి కూడా పెన్షన్లు అందజేయాలని చూస్తున్నామని చెప్పారు.

**శవ రాజకీయాలు మానుకోండి..** అమరావతిలో భూమి ఇచ్చిన వారికి బిలో పావర్టీ లైన్‌తో సంబంధం లేకుండా అందరికీ హెల్త్ కార్డు ఇవ్వడం జరుగుతుందన్నారు. నిన్న జరిగిన ఒక గ్రామ సభలో మాట్లాడుతూ ఉండగా రైతు రామారావు అకస్మాత్తుగా మరణించడం జరిగిందన్నారు. ఆ రైతుకు ఐదు ఎకరాల భూమి ఉందని... సభలో కూడా రామారావు మాట్లాడుతూ తమకు అందించే భూమి ఎక్కడ వస్తుందో స్పష్టంగా చెప్పాలని అడిగారన్నారు. చాలా వివరంగా, ఆయన మామూలుగా మాట్లాడుతూ ఉండగా అనుకోకుండా జరిగిన ఘటనను కొన్ని పత్రికలు, వైసీపీ నాయకులు శవాల మీద రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఏమీ లేని చోట ఇలాంటి దుష్ప్రచారాన్ని చేయడం మానుకోవాలని ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

చురకలు

## సంపాదకీయం

### బీహార్ లో కూడా బుల్డోజర్ దిగుతుందా ?

బీహార్ లో నితీష్ కుమార్ నాయకత్వం లోని ఎన్డీయే ప్రభుత్వం తాజాగా కొలువు తీరింది. ఈ ప్రభుత్వంలో కీలకమైన హోం శాఖను నితీష్ కుమార్ వదులుకుని బీజేపీకి చెందిన ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరికి అప్పగించారు. దీంతో ఇపుడు ఇదే అంశం మీద బీహార్ రాజకీయం హీటెక్కుతోంది నితీష్ ని డమ్మీ చేయడానికి బీజేపీ చూస్తోంది అని కాంగ్రెస్ ఆర్జేడీ అపుడే కామెంట్స్ మొదలెట్టాయి. అంతే కాదు నితీష్ కుమార్ ని సొంత ప్రభుత్వంలోనే క్రియాశీలకంగా లేకుండా చేసే ప్రయత్నం ఇది అని కూడా చెబుతున్నారు.

**పవర్ ఫుల్ గానే :** నిజానికి చూస్తే సామ్రాట్ చౌదరి ఈసారి సీఎం కావాల్సిన వారు అని చెబుతున్నారు. ఆయన గత ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. మరోసారి ఎన్డీయే సర్కార్ వస్తే కనుక సామ్రాట్ చౌదరిని సీఎం గా చేస్తారు అని కూడా ప్రచారం సాగింది. కానీ బీజేపీ పెద్దలు జాతీయ రాజకీయాలను అలాగే వచ్చే ఏడాది జరిగే మరో నాలుగు రాష్ట్రాల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నితీష్ కుమార్ ని కదపకుండా అదే పదవిని అప్పగించారు. నితీష్ సైతం ముఖ్యమంత్రిగానే కొనసాగాలని నిర్ణయించుకున్నారు. దాంతో ఆయన కూడా హ్యాపీగా ఉన్నారు. ఈ ఉత్సాహంలో ఆయన రెండు దశాబ్దాలుగా తాను చూస్తున్న హోంశాఖని బీజేపీకి అప్పగించారు.

**తప్పేముందన్న జేడీయూ నేతలు :** అయితే ఈ పరిణామం మీద అగ్గి రాజేసి ఎన్డీయే కూటమిలో చిచ్చు పెట్టేందుకు విపక్షం అపుడే చూస్తోంది అని అంటున్నారు. అనుభవం కలిగిన నేతగా ఉన్న సామ్రాట్ చౌదరికి హోం శాఖను ఇస్తే తప్పేంటి అని జేడీయూ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఇది తమ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అని అంతా ఒక్కటే అని వారు అంటున్నారు. అయితే ఇది జేడీయూని అణిచివేసేందుకే అని విపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయి. అంతే కాదు ఏకంగా బీహార్ ని కేంద్రం తన కనుసన్నలలో నడుపుతుందని కూడా కాంగ్రెస్ ఆర్జేడీ నేతలు ఆరోపిస్తున్నారు.

**పాలన ఆయనదే :** పేరుగే నితీష్ కుమార్ సీఎం అని పాలన అంతా సామ్రాట్ చౌదరి చూస్తారని కూడా కాంగ్రెస్ ఆర్జేడీ విమర్శలు గుప్పిస్తున్నారు. హోం శాఖ పవర్ ఫుల్ అని అందుకే సామ్రాట్ చౌదరి పాలన చేస్తారు అని అంటున్నారు. కేవలం సీటు మాత్రమే నితీష్ ది తప్ప మిగిలినది అంతా బీజేపీదే అని కూడా వారు సెటైర్లు వేస్తున్నారు. జేడీయూ ఇక మీదట వీక్ కావడం ఖాయమని జోస్యం చెబుతున్నారు.

**బుల్డోజర్ పాలన :** ఇదిలా ఉంటే యూపీలో బీజేపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ పాలిస్తున్నారు. ఆయన బుల్డొజర్ ని దింపి మరీ నేరాలను అదుపు చేస్తున్నారు. బీహార్ లో కూడా లా అండ్ ఆర్డర్ మరింత కఠినంగా అమలు చేయాల్సి ఉందని జనాల నుంచి వినిపిస్తున్న మాట ఈ నేపథ్యంలో బీజేపీ చేతిలో హోం శాఖ ఉంది కాబట్టి బీహార్లో సైతం బుల్డోజర్ పాలన వస్తే బాగుంటుందని కొందరు అంటూంటే అది ప్రత్యర్థుల మీదకే ప్రయోగిస్తారని మరి కొందరు అంటున్నారు. ఏది ఏమైనా రెండు పెద్ద రాష్ట్రాలు హిందీ బెల్ట్ లో ఉన్నాయి. యూపీలో యోగీ మాదిరిగా బీహార్ లో లా అండ్ ఆర్డర్ ని కంట్రోల్ లో పెట్టడానికి బీజేపీ హోం శాఖ తీసుకుందా అన్న చర్చకు అయితే తెర లేస్తోంది.

## కాంగ్రెస్ పార్టీ స్థాపన...స్వాతంత్ర్య ఉద్యమానికి పునాది - డిసెంబర్ 28.. కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవం

భారత జాతీయ కాంగ్రెస్ (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్) భారతదేశ స్వాతంత్ర్య పోరాట చరిత్రలో అత్యంత ప్రభావ వంతమైన రాజకీయ సంస్థ. 1885 డిసెంబర్ 28న ఏర్పాటైన ఈ సంస్థ, దేశంలో రాజకీయ చైతన్యానికి, సామాజిక ఆర్థిక మార్పులకు కీలకంగా నిలిచింది. కాంగ్రెస్ స్థాపన, భారత స్వాతంత్ర్య ఉద్యమానికి పునాది వేస్తూ, భారతీయుల ఆకాంక్షలను ప్రపంచానికి తెలియ జేసింది.

**వ్యవస్థాపన చరిత్ర :** భారత జాతీయ కాంగ్రెస్‌ను 1885 డిసెంబర్ 28న ముంబైలో గోకులదాస్ తేజ్‌పాల్ కళాశాలలో ఏర్పాటు చేశారు. అలన్ ఆక్టావియన్ హ్యూమ్ పార్టీ స్థాపనకు ప్రధాన రూపకర్త. ఉమేష్ చంద్ర బెనర్జీ అధ్యక్షతన జరిగిన మొదటి సమావేశానికి దేశం నలుమూలల నుండి 72 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సంస్థ ప్రారంభ దశలో భారతీయుల సమస్యలను బ్రిటిష్ ప్రభుత్వానికి నివేదించడానికి ఒక వేదికగా పనిచేసింది.

**భారత జాతీయ కాంగ్రెస్ ఉద్దేశాలు :** కాంగ్రెస్ పార్టీ ప్రారంభ దశలో నిర్దేశించుకున్న ముఖ్య ఉద్దేశాలు... రాజకీయ చైతన్యం: భారతీయులలో రాజకీయ చైతన్యాన్ని పెంపొందించడం. హక్కుల పరిరక్షణ: భారతీయుల హక్కులను బ్రిటిష్ ప్రభుత్వానికి వివరించి, రక్షించుకోవడం. సమావేశాల వేదిక: దేశంలోని వివిధ ప్రాంతాల నాయకులను ఒక వేదికపైకి తీసుకు రావడం. సమాజ సేవ: పేదల సమస్యలు, ఆర్థిక వివక్షను నాశనం చేయడం.

**స్వాతంత్ర్య పోరాటంలో కాంగ్రెస్ పాత్ర...** భారత జాతీయ కాంగ్రెస్ మూడు ప్రధాన దశల్లో స్వాతంత్ర్య ఉద్యమానికి దోహదపడింది.

**మితవాద దశ (1885–1905):** ఈ దశలో కాంగ్రెస్ పార్టీ శాంతియుత మార్గాల్లో బ్రిటిష్ ప్రభుత్వానికి మనుగడపై ఆవశ్యకమైన సమస్యలను తెలియజేసింది. ప్రముఖ మితవాద నేతలు: దాదాభాయ్ నౌరోజీ, ఫిరోజ్ షా మెహతా, సురేంద్రనాథ్ బెనర్జీ. ముఖ్య ఉద్యమాలు: బ్రిటిష్ అధికారుల వివక్షను ప్రశ్నించడం, పన్నుల వ్యతిరేకత.




**తీవ్రవాద దశ (1905–1919):** 1905లో బంగాల్ విభజన కాంగ్రెస్ లో తీవ్రవాద భావజాలం ఉదహేనికి నాంది పలికింది. ప్రముఖ నేతలు: బాల గంగాధర్ తిలక్, బిపిన్ చంద్ర పాల్, లాలా లజపతిరాయ్. స్వదేశీ ఉద్యమం ప్రారంభించి బ్రిటిష్ ఉత్పత్తులను బహిష్కరించారు.

**గాంధీ యుగం (1920–1947)...** మహాత్మా గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ ఉద్యమం శాంతియుత నిరసనలతో గణనీయమైన ప్రాధాన్యం పొందింది.

**ప్రధాన ఉద్యమాలు...** సహాయ నిరాకరణ ఉద్యమం: బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సహకారం నిలిపివేయడం. సివిల్ డిసొబిడియన్స్: చౌరిచౌరా ఘటన, ఉప్పు సత్యాగ్రహం వంటి నిరసన ఉద్యమాలు. క్విట్ ఇండియా: 1942లో పూర్తి స్వాతంత్ర్యం కోసం ఉద్యమం.

**స్వాతంత్ర్యం తర్వాత కాంగ్రెస్...** 1947లో భారతదేశం స్వతంత్రం పొందిన తర్వాత, కాంగ్రెస్ పార్టీ దేశంలో పాలనాకర్తగా మారింది.

**జవహర్‌లాల్ నెహ్రూ:** మొదటి ప్రధాని హెూదాలో, దేశానికి ఒక సాంకేతికత ఆధారిత భవిష్యత్‌ను ఆకారమిచ్చారు.

**సమగ్ర అభివృద్ధి:** పారిశ్రామికీకరణ, విద్యా రంగ అభివృద్ధి, పంచవర్ష ప్రణాళికల ద్వారా దేశ అభివృద్ధిని ప్రోత్సహించారు.

**సామాజిక న్యాయం:** కులవివక్షను తొలగించి సమానత్వాన్ని స్థాపించారు.

**కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవం ప్రాముఖ్యత...** భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రను స్మరించుకోవడం, స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన మహెూన్నత నాయకుల త్యాగాలను గుర్తు చేసుకోవడం, దేశంలో రాజకీయ చైతన్యానికి కాంగ్రెస్ ప్రాధాన్యాన్ని గుర్తించడం, స్వాతంత్ర్య భారత నిర్మాణంలో కాంగ్రెస్ వేసిన పునాదులను గుర్తించడం.

**నేటి రాజకీయాల్లో కాంగ్రెస్...** స్వాతంత్ర్యం తరువాత కొన్ని దశాబ్దాల పాటు కాంగ్రెస్ దేశ రాజకీయాలను ఆధిపత్యం చాటింది. 1984లో అత్యధిక మెజారిటీ సాధించి, 415 స్థానాలు గెలుచుకుంది. 2004లో యూపీఏ (యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్) ఏర్పాటుతో మరొక కీలక మలుపు తిరిగింది. 21వ శతాబ్దంలో బలహీనమైన ప్రతిపక్షంగా మారి, రాజకీయంగా పునరుద్ధరణకు ప్రయత్నిస్తోంది. కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవం భారతదేశ చరిత్రలో ఒక ప్రాథమిక మైలురాయి. ఇది భారత స్వాతంత్ర్య పోరాటానికి ప్రేరణగా నిలిచి, ప్రజాస్వామ్య పునాది రాయి అయింది. నేటి రాజకీయాలలోనూ ఈ పార్టీ తన చరిత్రను పునరుదాటిస్తూ, భవిష్యత్‌లో మరింత ప్రభావవంతంగా పనిచేయాలని ఆశించవచ్చు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాల మిస్ట్...9440595494**

## వందేమాతరం... స్వాతంత్ర్య ఉద్యమంలో రణన్నినాదం - డిసెంబర్ 28...వందేమాతరం గీతం తొలిసారి కాంగ్రెసు సభలో ఆలపించిన దినం

వందేమాతరం...అహింసాయుత భారత స్వాతంత్ర్య ఉద్యమంలో రణన్నినాదం. ఒకనాడు ఏ ఇరువురు భారతీయులు కలిసినా వందేమాతరం అంటూ అభివాదం చేసు కోవడం, వందేమాతరం బ్యాడ్జీలు ధరించడం, లాంటి చర్యల వలన 1905–11 మధ్య జరిగిన ఈ ఉద్యమానికి వందేమాతరం ఉద్యమం అనే పేరు సార్థకం అయింది. 1896 డిసెంబర్ 28న రహీంతుల్లా ఎం. సయానీ అధ్యక్షతన నిర్వహించిన కలకత్తా కాంగ్రెసు సభల్లో వందేమాతరం గీతాన్ని తొలి సారి పాడారు. ఆనంద మఠం నవలని భారతదేశ చారిత్రక నవలలల్లో అత్యంత ప్రధానమైనదని భావిస్తారు. రామకృష? పరమహంస సమకాలీనులు, ఆయన సన్నిహిత మిత్రులు అయిన బంకిమ్ చంద్ర చటోపాధ్యాయ ఆనంద్‌మఠ్ రచించారు. వందేమాతరంను ఎన్నో ఏళ్ల ముందే ఆయన ఒక కవిత రూపంలో రాశారు. అయితే తర్వాత ప్రచురితమైన ఆనంద్‌మఠ్ నవలలో దానిని భాగం చేశారు. అది అలా దేశవ్యాప్తంగా జాతీయ వాదానికి ప్రతీకగా మారిపోయింది. గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్ దీనికి బాణీని సిద్ధం చేశారు. వందేమాతరం జనాదరణ చాలా వేగంగా పెరుగుతూ వచ్చింది. బంకించంద్ర ఈ నవలని బెంగాలీలో రాయగా, తరువాత ఇతర భాషలలోనికి అనువదించ బడింది. ఈ నవలలో ఉపయోగించిన వందేమాతరం గీతాన్ని 1896 కాంగ్రెస్ మహాసభల సందర్భంగా రవీంద్రనాథ్ టాగోర్ ఆలపించారట. తరువాత వందేమాతరం ఎంతో ప్రఖ్యాతి చెందింది. స్వాతంత్ర్య సంగ్రామంలో జాతీయవాద నినాదంగా వాడబడింది. స్వాతంత్ర్యానంతరం భారత జాతీయగేయంగా ప్రభుత్వం వందేమాతరాన్ని స్వీకరించింది. కాంగ్రెస్ నేతృత్వంలో జరిగిన మొదటి ప్రజా ఉద్యమం వందేమాతర ఉద్యమం. బంకిం చంద్రచటర్జీ రచించిన వందేమాతర గీతం ఉద్యమకారులకు స్ఫూర్తినిచ్చింది. అందువల్ల దీన్ని వందేమాతర ఉద్యమం అన్నారు. లండన్ టైమ్స్, మాన్‌చెస్టర్ గార్డియన్ లాంటి విదేశీ పత్రికలు కూడా బెంగాల్ విభజనను నిరసిస్తూ వార్తలు ప్రచురించాయి. అప్పటి గవర్నర్ జనరల్ లార్డ్ కర్జన్ 1905 జూలై 7న, 'పరిపాలనా సౌలభ్యం' పేరిట బెంగాల్ ను రెండు రాష్ట్రాలుగా విభజించాడు. భారతీయులు వ్యతిరేకించారు. పెద్ద ఎత్తున ఉద్యమించారు. దీన్నే 'వందేమాతరం ఉద్యమం' అని వ్యవహరించారు. ఉద్యమం లో పాల్గొన్నవాళ్ళు సామూహికంగా బంకిం చంద్ర చటర్జీ వ్రాసిన వందేమాతరం గీతాన్ని గానం చేసేవారు. వందేమాతర ఉద్యమం బెంగాల్‌కు పరిమితం కాకుండా దేశ వ్యాప్తమైంది. మొదట్లో ఈ ఉద్యమం సురేంద్రనాథ్ బెనర్జీ వంటి మితవాదుల నేతృత్వంలో జరిగినా క్రమంగా అతివాద, తీవ్రవాద నాయకత్వానికి మరలింది. ఈ ఉద్యమాన్ని బెంగాల్ నుంచి దేశవాప్తంగా ప్రచారం చేయడంలో బిపిన్ చంద్రపాల్ ప్రముఖ పాత్ర పోషించాడు. ఈయన మద్రాస్, ఆంధ్ర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించాడు. ఈ ఉద్యమ కాలంలోనే ట్యుటికోరిన్ (మద్రాస్)లో స్వదేశీ స్టీమ్ నేవిగేషన్ కంపెనీని స్థాపించారు. అక్కడ ఈ ఉద్యమాన్ని సుబ్రమణ్య అయ్యర్, చిదంబర పిళ్లై విస్తృతం చేశారు. ఆంధ్ర ప్రాంతంలో కొండా వెంకటప్పయ్య, పట్టాభి సీతారామయ్య, ముట్నూరి కృషా?రావు నేతృత్వం వహించారు. పంజాబ్‌లో భగత్‌సింగ్ మేనమామ అజిత్ సింగ్ అంజుమాన్ మెహబత్ వాటన్ అనే సంస్థను, భారతమాత అనే పత్రికను నడిపి ఉద్యమాన్ని విస్తరించారు. ఉద్యమంలో భాగంగా విదేశీ వస్తువులను, బ్రిటిష్ యాజమాన్యంలో ఉన్న విద్యాలయాలను బహిష్కరించారు. దేశవ్యాప్తంగా




జరిగిన ఈ ఉద్యమంలో హిందువులు, ముస్లింలు ఐక్యతతో పాల్గొన్నారు. బహిష్కరణోద్యమం జరుగుతున్న సమయంలోనే నాయకులు నిర్మాణాత్మక ఆలోచనలతో స్వదేశీ ఉద్యమాన్ని ప్రోత్సహించారు. బంకిమ్ కేవలం రచయిత మాత్రమే కాదు, ఆయన ఒక ప్రభుత్వ అధికారి కూడా. ఎన్నో ఉన్నత ప్రభుత్వ పదవుల్లో ఆయన ఉన్నారు. 1881లో ప్రభుత్వ సేవల నుంచి రిటైర్ అయ్యారు. ఆయన తండ్రి కూడా ప్రభుత్వ అధికారిగా పని చేశారు. 1894 ఏప్రిల్లో బంకిమ్ చంద్ర మరణించారు. తర్వాత 12 ఏళ్లకు విప్లవకారుడు బిపిన్ చంద్రపాల్ ఒక రాజకీయ పత్రిక ప్రచురించడం ప్రారంభించారు.

దానికి ఆయన "వందేమాతరం" అనే పేరు పెట్టారు. లాలా లాజ్‌పత్ రాయ్ కూడా అదే పేరుతో ఒక జాతీయవాద పత్రికను ప్రచురించారు. స్వతంత్ర భారతదేశం కోసం కొత్త రాజ్యాంగం రాస్తున్నప్పుడు వందేమాతరంను జాతీయ గేయంగా స్వీకరించలేదు, దానికి జాతీయగీతం హెూదా కూడా దక్కలేదు. భారత తొలి ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ వందేమాతరం గీతాన్ని స్వతంత్ర భారత దేశం జాతీయ గేయంగా స్వీకరించడానికి వెనకాడారు. స్వయంగా వెళ్లి రవీంద్రనాథ్ ఠాగూర్‌ను కలిసిన నెహ్రూ వందేమాతరం గీతాన్ని స్వాతంత్రోద్యమం మంత్రంగా చేయడానికి ఆయన అభిప్రాయం కోరారు. బంకిమ్ చంద్ర కవితలను, ఆయన దేశభక్తిని రవీంద్రనాథ్ ఠాగూర్ అభిమానించేవారు. వందేమాతరం లోని మొదటి రెండు శ్లోకాలను బహిరంగంగా పాడవచ్చని నెహ్రూకు ఆయన చెప్పారు. రాజ్యాంగ బద్ధంగా సభ అధ్యక్షుడు, భారత తొలి రాష్ట్రపతి అయిన రాజేంద్ర ప్రసాద్ 1950, జనవరి 24న వందేమాతరం గీతానికి జాతీయ గేయం హెూదా ఇస్తున్నట్టు ప్రకటించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాల మిస్ట్...9440595494**

## జగమెరిగిన మిమిక్రీ కళాకారుడు వేణుమాధవ్ - డిసెంబర్ 28... నేరెళ్ల వేణుమాధవ్ జయంతి

భారత్‌లో మిమిక్రీ కళకు ఆయన ఆద్యుడు, ఎంతో మంది ప్రముఖుల వందలాదిగా గొంతులను సునాయాసంగా, యథాతథంగా అనుకరించేవాడు. భారత్‌లో అనుకరించి నవ్వించే కళగా మాత్రమే ఉన్న మిమిక్రీని ఐరాస ప్రధాన కార్యాలయంలో ప్రదర్శించే స్థాయికి తీసుకెళ్లిన గొప్ప కళాకారుడు. రాష్ట్రపతులు, ప్రధానుల నుండి సామాన్యుల వరకూ దేశంలో ఆయన అపూర్వ, అపురూప కళను అభినందించని వారుండరంటే అతిశయోక్తి కాదు. ఇప్పుడు గుర్తు పట్టారనుకుంటా. ఆయనే వందలాది గొంతుకల వేణు మాధవుడు. ధ్వన్యనుకరణ సామ్రాట్ అనే బిరుదును పొందిన తెలంగాణ గర్వించ దగ్గ ప్రపంచ ప్రఖ్యాత మిమిక్రీ కళాకారుడు నేరెళ్ళ వేణుమాధవ్ ( డిసెంబరు 28, 1932 – జూన్ 19, 2018 ) చిన్నప్పుడు ఉర్దూ మాధ్యమంలో చదువుకున్నాడు. అయినా ఆయన అమెరికా, బ్రిటన్ ఇంగ్లిష్ ఉచ్చారణలతో కూడా గొప్ప ప్రదర్శనలు ఇచ్చారు. ఆయన సొంతంగా ఈ కళను సాధన చేశారు. స్వీయ పరిశీలన, స్వయం అధ్యయనంతో తనను తాను మెరుగు పరచుకుంటూ అత్యున్నత స్థాయిని అందుకున్న ప్రతిభాశాలి. చిన్నతనంలో చిలకమర్తి లక్ష్మీనరసింహం రాసిన ప్రహసనాల్లో నటించి తన ప్రతిభను చాటుకున్నా అప్పటి ప్రముఖ నటులు చిత్తూరు నాగయ్య, వేమూరు గగ్గయ్య, మాధవపెద్ది వెంకట్రామయ్య తదితరుల సినిమాల ప్రభావంతో మిమిక్రీ కళపై మొగ్గు చూపాడు. 1947 నుంచి ఈయన మిమిక్రీ ప్రదర్శనలు ఇవ్వడం ప్రారంభించాడు. తెలుగులోనే కాక ఇతర భాషల్లో కూడా ప్రదర్శనలు ఇచ్చాడు. ఐక్యరాజ్య సమితిలో కూడా ప్రదర్శన ఇచ్చాడు. 1953 లో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించాడు. కేంద్రప్రభుత్వం ఈయనకు పద్మశ్రీ పురస్కారాన్నిచ్చి గౌరవించింది. విశ్వనాథ సత్యనారాయణ, సినారె మొదలైన ప్రముఖులు తమ రచనలను ఈయనకు అంకితమిచ్చారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి కళా ప్రపూర?, జె. ఎన్. టి. యు, కాకతీయ విశ్వవిద్యాలయాల నుంచి గౌరవ డాక్టరేట్లు అందుకున్నాడు. తిరుపతిలో ఈయనకు గజారోహణం, పౌరసన్మానం జరిగాయి. ఆయన స్వయంగా నేరెళ్ళ వేణుమాధవ్ సాంస్కృతిక సంస్థను స్థాపించి ప్రతి యేటా ఒక కళాకారుడిని సన్మానించాడు. హనుమకొండలో ఆయన పేరు మీదుగా డా. నేరెళ్ళ వేణుమాధవ్ కళాప్రాంగణం నిర్మించారు. నేరెళ్ళ వేణుమాధవ్ వరంగల్ పట్టణంలోని మట్టెవాడలో శ్రీహరి, శ్రీలక్ష్మి దంపతులకు 1932 డిసెంబరు 28న జన్మించారు. పండితుడైన తండ్రి, వరంగల్ పట్టణానికి వచ్చే ప్రముఖులందరికీ తన ఇంట్లోనే ఆతిథ్యం ఇస్తుండగా, అలా వచ్చిన వారిలో చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి, వావిలికొలను సుబ్బారావు, వడ్డాది సుబ్బారాయుడు, రాయప్రోలు సుబ్బారావు, శ్రీపాద కృష?మూర్తి శాస్త్రి, కాశీ కృషా?చార్యులు, యర్రమిల్లి జగన్న శాస్త్రి వంటి గొప్పవారి సాహితీ గోష్ఠ'ల ప్రభావం వేణుమాధవ్ మీద పడింది. సినిమాలంటే ఎంతో ఇష్టం. చిత్తూరు నాగయ్య నటించిన గృహలక్ష్మి, వందేమాతరం, దేవత, స్వర్గసీమ, పోతన, వేమన సినిమాలు చూసి, నాగయ్య కూడా ధ్వన్యనుకరణ చేయగలవారు కావడంతో ఆయన పై అభిమానంతో కేవలం స్వయం పరిశీలనతోనే ఆ రంగంలో ప్రవేశించాడు. అలాగే వేమూరి గగ్గయ్య, మాధవపెద్ది వెంకట్రామయ్య నటించిన సినిమాలు చూసి, ఇంటికి రాగానే ఆ సినిమాల్లోని పాటలను, పద్యాలను యథాతథంగా అనుకరించి చూపేవాడు. అలా మొదలయ్యింది అయన మిమిక్రీ ప్రస్థానం. 1950 లో మెట్రిక్యులేషన్, 1952 లో వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్సు కాలేజీలో చేరారు. నాటి ప్రిన్సిపాల్ బారు వెంకట రామనర్సు, ఇతర లెక్చరర్లు వారించినా వినకుండా, గుడ్ కాండక్టు కింద వేణుమాధవ్ కు ఆ రోజుల్లో అరవై రూపాయల స్కాలర్ షిప్ ( బర్సరీ ) మంజూరు చేశారు. ఆ డబ్బుతో పలు ఇంగ్లీషు సినిమాల్ని చూసి వాటిల్లోని ఆర్టిస్టుల గొంతులు, ముఖ్యమైన సన్నివేషాలు బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ నోట్స్ తో సహా వినిపిస్తే, రామనర్సు పరమానంద భరితులై "యూ విల్ బికం ఎ గ్రేట్ ఆర్టిస్ట్ ఇన్ ద వరల్డ్" అని, అయితే నీవు నా రెండవ కుమారుడవు అని మనసారా ఆశీర్వదించారు. ఆ దీవెనలే వీరిని 'విశ్వ విఖ్యాత ధ్వన్యనుకరణ సామ్రాట్' గా ఎదిగేలా చేసాయి. 1953 లో ప్రభుత్వ పాఠశాల (జి సి ఎస్ స్కూలు హనుమకొండ) లో ఉపాధ్యాయుడుగా ప్రవేశించి, ధర్మ సాగరం, హనుమకొండలోని ప్రాక్టీసింగ్ స్కూలు, మట్వాడ ఉన్నత పాఠశాల, జనగామ, శంభునిపేట పాఠశాలల్లో పనిచేశారు. అనంతరకాలంలో ప్రైవేటుగా బీ.ఏ. బీ. కాం పాసయ్యారు. తొలి ప్రదర్శన 1947 లో ఇచ్చారు. మలి ప్రదర్శన 1953 లో రాజమండ్రిలో జరిగిన థియేటర్స్ ఫెడరేషన్ కానారేన్స్ లో బలరాజ సహానీ గారి అధ్యక్షతన, గరికపాటి రాజారావు, దాడి గోవిందరాజులు, స్థానం నరసింహారావు, చాగంటి సన్యాసిరాజు గారల సమక్షంలో ఇచ్చారు. ఆయన ప్రదర్శనలు చూసిన పలువురు రాజకీయ ప్రముఖుల్లో సర్వేపల్లి రాధాకృష?న్, ఇందిరాగాంధీ, పీవీ నరసింహారావు లాంటి ఎంతోమంది ఉన్నారు. ఆస్ట్రేలియా,ఫిజీ దీవులు –1965,సింగపూర్,మలేషియా – 1968 పశ్చిమ జర్మనీ, ఇంగ్లండ్, ఫ్రాన్స్, అమెరికా, కెనెడా, లెబనాన్ – 1971 ఐక్యరాజ్య సమితిలో ప్రదర్శన – 1971, సింగపూర్,మలేషియా – 1975, అమెరికా, కెనెడా – 1976 దక్షిణాఫ్రికా,మారిషస్,సీషెల్స్ – 1976, సింగపూర్, మలేషియా –1977, అమెరికా, కెనెడా – 1982 యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ – 1987, మారిషస్ – 1990 తదితర దేశాలలో పర్యటించి ప్రదర్శనలు ఇచ్చాడు. వేణుమాధవ్ గారు నిర్వహించిన పదవుల్లో ఎం.ఎల్.సీ (1972–78) ఎఫ్.డీ.సీ డైరెక్టర్ (1976–77) సంగీత నాటక అకాడమీ సభ్యుడు (1974–78), సౌత్ జోన్ కల్చరల్ కమిటీ, తంజావూరు సభ్యుడు, దూరదర్శన్ ప్రోగ్రాం అడ్వయిజరీ కమిటీ



సభ్యుడు (1993–94), టెలికాం అడ్వయిజరీ కమిటీ సభ్యుడు (1993–96), రైల్వే జోనల్ యూజర్స్ కమిటీ సభ్యుడు (1993–96), ఎ.పి.లెజిస్లేటివ్ లైబ్రరీ కమిటీ సభ్యుడు (1972–75), రవీంద్ర భారతి కమిటీ సభ్యుడు (1974–78), ప్రభుత్వ అకాడమిక్ రివ్యూ కమిటీ సభ్యుడు (1975–76) తదితర పదవులు నిర్వహించాడు. ధ్వన్యనుకరణ సామ్రాట్, మిమిక్రీ సామ్రాట్, చుపే రుస్తుం ధ్వన్యనుకరణ చక్రవర్తి, కళాసరస్వతి, స్వర్ కే రాజా, ధ్వన్యనుకరణ ప్రవీణ, ధ్వన్యనుకరణ కళానిధి, మిమిక్రీ రత్న, విశ్వవిఖ్యాత ధ్వన్యనుకరణ సార్వభౌమ, మున్నగు బిరుదులు వరించాయి. 1977 ఆంధ్రా విశ్వవిద్యాలయం నుండి కళా ప్రపూర? బిరుదు, 1982 రాజాలక్ష్మి ఫౌండేషన్ అవార్డు, 1987 జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజీ విశ్వ విద్యాలయం, 1992 కాకతీయ విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేటు...1997 కనకాభిషేకం, 1998 ఎన్టీఆర్ ఆత్మ గౌరవ పురస్కారం, 2001 పద్మశ్రీ, 2005 తెలుగు విశ్వవిద్యాలయం నుండి సాంస్కృతిక రంగంలో విశిష్ట పురస్కారం, తెలంగాణ రాష్ట్ర ఆవిరావే పురస్కారాలు – 2018లో భాగంగా జూన్ 2న తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా పురస్కారం అందజేయ బడింది. తిరుపతి పట్టణంలో గజారోహణం, పౌరసన్మానం జరిగాయి. పద్మశ్రీ నేరెళ్ల వేణుమాధవ్ 2018, జూన్ 19వ తేదీ తమ 85వ యేట కన్నుమూశారు. హనుమకొండ పట్టణంలో నిర్మింపబడ్డ 'డా.నేరెళ్ళ వేణుమాధవ్ గారి కళాప్రాంగణం ' సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలకు చక్కని వేదికగా ఉపయోగ పడుతున్నది. నేరెళ్ళ వేణుమాధవ్ కల్చరల్ ట్రస్ట్' ను స్థాపించి ప్రతియేటా తన పుట్టినరోజైన డిసెంబర్ 28న ప్రముఖ కళాకారులను పదివేల రూపాయల పురస్కారంతో సత్కరిస్తున్నారు. 2017లో నేరెళ్ల వేణుమాధవ్ పేరుతో పోస్టల్ శాఖ ప్రత్యేక కవర్‌ను విడుదల చేసింది. ఆయన పుట్టినరోజైన డిసెంబర్ 28వ తేదీని తెలుగు రాష్ట్రాల్లో 'మిమిక్రీ డే'గా జరుపు కుంటారు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాల మిస్ట్...9440595494**

చురకలు



# అతివల చేతికి ఆహారశుద్ధి పరిశ్రమ

పెద్దపల్లి : చిన్నచిన్న వ్యాపారాలతో లాభాలు గడిస్తున్న మహిళా సహకార సంఘ సభ్యులు త్వరలో ఓ పరిశ్రమను నడిపించనున్నారు. అతివలు రైతులు పండించిన పంటలకు మార్కెట్ వసతి కల్పించి, ఆహార పదార్థాలు తయారీ చేసేలా అడుగులు పడుతున్నాయి. జిల్లాలోని ముత్తారంలో ప్రయోగాత్మకంగా మిర్చి పొడి తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, సెర్ప్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో మహిళలు సంఘంగా ఏర్పాటై మార్కెట్ నైపుణ్య మెలకువలపై శిక్షణ పొందారు. పరిశ్రమ నిర్వహణకు సంబంధించి యంత్రాలు ముత్తారానికి చేరుకొన్నాయి. త్వరలో వీటిని బిగించనున్నారు.

**సంఘాల సమావేశాల్లో అవగాహన**

మిర్చి పొడి, సాస్, చిల్లి ఫ్లేక్స్ తయారీపై బహిరంగ మార్కెట్‌లో కార్పొరేట్ కంపెనీలను తట్టుకునేలా నాణ్యత ప్రమాణాలు పాటించనున్నారు. జిల్లాలో సుమారు పది వేల సంఘాల్లో లక్ష పైనే సభ్యులు ఉన్నారు. ఆయా సంఘాల్లోని సమావేశాల్లో నూతన పరిశ్రమ మిర్చి ఉత్పత్తులపై అవగాహన కల్పించనున్నారు. ఉత్పత్తులు కొనుగోలు చేసేలా ప్రోత్సహించనున్నారు. ప్రతి సభ్యురాలు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవడంతో గిరాకీ పెరగనుంది. మహిళలకు లాభాలు రానున్నాయి.



**700 మందితో ఉత్పాదక సంఘం**

జిల్లాలో ముత్తారం మండలంలో మిర్చి పంట అధికంగా సాగవుతోంది. పంట సాగులో అత్యధికంగా మహిళలే కీలకంగా వ్యవహరిస్తారు. అయితే మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించటం ప్రశ్నార్థకమైంది. ఈ ప్రాంతంలో మార్కెట్ వసతి లేకపోవడంతో విక్రయానికి వరంగల్, హైదరాబాద్ వెళ్లి నష్టాలపాలవుతున్నారు. ఇక్కడ పండించిన మిర్చి పంట నుంచి పొడి తయారు చేస్తే లాభాలు రానున్నాయని మహిళలు ముందుకొచ్చారు. 700 మందితో మహిళా రైతు ఉత్పాదక సంఘం ఏర్పాటైంది. పరిశ్రమ ఏర్పాటుకు సభ్యులు రూ.6 లక్షలు.. మరో రూ.7 లక్షలు కలెక్టర్ కేటాయించారు. మిర్చి పౌడర్, సాస్, చిల్లి ఫ్లేక్స్ తదితర పదార్థాల తయారీపై మహిళలకు అధికారులు, సంస్థ వారు అవగాహన కల్పించారు. మార్కెట్ ఎలా చేయాలనే అంశాలపై మెలకువలు నేర్పించారు.

# మూడో విడత.. ముమ్మరం

ధర్మపురి : వీధి వ్యాపారులు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేలా రుణాలను మంజూరు చేస్తున్నారు. మొదటి విడతలో రూ.10 వేల రుణం అందించగా రెండో దశలో రూ.20 వేలు, మూడో దశలో రూ.50 వేల రుణం మంజూరవుతోంది. క్రమంగా రుణ పరిమితి పెరుగుతుండగా వ్యాపారులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతున్నారు. మూడో దశ రుణాల కేటాయింపు ప్రక్రియ జిల్లాలో ముమ్మరంగా సాగుతోంది.

జిల్లాలోని అయిదు పురపాలికల్లో 16,234 మంది వీధి వ్యాపారులు లబ్ధి పొందారు. కూరగాయలు, పళ్లు, పూలు విక్రయించేవారు, చిన్నపాటి దుకాణాలు నడిపేవారు, టీ కొట్టు నిర్వహించేవారు ఇలా అనేక మంది ఉపాధి అవకాశాలు విస్తరించుకున్నారు. దీని ద్వారా పట్టణ ప్రాంతంలో స్వయం ఉపాధి పెరిగింది. చిరు వ్యాపారుల పిల్లల విద్య, వైద్య ఖర్చులకు ఉపయోగించుకున్నారు. మహిళలు పెద్ద



సంఖ్యలో లబ్ధి పొందడంతో కుటుంబ ఆర్థిక స్థితి మెరుగవుతోంది. వీధి వ్యాపారులకు సామాజిక గౌరవం పెరిగింది.

**ధర్మపురికి అగ్రస్థానం**

చిరు వ్యాపారులకు రుణాల కేటాయింపు, ఆన్‌లైన్ ప్రక్రియలో ధర్మపురి పురపాలిక జిల్లాలో మొదటి స్థానంలో నిలుస్తోంది. ధర్మపురి పట్టణంలో 735 మంది వీధి వ్యాపారులకు మొదటి దశలో రూ.73.50 లక్షలు, రెండో దశలో రూ.91.0 లక్షలు, మూడో దశ ప్రారంభంలో రూ.2.37 కోట్లు కేటాయించారు. 735 మంది వీధి విక్రయదారులకు 721 మంది వివరాలు ఆన్‌లైన్ చేయగా జిల్లాలోనే అగ్రస్థానంలో నిలిచింది.

**ఆదాయం పెరిగింది** కూరగాయలను విక్రయించి లబ్ధి పొందుతున్నాం. ప్రభుత్వం ఇచ్చిన రూ.10 వేల రుణంతో సరకుల నిల్వలు పెంచుకున్నాం. తర్వాత రూ.20 వేలు, ప్రస్తుతం రూ.50 వేలకు అర్హత సాధించాం. వీటి ద్వారా రోజువారీ ఆదాయం పెరిగి ఇంటి అవసరాలు తీరుతున్నాయి. లక్ష్మి, ధర్మపురి

# ఏఐ.. ప్రత్యేకావసరాలకూ సై!

మంచిర్యాల : అన్నీ సవ్యంగా ఉన్న పిల్లలకు పాఠాలు చెప్పడమే ఉపాధ్యాయులకు కష్టమైన పని.. అలాంటిది బుద్ధిమాంద్యం, అంధ, మూగ, చెవిటి వంటి ప్రత్యేకావసరాల పిల్లలకు బోధన చేయడమంటే ఎంతో ఓపిక ఉండాలి.. విషయం గమనించిన కలెక్టర్ రాజర్షిషా తన నిధులను వెచ్చించి గొప్ప మనసు చాటుకున్నారు. కృత్రిమ మేధ(ఏఐ) బోధన కోసం రూ.4.90 లక్షల విలువైన పరికరాలు ఇప్పించారు. ఆదిలాబాద్ డైట్ కళాశాల ప్రాంగణంలోని భవిత కేంద్రంలో 25 మంది చెవిటి, మూగ, సెరిబ్రల్ పాల్సి, సికిల్‌సెల్, ఎంఆర్, మల్టీ డిజెబులిటీ(ఎండీ) వంటి ప్రత్యేక అవసరాల పిల్లలు ఉన్నారు. వారి కోసం ఇద్దరు విలీన విద్య రిసోర్సుపర్సన్లు విధులు నిర్వహిస్తున్నారు. గతంలో భవిత కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ అక్కడి పరిస్థితులను కళ్లారా వీక్షించారు. ఏఐ బోధన ఉపయుక్తంగా ఉంటుందని ఈ నెల 12వ తేదీన ఆయా పరికరాలను సమకూర్చారు. ఒకేసారి అందరూ వింటున్నారు..!

ఏఐ పరికరాలు అందుబాటులోకి రావడంతో ఒకేసారి గ్రూప్ హియరింగ్ హెడ్స్‌తో పాఠాలు వింటున్న పిల్లలు..

**బోధన సులువు..** ట్రెస్టిల్, కోబో టాబ్లెట్, ఆర్బిట్ రీడర్ 2.0 సెల్, డిజిటల్ స్పీచ్‌ట్రైనర్, గ్రూప్ హియరింగ్ కిట్స్, ఏఏసీ కిట్స్, డిజిటల్ స్పీచ్ థెరపీ పరికరాలు, ల్యాప్‌టాప్, స్కానర్ వంటివి ఏఐ ల్యాబ్‌లో అందుబాటులో ఉంచారు. అభ్యసన, కమ్యూనికేషన్ సామర్థ్యాల పెంపునకు ఏఐ ల్యాబ్ ఎంతో ఉపయోగపడుతోందని రిసోర్స్‌పర్సన్ పుష్పవేణి చెబుతున్నారు. స్కానర్, ల్యాప్‌టాప్ సాయంతో అంధ విద్యార్థులు తమంతట తామే పాఠాలు వినగల్గుతున్నారని పేర్కొన్నారు.

మార్పు కనిపిస్తోంది.. విజయ, పోషకురాలు, తాటిగూడ

# ఘాటు గాయం.. మటుమాయం కావాలని!



ఖమ్మం : కొన్నేళ్లుగా లాభాలను మిగిల్చిన మిరప పంట.. రెండు మూడేళ్లుగా నష్టాలను మోసుకొస్తోంది. మిరపను వదిలి పత్తి సాగుచేసిన రైతులపై ఈ ఏడాది వరుణుడు కన్నెర్ర చేశాడు. వానాకాలంలో అధిక వర్షాలు, మొంథా తుపాను ముంచెత్తటంతో కాసిన పత్తి నేలపాలైంది. కొద్దిమంది మాత్రమే గట్టెక్కారు. ఈ రెండు పంటలూ కన్నీళ్లు మిగిల్చటంతో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో కర్షకులు యాసంగిలో మొక్కజొన్న వైపు మళ్లారు.

**మక్కలకు పెరిగిన ఆదరణ**

ఖమ్మం జిల్లాలో గతేడాది 60వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో మిరప సాగవగా, ఈసంవత్సరం 31,713 ఎకరాలకు పడిపోయింది. వానాకాలంలో 2,415 ఎకరాల్లో మొక్కజొన్నను రైతులు సాగుచేశారు. పత్తి పండించిన రైతులకు నష్టాలు రావడంతో నవంబర్‌లో చెట్లను తొలగించారు. మిరప రైతులూ ఆ పంటను వదిలేసి మొక్కజొన్న పంటపై దృష్టిసారించారు. ప్రస్తుత యాసంగిలో 1,59,462 ఎకరాల్లో మొక్కజొన్న సాగవుతుందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటికే 1.25 లక్షల ఎకరాల్లో రైతులు పంట వేశారని సమాచారం. గతేడాది 1,22,827 ఎకరాల్లో మక్కలు పండించారు. ప్రస్తుతం పత్తి, మిరప రైతులు ఇటువైపు మళ్లటంతో మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు. భద్రాద్రి జిల్లాలో యాసంగిలో మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 22,229 ఎకరాలు. ఈసంవత్సరం 32,300 ఎకరాల్లో పంట సాగవుతుందని అంచనా. ఇప్పటికే 26,450 ఎకరాల్లో పంట సాగవటం విశేషం. గతేడాది నాలుగెకరాలు కౌలు తీసుకొని మిరప పంట సాగుచేశాను. తెగులు సోకటంతో పంట దెబ్బతింది. చేతికందిన మిరపకు మద్దతు ధర లభించకపోవటంతో రూ.5లక్షల నష్టం వచ్చింది. ఈసారి మొక్కజొన్న పంట వేశాను. మిరపలో దిగుబడి బాగుంటే ధర ఉండదు.. మంచి ధర పలికినప్పుడు పంటను వైరస్ చుట్టిముట్టి నాశనం చేస్తోంది. మొక్కజొన్న పంట సాగు ఆశాజనంగా ఉంటుంది. గుమ్మడి నాగార్జున, సిరిపురం (వైరా)

# ఇంతింతై.. ఉపాధి పథమై..



ఖమ్మం : ఖమ్మం మహిళా మార్ట్.. ఈ ఆలోచన అతివలను వ్యాపారులుగా తయారుచేసింది. 300 కుటుంబాల్లో వెలుగులు నింపుతోంది. వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులు అందించి వారి నమ్మకాన్ని చూరగొంటోంది. స్థాపించిన ఏడు నెలల్లోపే మహిళా మార్ట్‌లో రూ.55.94 లక్షల అమ్మకాలు జరిగాయి. మగువలకు ఉపాధి చూపటంలో ఆదర్శంగా నిలవటంతో రాష్ట్రవ్యాప్తంగా మహిళా మార్ట్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

**10 శాతం నికర లాభం**

జిల్లా పరిషత్తు మహిళా సమాఖ్య, గ్రామీణాభివృద్ధి శాఖ(డీఆర్డీఏ) సంయుక్త ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలో ఈఏడాది మే 28న మహిళా మార్ట్ ఏర్పాటుచేశారు. తినుబండారాలు, ఆహారపదార్థాలు, అలంకరణ, పరిశుభ్రత, కొయ్యబొమ్మలు, హెర్బల్ ఉత్పత్తులను విక్రయిస్తున్నారు. ఇందులో అమ్మేవన్నీ స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ) సభ్యులు సేకరించినవి, తయారుచేసినవి కావటం విశేషం. వినియోగదారుల అభిరుచి మేరకు అవసరమైన సామగ్రి కోసం మండల సమాఖ్య(ఎంఎస్)లకు ఆర్డర్ ఇస్తారు. అక్కడి ఏపీఎంలు డ్వాక్రా రుణంతో స్వయం ఉపాధి యూనిట్లు తయారుచేసుకున్న ఎస్‌హెచ్‌జీ సభ్యులకు సమాచారం చేరవేస్తారు. జిల్లావ్యాప్తంగా 101 మంది పొదుపు సంఘం మగువలు పప్పుదినుసులు, చిరుధాన్యాలు, కొయ్యబొమ్మలు, సేంద్రియ ఉత్పత్తులను మహిళా మార్ట్‌కు సరఫరా చేస్తున్నారు. నాణ్యమైన ఉత్పత్తులను మార్ట్‌లోని ఉద్యోగులు, డీఆర్డీఏ సిబ్బంది ఎంపిక చేసుకొని 12శాతం లాభంతో వినియోగదారులకు అమ్ముతున్నారు. ఇప్పటివరకు రూ.55,94,962 విలువైన ఉత్పత్తులు విక్రయించగా.. అందులో 2శాతం వేతనాలు, ఇతర ఖర్చులు పోనూ పదిశాతం వరకు నికర లాభాలు గడించారు. దీనిద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 300 కుటుంబాలు జీవనోపాధి పొందుతుండటం అధికారుల దూరదృష్టికి నిదర్శనం.


**రాష్ట్రానికి ఆదర్శం**

అత్యధికంగా బొలిశెట్టి మృణాళిని రూ.4.56లక్షలు, చాగంటి లావణ్య రూ.4.05లక్షలు, మలిశెట్టి రమాదేవి రూ.3.90లక్షల ఉత్పత్తులను మహిళా మార్ట్‌లో విక్రయించారు. మహిళా మార్ట్ సాధించిన విజయాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే వివిధ వేదికలపై ప్రస్తుతించారు. రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచిందంటూ కొనియాడారు. జిల్లాకు ఒకటి చొప్పున వీటిని ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రస్థాయి బృందంతో సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్, హనుమకొండ డీఆర్డీఏ ప్రతినిధులు మహిళా మార్ట్‌ను పరిశీలించారు. దీని స్ఫూర్తితో భద్రాద్రి జిల్లాలో ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిబజార్ ఏర్పాటుకు పీఓ రాహుల్ చర్యలు తీసుకుంటున్నారు.

మహిళా మార్ట్ సత్ఫలితాలు ఇస్తుండటంతో విస్తరించాలని యోచిస్తున్నాం. స్వయం ఉపాధి యూనిట్లు కలిగిన గ్రామీణ ప్రాంతాలకు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తాం. నాణ్యమైన సరకులను వినియోగదారులకు అందిస్తాం. అతివల కోసం ఫిమేల్ జోన్ ఏర్పాటుచేస్తాం. సన్యాసయ్య, డీఆర్డీఓ, ఖమ్మం

ఇప్పటివరకు రూ.4.56లక్షల విలువైన బెల్లం మిఠాయిలు, స్నాక్స్‌ను మార్ట్‌లో విక్రయించాం. వినియోగదారులు మళ్లీ కొనాలనే ఉద్దేశంతో పరిశుభ్రత, నాణ్యతపై దృష్టిసారించాం. మార్ట్‌లో 15 రోజులకోసారి బిల్లులు ఇస్తున్నారు. మా కుటుంబంతోపాటు మరో నలుగురికి ఉపాధి దొరుకుతోంది. బొలిశెట్టి మృణాళిని, శ్రీవారాహి హోంఫుడ్స్, ఖమ్మం

# భద్రాద్రి నేల.. వైకుంఠమై మెరిసేలా!



భద్రాచలం : భద్రాచలం రామాలయంలో ముక్కోటి ఏకాదశి మహోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం కనిపించేలా పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే ఉత్సవాలు మొదలవగా.. సాంస్కృతిక ప్రదర్శనలు అలరిస్తున్నాయి. ఉత్సవ వైభవం రోజురోజుకూ పెరుగుతోంది. ఏరు ఉత్సవం తోడవటంతో రద్దీ బాగానే ఉంటుందని అంచనా వేసి వసతుల కల్పనపై అధికారులు దృష్టి సారిస్తున్నారు.

**ఆ రెండు రోజులు కీలకం**

ప్రతిరోజూ భక్తుల రద్దీ కనిపిస్తున్నా సోమవారం జరిగే తెప్పోత్సవం ప్రత్యేకమైంది. ఆ రోజు సాయంత్రం స్వామివారు ఊరేగింపుగా గోదావరికి చేరుకుంటారు. నది నుంచి హంస వాహనంలోకి వెళ్లేందుకు వీలుగా కర్రలతో ర్యాంపును సిద్ధం చేశారు. అదేరోజు ఘాట్‌లో ఏరు ఉత్సవంలో భాగంగా నృత్యాభిషేకం ఉంటుంది. మంగళవారం జరిగే వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వార దర్శన పూజలకు సెక్టార్లు సిద్ధమయ్యాయి. భక్తులు సెక్టార్లలోకి ప్రవేశించేలా సూచీలు తయారుచేస్తున్నారు.

శాఖల మధ్య సమన్వయం

పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. హోంగార్డు నుంచి ఐపీఎస్‌ల వరకు భాగస్వాములు కానున్నారు. ట్రాఫిక్ చిక్కులు తలెత్తకుండా వాహనాల పార్కింగ్ ప్రదేశాలను గుర్తించారు. తాగునీటి వ్యవస్థ, మరుగుదొడ్లను అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు. పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య చర్యలు చేపట్టగా.. విద్యుత్తు విభాగం సిబ్బంది మరమ్మతులు పూర్తి చేసింది.

బుధవారం మధ్యాహ్నం వరకు ఆన్‌లైన్‌తో పాటు కౌంటర్లలో..

బుధవారం రాత్రికి టికెట్ల విక్రయాలు పెరిగాయి. మొత్తమ్మీద 3,680 టికెట్లను విక్రయిస్తే సుమారు రూ.38.27 లక్షల ఆదాయం వస్తుంది. వీఐపీ టికెట్లను పూర్తిస్థాయిలో విక్రయించకుండా ప్రముఖులు వస్తారని దాచిపెట్టారు. సెక్టార్-సీ, డీలకు విశేష ఆదరణ లభిస్తోంది.

వీవీఐపీ విభాగంలో 250 మందికి అవకాశం ఉంటుంది. రాష్ట్ర, జిల్లా, స్థానిక ప్రెస్-మీడియా నుంచి 150 మందికి అవకాశం కల్పిస్తారు. వీవీఐపీ, ప్రెస్ విభాగాలు ఉచిత సెక్టార్లు.

# ఇదేం 'చెత్త' పని

ఆదిలాబాద్ : రెండు ప్రైవేటు సంస్థలకు పట్టణం నుంచి 8 కి.మీ దూరంలోని బంగారుగూడ దగ్గర గల మున్సిపల్ డంపింగ్ యార్డులో స్థలాన్ని కేటాయించారు. అన్ని సదుపాయాలు పురపాలిక తరఫునే కల్పిస్తున్నారు. బయోమైనింగ్ ప్లాంటుకు చెత్త ఇస్తున్నా అక్కడినుంచి రూపాయి లాభం బల్దియాకు లేదు. దాదాపు 1.16 లక్షల టన్నుల చెత్త ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకొని.. ఎలాంటి ప్రయోజనం ఆశించికపోవడం విడ్డూరం.

**విద్యుత్తు బిల్లు విచిత్రం :** ప్రత్యేకంగా పుర నిధులతోనే రూ.లక్షలు ఖర్చుచేసి అక్కడ హైటెన్షన్ విద్యుత్తు కనెక్షన్ ఇవ్వడంతోపాటు ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. రెండు యంత్రాలకు కలిపి నెలకు రూ.3.50 లక్షల నుంచి రూ.4.30 లక్షల వరకు విద్యుత్తు బిల్లు వస్తోంది. రెండేళ్లుగా రూ.66 లక్షలకు బకాయి పెరిగింది. ఇది ఎవరు చెల్లించాలనేది తెలియడం లేదు. అంతకుముందు బల్దియా తరఫునే చెల్లించినట్లు ప్రచారం జరుగుతోంది. పుర కమిషనర్ పేరిట బిల్లు వస్తోంది. డంపింగ్ యార్డులో వ్యర్థాలను వేరుచేసే బయోమైనింగ్ ప్లాంటు ఇది.. సాగర్ మోటార్ అనే సంస్థకు టెండర్ ద్వారా అప్పగించారు. పురపాలక పరిధిలో నిత్యం సేకరించిన చెత్తను ఇక్కడికి తీసుకొస్తారు. రాళ్లను, వ్యర్థాలను వేరు చేస్తారు. మిగతాది ఎరువుగా ఉపయోగపడకపోవడంతో ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు.



ప్లాస్టిక్ కవర్లు, వస్త్రాలు ఇతర వ్యర్థాలను కాల్చేందుకు సిమెంటు పరిశ్రమలకు ఆ సంస్థనే అమ్ముతూ ఆదాయం సంపాదించుకుంటోంది. డంపింగ్ యార్డుకు ఆనుకొనే ఏర్పాటు చేసిన ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎఫ్ఎస్‌టీపీ) ఇది.. నివాస గృహాల్లోని సెప్టిక్ ట్యాంకుల్లోంచి సేకరించిన మానవ విసర్జిత వ్యర్థాలను శుద్ధిచేసే యంత్రమిది. మలాన్ని ఎరువుగా తయారుచేసి పొలాలకు సరఫరా చేయాల్సి ఉండగా ఎక్కడా పంపిణీ చేయలేదు. కేవలం నీటిని శుద్ధిచేసి చెట్లకు వినియోగిస్తున్నారు. వచ్చిన కొంత ఎరువును హరితహారం చెట్లకు వాడుతున్నట్లు చెబుతున్నారు. భారత్ ప్రిస్టియన్ ఇన్‌ఫ్రా ప్రై. లిమిటెడ్ అనే సంస్థ ఆధ్వర్యంలో ప్లాంటు నడుస్తోంది.

**బిల్లు చెలింపుపై స్పష్టతలేదు**

సీవీఎన్ రాజు, పుర కమిషనర్

విద్యుత్తు బిల్లు వాస్తవానికి ఆ సంస్థలే చెల్లించాలి.. ఇక్కడ మాత్రం స్పష్టత లేదు. బకాయిలు పెరగక ముందు బిల్లు ఎవరు చెల్లించారనే దానిపై సమాచారం లేదు. హైదరాబాద్ స్థాయిలోనే టెండర్లు జరిగినందున ఉన్నతాధికారులకు నివేదిస్తాం..

# కొయ్యలకు నిప్పు.. భూసారానికి ముప్పు


మంచిర్యాల : జిల్లాలో యాసంగి పనులు ప్రారంభమవుతున్న వేళ రైతన్నలు వానాకాలంలో కోసిన వరి, పత్తి పంట పొలాల్లో కొయ్యలను కాల్చివేస్తున్నారు. ఫలితంగా భూసారం తగ్గడంతోపాటు, పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోందని శాస్త్రవేత్తలు, అధికారులు చెప్పినా ఫలితం లేకుండా పోతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. యంత్రాలతో కోతలు చేయడం వల్ల వరి కొయ్యలు భూమి స్థాయికి కోయడంలేదు. ఆర్థిక భారమని వాటిని కాల్చివేస్తున్నారు.

**దిగుబడులపై ప్రభావం..**

జిల్లావ్యాప్తంగా సాగు భూముల్లో ప్రతీసారి రైతులు కొయ్యలను కాల్చివేయడం వల్ల భూమిలోని పంటలకు ఉపయోగపడే మిత్ర పురుగులు, సూక్ష్మజీవులు నశించిపోతాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలియజేస్తున్నారు. తద్వారా క్రమంగా దిగుబడులు తగ్గే అవకాశం ఉంది. దీనిపై అధికారులు ప్రతి సీజన్‌లో ప్రత్యేకంగా రైతులతో మాట్లాడి మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. ఓ వైపు మితిమీరిన రసాయన ఎరువులు, గడ్డి మందులను వినియోగించడంతో పాటు నిప్పు పెట్టడంతో భూమిలో సారం తగ్గుతుందని అధికారులు తెలియజేస్తున్నారు.

**సేంద్రియం వైపు సాగాలి**

ఏటా వానాకాలంలో పంటలు సాగుచేసే క్రమంలో ముందస్తుగా పచ్చిరొట్టను ఎలాగైతే సాగుచేసి భూమిలోనే దున్నుతారో అదే మాదిరిగా వరి కొయ్యలను కలియదున్ని కొంతకాలం పాటు పొలంలోని నీటిలోనే



మురిగేలా చేస్తే పంటలకు ఎలాంటి నష్టం కలిగించే అవకాశం ఉండదని శాస్త్రవేత్తలు అంటున్నారు. రసాయన ఎరువులు కాకుండా పశువుల పేడ, పశువుల ఎరువుల వంటివి వినియోగిస్తే భూమి ఆరోగ్యంగా ఉంటుందని తెలియజేస్తున్నారు. ఇదే క్రమంలో ప్రతి సీజన్‌లో పంటలను మార్పిడి చేస్తూ సాగు చేసుకుంటే మరింత లాభదాయకంగా దిగుబడులు పొందుతారని అధికారులు వివరిస్తున్నారు.

జిల్లాలో సాగు భూముల వివరాలివే.. (లక్షల ఎకరాల్లో)

మండలాలు : 18

మొత్తం సాగు భూములు : 3.40

రైతులు : 1.20 లక్షలు

వానాకాలంలో సాగైన వరి పంట : 1.52

సాగైన పత్తి పంట : 1.80

యాసంగిలో సాగయ్యే భూములు : 2.80

సాగుచేసే పంటలు : వరి, మొక్కజొన్న, పత్తి, కంది, కూరగాయలు

# పెద్దాసుపత్రి.. ఏదీ అభివృద్ధి?

కరీంనగర్ : కరీంనగర్ పెద్దాసుపత్రి ఉమ్మడి కరీంనగర్‌తో పాటు మంచిర్యాల జిల్లావాసులకు గుండెకాయలా పని చేస్తోంది. కానీ నిధుల కొరతతో అభివృద్ధి పనులు అటకెక్కాయి. ఇదిలా ఉండగా ఇక్కడ ఆరోగ్యశ్రీలో శస్త్రచికిత్సలు చేస్తున్నారు. దీనికి సంబంధించిన నిధులు ప్రభుత్వం నుంచి వచ్చినప్పుడు 40 శాతం వైద్యులు, సిబ్బందికి పోగా మిగతా 60 శాతంతో శస్త్రచికిత్సకు అవసరమైన పరికరాలు కొనుగోలు చేయొచ్చు. కానీ రెండేటళ్లుగా ఆరోగ్యశ్రీ నిధులు రాకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతోంది.

**పడకల సంఖ్య పెంచుకోవచ్చు**

ఆరోగ్యశ్రీ నిధులు రూ.4.50 కోట్లు రావాల్సి ఉంది. ఇవి రాకపోవడంతో నూతన పరికరాలు కొనలేకపోతున్నారు. ఇప్పటికీ పాత ఆపరేషన్ థియేటర్‌నే కొనసాగిస్తున్నారు. వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న ఆసుపత్రికి అత్యవసరంగా 24 గంటలు ఆపరేషన్ థియేటర్ అందుబాటులో ఉండాలి. పెండింగ్ నిధులు సకాలంలో మంజూరైతే కొత్త థియేటర్ ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంటుంది. ఐసీయూను విస్తరించడం, వెంటిలేటర్లు, పడకల సంఖ్య పెంచుకోవడానికి



అవకాశం ఉంటుంది. కొందరు వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నా యంత్రాల కొరతతో పూర్తి స్థాయిలో అత్యాధునిక వైద్య సేవలు అందించలేకపోతున్నారు. ఆసుపత్రికి సరిపడా మందుల సరఫరా లేక బయటకు రాస్తున్నారు. నిధులిస్తే వివిధ వ్యాధులతో బాధపడే రోగులకు అవసరమైన మందులు అందించ డంతోపాటు పని చేయని యంత్రాలకు మరమ్మతులు చేసుకోవచ్చు.

**మెరుగైన సేవలు అందిస్తున్నాం: వీరారెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్**

ఆసుపత్రిలో రోగులకు ఇబ్బందులు లేకుండా మెరుగైన సేవలందిస్తున్నాం. ఆరోగ్యశ్రీ నిధులు రావాల్సి ఉంది. అవి వస్తే యంత్ర పరికరాలు కొనుగోలు చేస్తాం. ఆపరేషన్ థియేటర్‌లోనూ యంత్రాలు సమకూరుస్తాం.

# మేరా నంబర్ కబ్ ఆయేగా?

హైదరాబాద్ : దిల్లీ మెట్రో ఐదోదశకు కేంద్ర మంత్రిమండలి బుధవారం ఆమోదం తెలిపింది. మూడు కారిడార్లలో రూ.12,015 కోట్ల అంచనాలతో 16 కి.మీ. మేర విస్తరించబోతున్నారు. దిల్లీ, పుణె, లఖ్‌నవూ, చెన్నై, బెంగళూరు.. ఇలా అన్ని నగరాల్లో మెట్రోరైలు విస్తరణ ప్రాజెక్ట్‌లకు కేంద్రం అనుమతి ఇస్తోంది. హైదరాబాద్ మెట్రో మాత్రం 'మేరా నంబరు కబ్ ఆయేగా' అన్నట్లుగా ఎదురుచూస్తోంది. కేంద్ర మంత్రివర్గ సమావేశం జరిగిన ప్రతిసారి హైదరాబాద్ మెట్రోరైలు రెండోదశకు అనుమతి వస్తుందేమో అని ఆశగా ఎదురుచూడటం.. లేదని తెలిసి నిరాశపడటం పరిపాటిగా మారింది.

దేశంలో 2014కి ముందు 5 నగరాల్లో 248 కి.మీ. మెట్రోరైలు మార్గం మాత్రమే ఉండేది. కేంద్రంలో భాజపా ప్రభుత్వం వచ్చాక 23 నగరాల్లో 1013 కి.మీ.పెరిగింది. ఈ 11 ఏళ్లలో 765 కి.మీ. నిర్మాణమైంది. అప్పట్లో రోజువారీ సగటు ప్రయాణికుల సంఖ్య 28 లక్షలు ఉంటే.. ప్రస్తుతం 1.12 కోట్లు. తదుపరి విస్తరణకు నగరాల వారీగా కేంద్రం ఆమోద ముద్ర వేస్తోంది. హైదరాబాద్‌కు సంబంధించిన అనుమతుల ప్రక్రియలోనే జాప్యం జరుగుతోంది.

**8 కారిడార్లకు..**:రాష్ట్ర ప్రభుత్వం 14 నెలల క్రితం మెట్రో 2(ఏ) విస్తరణకు, ఆరు నెలల క్రితం మెట్రో 2(బి) విస్తరణకు కేంద్రాన్ని అనుమతులు కోరింది. 2(ఏ)లో 5 కారిడార్లు, రూ.76.4 కి.మీ., రూ.24,269 కోట్ల అంచనాలతో ప్రతిపాదించింది. కేంద్ర ప్రభుత్వం వాటా రూ.4230 కోట్లు.

2(బి)లో మూడు కారిడార్లు, 86.1 కి.మీ., రూ.19,579 కోట్ల అంచనాలతో రూపొందించారు. కేంద్రం వాటా రూ.3524 కోట్లు.

**సానుకూలం అంటూనే సాగదీత..**

రెండోదశకు అనుమతి ఇవ్వాలంటే మొదటిదశ నిర్వహిస్తున్న ఎల్ అండ్ టీతో ప్రభుత్వం ఒక అవగాహనకు రావాలని కేంద్రం సూచించింది. ఇందులో భాగస్వామ్యానికి ఎల్ అండ్ టీ సుముఖంగా లేకపోవడం.. తొలిదశలోని తమ వాటాని ప్రభుత్వానికి విక్రయిస్తామని చెప్పడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్ట్‌ను స్వాధీనం చేసుకునేందుకు నిర్ణయించింది. ఈ మేరకు ఎల్ అండ్ టీ, రాష్ట్ర ప్రభుత్వం మధ్య ఒప్పందం కుదిరింది. మార్చి నెలాఖరు నాటికి మెట్రో మొదటిదశను రాష్ట్ర ప్రభుత్వమే టేకోవర్ చేసుకుంటుందని.. అనుమతులు ఇవ్వాలని కేంద్రానికి లేఖ రాసింది. హైదరాబాద్ వచ్చిన సందర్భంలో కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రిని సీఎం స్వయంగా కలిసి అనుమతులు త్వరగా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి సైతం సానుకూలంగా స్పందించారు. అయినప్పటికీ అనుమతుల కోసం ఎదురు చూపులు తప్పడం లేదు.

# పన్ను పెరగదు.. బకాయిలు కట్టండి

హైదరాబాద్: జీహెచ్ఎంసీలో విలీనమైన శివారు ప్రాంతాల్లో ఆస్తిపన్ను పెరగదని జీహెచ్ఎంసీ స్పష్టం చేసింది. తాజాగా అమల్లోకి వచ్చిన ఓటీఎస్(వన్‌టైం సెటిల్‌మెంట్ స్కీమ్) మాత్రం వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఉండదని తెలిపింది.

**రాష్ట్రంలో రెండు విధానాలు**

దేశవ్యాప్తంగా భూమి రిజిస్ట్రేషన్ విలువ ఆధారంగా ఆస్తిపన్నును నిర్ధారించే విధానాన్ని అమలు చేయాలన్నది కేంద్ర సర్కారు సూచన. ఇప్పటికే అనేక రాష్ట్రాలు సూచనను అమలు చేస్తున్నాయి. గత సర్కారు హయాంలోనే గ్రేటర్ హైదరాబాద్ మినహా.. రాష్ట్రమంతా కొత్త విధానం అమల్లోకి వచ్చింది. జీహెచ్ఎంసీ పరిధిలో మాత్రం.. ఇంటి అద్దె విలువ ప్రాతిపదికన పన్ను విలువను మదించే పాత విధానం కొనసాగుతోంది.

**శివారులోనే ఎక్కువ..**పాత జీహెచ్ఎంసీ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల భూ విలువతో పోలిస్తే.. శివారు గ్రామాల్లో తక్కువ. బంజారాహిల్స్‌లో గజం విలువ రూ.93 వేలు. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని శివారు గ్రామాల్లో గజం రూ.5వేలుగా ఉంది. బండ్లగూడజాగీర్‌లోనూ గజం విలువ రూ.10,500. అయినా.. ప్రస్తుతం శివారు గ్రామాల్లో 1000చ.అ విస్తీర్ణంలో నిర్మించిన అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాటుకు విధించే ఆస్తి పన్ను, ప్రధాన నగరంలో అంతే విస్తీర్ణంలోని ఫ్లాటు ఆస్తిపన్ను సమానంగా ఉన్నాయి. విలీనమైన 27 స్థానిక సంస్థల పరిధి ఇళ్ల సంఖ్య 6,40,513. వసూలయ్యే ఏడాది ఆస్తి పన్ను రూ.602కోట్లు. సగటున ఒక్కో నిర్మాణం చెల్లించే పన్ను రూ.9,398.పాత జీహెచ్ఎంసీ పరిధిలోని నిర్మాణాల సంఖ్య 20,09,485. వాటి నుంచి వసూలయ్యే వార్షిక పన్ను.. రూ.2,109కోట్లు. సగటున ఒక్కో నిర్మాణం చెల్లించే పన్ను రూ.10,495.

# అదే తెగింపు.. ఆగని తరలింపు



మల్లాపూర్: జిల్లాలో నిత్యం గోదావరిలోని పలు ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. గోదావరికి గత ఇరవై ఏళ్లలో లేనివిధంగా ఈ ఏడాది భారీగా 45 రోజులపాటు నిండుకుండలా ప్రవాహం రావడంతో భారీగా ఇసుక నిల్వలు పేరుకుపోయాయి. దీంతో మాఫియా కన్ను ఇప్పుడు ఈ ఇసుక అక్రమ రవాణాపై పడింది.

**దారి నిర్మించి మరీ..**

మల్లాపూర్ మండలం మొగిలిపేటలో ఇసుక అక్రమ రవాణాకు ఏకంగా అక్రమార్కులు రూ.3 లక్షలు వెచ్చించి భారీ పొక్లెయిన్‌లతో పెద్దపెద్ద రాళ్లను పక్కకు నెట్టి రహదారిని నిర్మించారు. నదికి అవతలి వైపున్న ఇసుకను వారం రోజులుగా దాదాపు వందల ట్రాక్టర్లలో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని పలు గ్రామాలతోపాటు మెట్‌పల్లి, కోరుట్ల పట్టణాలకు ఇసుక తరలుతున్నా.. అధికారులు పట్టించుకోవడంలేదు.

**ఆరు మండలాల్లో పెద్దఎత్తున..**జిల్లాలో ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, రాయికల్, సారంగాపూర్, ధర్మపురి, వెల్గటూర్ మండలాల్లో పెద్దఎత్తున ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. పలు ప్రాంతాల్లోని వీడీసీలు వేలం పాటను నిర్వహించి అమ్మకాలను ప్రోత్సహిస్తున్నాయి. దీంతో ఇసుక రవాణాకు అనధికారికంగా అనుమతులు ఇచ్చినట్లుగా అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. పలు ప్రాంతాల్లో డంప్‌లను ఏర్పాటు చేసి ఉదయం అక్కడ నిల్వ చేసి రాత్రి వేళల్లో టిప్పర్లలో పట్టణ ప్రాంతాలకు భారీ స్థాయిలో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.


**ప్రభుత్వ ఆదాయానికి గండి**

రీచ్‌లను ఏర్పాటుచేసి ఇసుకను విక్రయిస్తే ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరే అవకాశాలున్నాయి. చుట్టుపక్కల జిల్లాలో ఇలాంటి ఏర్పాట్లు ఉన్నప్పటికి.. జగిత్యాల జిల్లాలో మాత్రం అధికారులు రీచ్‌లను ఏర్పాటు చేయడం లేదు. ఇది అక్రమార్కులకు వరంగా మారగా ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది.

**అధికారులకు భారీగా ముడుపులు**

స్థానికంగా అనుమతి ఉన్న రీచ్‌లు లేకపోవడంతో జిల్లాలో గోదావరి తీర ప్రాంతాలతోపాటు వాగుల నుంచి పెద్దఎత్తున ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. అధికారులు భారీగా ముడుపులు తీసుకుని చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాలతో అడపాదడపా తనిఖీలు చేపడుతున్నా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవడం లేదు. ఈ దందాపై ఉన్నతస్థాయి అధికారులు దృష్టి సారించాల్సిన అవసరముంది. ఈ విషయమై మెట్‌పల్లి డీఎస్పీ రాములును సంప్రదించగా.. అక్రమ రవాణాపై చర్యలు తీసుకుంటామన్నారు.

# బాధ్యత మరిచి.. లంచాలకు మరిగి!



కరీంనగర్ :ప్రస్తుతం మానకొండూర్ మండలంలో విధులు నిర్వహిస్తున్న కార్యదర్శి, గతంలో చొప్పదండి మండలంలో పని చేసినప్పుడు ఇళ్లకు అక్రమంగా ఇంటి నంబర్లు ఇచ్చారని, విధులపై నిర్లక్ష్యం వహించారని ఇటీవల కలెక్టర్ పమేలా సత్పతి సస్పెండ్ చేశారు. రెండు నెలల కిందట వీణవంక మండలంలోని ఓ కార్యదర్శి ఇంటి నంబరు ఇవ్వడానికి రూ.20 వేలు లంచం డిమాండ్ చేయడంతో బాధితులు అనిశాను ఆశ్రయించారు. ఆ అధికారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని కేసు నమోదు చేశారు.గంగాధర మండలంలోని మరో గ్రామ అధికారి ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి రూ.10 వేలు లంచం డిమాండ్ చేసి అనిశాకు పట్టుబడ్డారు.

పల్లెల్లో ప్రగతిని పరుగులు పెట్టించాల్సిన ఉద్యోగులు లంచాలకు మరగడం పంచాయతీరాజ్ శాఖకు తలనొప్పిగా మారింది. జిల్లాలో అనిశాకు పట్టుబడటం, సస్పెండ్ అవుతుండటం వారి పనితీరు ఎలా ఉందో తెలియజేస్తుంది. క్షేత్రస్థాయిలో 80 శాతం మంది యువ అధికారులే ఉన్నారు. కష్టపడి పోటీ పరీక్షలను ఎదుర్కొని ఉద్యోగాల్లో చేరిన వారే. తమ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించి ప్రజలకు సహాయపడాల్సిన వారు ఇలా ఆమ్యామ్యాలకు ఎగబడటం విస్తుగొల్పుతుంది. కొందరు ప్రతి పనికి ధర కట్టి లంచం డిమాండ్ చేస్తున్నారు. జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు వెళ్లడంతో సస్పెండ్ అవుతున్నారు.

పల్లెల్లో ప్రభుత్వ ఆస్తులు కాపాడాల్సిన అధికారులే లంచాలకు ఎగబడటం చూస్తుంటే 'కంచె చేను మేసిన' చందంగా మారిందని ఆయా గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటి వరకు పాలకవర్గం లేక వీరు ఆడిందే ఆటగా మారింది. ప్రస్తుతం వారు బాధ్యతలు స్వీకరించడంతో వీరి ఆగడాలకు కట్టడి పడుతుందేమో చూడాలి.తిమ్మాపూర్ మండలంలోని ఓ గ్రామంలో వ్యక్తి ఇంటి నిర్మాణానికి అనుమతి తీసుకొని రిసార్ట్‌లు నిర్వహిస్తుండగా.. కార్యదర్శి అతని వద్ద నుంచి వసూళ్లకు పాల్పడి విషయం కప్పిపెట్టాడు.

గంగాధర మండలంలో చనిపోయిన వ్యక్తి కుటుంబ సభ్యులతో కుమ్మక్కై తప్పుడు తేదీతో మరణ ధ్రువపత్రం జారీ చేసి రెండేళ్ల ఆసరా పింఛను దుబారా చేశారు. దీనిపై విచారణ ఎదుర్కొంటున్నారు.

**జవాబుదారీతనంగా ఉండాలి: వి.జగదీశ్వర్, డీపీవో**

జిల్లాలో చాలామంది కార్యదర్శులు నిజాయతీగా ఉంటున్నారు. పనితీరు బాగాలేని వారిపై చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలి. ఎవరైనా తప్పు చేస్తే మాకు లేదా కలెక్టర్ దృష్టికి తీసుకురండి. చర్యలు తీసుకుంటాం.

# రెండూళ్లు .. అవే ఆనవాళ్లు



కోరుట్ల : కవలలుగా జన్మించిన వారి రూపం ఒకేలా ఉంటుంది. ఇద్దరూ ఒక చోట చేరితే ఎవరు ఎవరో పోల్చుకోవడం కష్టం. అలాగే కోరుట్ల మండలంలో రెండు గ్రామాలు జనాభా, భౌగోళిక స్వరూపం, కట్టడాలు, ఆలయాలు.. ఇలా అన్ని విధాలా దాదాపు ఒకేలా ఉండటం ఆకట్టుకుంటోంది. జాతీయ రహదారిని ఇరువైపులా ఉండే గుంలాపూర్, వెంకటాపూర్ గ్రామాల మధ్య పలు సారూప్యతలు యాదృచ్ఛికమే అయినా కొత్తవారిని ఆశ్చర్యపరుస్తున్నాయి.

**గుట్టపై ఆలయాలు.. నెల రోజులు ఉత్సవాలు**

గుంలాపూర్‌లో అంబేడ్కర్ విగ్రహం నుంచి కొద్ది దూరం వెళ్తే ఎడమ వైపు పంచాయతీ కార్యాలయం ఉంటుంది. అక్కడి నుంచి ముందుకెళ్తే కుడి వైపున చెరువు, దాని ఒడ్డున ప్రభుత్వ పాఠశాల కనిపిస్తాయి. పంచాయతీ నుంచి ప్రధాన మార్గంలో వెళ్తే గ్రామ శివారులోని గుట్ట దర్శనమిస్తుంది. ఆ గుట్టపై గతంలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించగా ఏటా ఫిబ్రవరిలో భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని వారం రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. గ్రామంలో ఇటీవల యువకులు ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహం ప్రారంభానికి సిద్ధంగా ఉంది.వెంకటాపూర్‌లో కొంత దూరం వెళ్లగానే ఎడమ వైపు పంచాయతీ కార్యాలయం ఉంటుంది. దాని వెనకనున్న కాలనీ మీదుగా వెళ్తే చెరువు, దాని ఒడ్డున ప్రభుత్వ పాఠశాల కనిపిస్తాయి. పంచాయతీ ముందు నుంచి ప్రధాన మార్గంలో వెళ్తే గ్రామ శివారులో గుట్ట దర్శనమిస్తుంది. దానిపై చాలా ఏళ్ల కిందట శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించగా ఏటా కార్తీక మాసంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు వారం పాటు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. రెండేళ్ల కిందట గ్రామంలో యువకులు ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

**హైవేకు అటూ ఇటూ..**

గుంలాపూర్, వెంకటాపూర్ పక్కపక్కనే ఉన్నా వేర్వేరు పంచాయతీల కిందకు వస్తాయి. గుంలాపూర్ జనాభా 1,775 కాగా కుటుంబాలు 532. వెంకటాపూర్‌లో 2001 మంది ఉండగా 680 కుటుంబాలున్నాయి. రెండూళ్లలో ప్రధాన పంటలు వరి, మామిడి. గ్రామాలను విభజించే జాతీయ రహదారి పక్కన నిర్మించిన అధునాతన భవనాలు అతిథులకు స్వాగతం పలుకుతున్నాయి.

**పంట కాలువలు.. నేతల విగ్రహాలు**

జగిత్యాల–నిజామాబాద్ మార్గంలో రహదారికి ఎడమ వైపు గుంలాపూర్, కుడివైపు వెంకటాపూర్ ఉంటాయి. జాతీయ రహదారి దిగి గుంలాపూర్‌లోకి కొద్ది దూరం వెళ్లగానే దారికి అడ్డుగా చెరువు నీటితో కూడిన పంట కాలువ ఎదురవుతుంది. అక్కడి నుంచి ముందుకెళ్తే ఎడమవైపు డా.బీఆర్.అంబేడ్కర్ విగ్రహం ఉంటుంది. ఇదే తీరుగా హైవే నుంచి వెంకటాపూర్ వైపు వెళ్తే కిలోమీటరు దూరంలో పంట కాలువ ఎదురవుతుంది. కొద్దిగా ముందుకెళ్తే ఎడమవైపు మహాత్మాగాంధీ విగ్రహం స్వాగతిస్తుంది.

# సగం కొనుగోళ్లూ పూర్తి కాలే!

పెద్దపల్లి : ఉమ్మడి జిల్లాలో పత్తి కొనుగోళ్లు నిదానంగా సాగుతున్నాయి.. దిగుబడి అంచనాలో ఇప్పటి వరకు సగం విక్రయాలు కూడా పూర్తి కాలేదు. సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) కేంద్రాలు ఇప్పటి వరకు ఎక్కువ మొత్తంలో పత్తి కొనుగోలు చేయగా.. ప్రైవేటు ట్రేడర్లు కొంటున్న పత్తికి ధర తక్కువగానే వస్తోంది. వారం, పది రోజులుగా బహిరంగ మార్కెట్‌లో పత్తి ధర కొంత పెరగడం రైతులకు ఆశాజనకంగానే ఉన్నా.. సీసీఐ మద్దతు ధరతో పోల్చితే రైతులకు ఏమాత్రం ప్రయోజనం కలగడం లేదు.. సీసీఐ నిబంధనలకు అనుగుణంగా పత్తిలో తేమ శాతం లేని రైతులు మార్కెట్ యార్డులకు తీసుకు రావడమో, గ్రామాల్లోనే దళారులకు విక్రయించడమో చేస్తున్నారు.ఉమ్మడి జిల్లాలో సీసీఐ 11 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఈ ఏడాది కేంద్రం పత్తికి మద్దతు ధర క్వింటాలుకు రూ.8110 ప్రకటించింది. పత్తిలో తేమ శాతం 8 ఉంటేనే ఈ ధర ఇస్తారు. తేమ ఒక శాతం పెరిగితే ధర 10 శాతం తగ్గుతుంది. తేమ 12 శాతం దాటిన పత్తిని సీసీఐ కొనుగోలు చేయదు. ప్రైవేటు వ్యాపారులకు విక్రయించాల్సి ఉంటుంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేసిన పత్తికి క్వింటాలు గరిష్ఠ ధర రూ.7,500లు దాటడం లేదు. ఈ రేటు ఒక్కో అడ్తీలో రెండు నుంచి మూడు క్వింటాళ్ల వరకే పరిమితమవుతుంది. ఎక్కువ శాతం కొనుగోళు ఇంకా తక్కువ ధరలో ఉంటున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు 5.60 లక్షల క్వింటాళ్ల పత్తి సీసీఐ, ప్రైవేటు వ్యాపారులు కలిసి కొనుగోలు చేశారు. ఇది దిగుబడి అంచనా 19.56 లక్షల క్వింటాళ్లలో



సగం కూడా లేదు. అయితే అధిక వర్షాలతో దిగుబడి తగ్గినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

**పట్టని అధికారులు**

మార్కెట్ ద్వారా వచ్చే ఆదాయంపైనే తప్ప మార్కెట్ ధరల సరళిని అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. దేశంలోని వివిధ మార్కెట్‌లలో పత్తి ధరలు ఎలా ఉన్నాయి. కారణాలేమిటి అనే అంశాలపై కనీసం పట్టించుకోవడం, స్థానిక వ్యాపారులకు అవగాహన కలిగించి రైతులకు గిట్టుబాటు ధర అందించేందుకు చొరవ తీసుకోవడం లేదు. కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకునే రైతుల నుంచి సీసీఐ 7 క్వింటాళ్లకు మించి కొనడం లేదు. పలు మండలాల్లో వ్యవసాయాధికారులు ఎక్కువ దిగుబడులు వచ్చిన రైతుల వివరాలు వెబ్‌సైట్‌లో నవీకరించకపోవడంతో సమస్య పరిష్కారం కావడం లేదు. 7 క్వింటాళ్ల పరిమితిని 12 క్వింటాళ్లకు పెంచేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం చేసిన మంత్రివర్గ తీర్మానానికి అనుగుణంగా అక్కడ సీసీఐ కొనుగోళ్లు జరుపుతోంది. కానీ మన రాష్ట్రంలో ఆ చొరవ తీసుకోకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఉమ్మడి జిల్లాలో పత్తి సాగు : 1,63,030 ఎకరాలు
దిగుబడి అంచనా : 19,56,360 క్వింటాళ్లు
సీసీఐ ద్వారా ఇప్పటి వరకు కొనుగోళ్లు : 3,93,600 క్వింటాళ్లు
ప్రైవేటు ట్రేడర్ల కొనుగోళ్లు : 1,66,719 క్వింటాళ్లు

# పట్టణ దారులను ముంచెత్తగా!

కోరుట్ల : జగిత్యాల–నిజామాబాద్ మార్గంలోని 63వ నంబరు జాతీయ రహదారి పక్కన పడేసిన వ్యర్థాలివి. నిత్యం కుప్పలుగా పడేస్తున్న వ్యర్థాలను కోరుట్ల పురపాలిక పారిశుద్ధ్య సిబ్బంది కాల్చివేస్తుండటంతో వాహనదారులు పొగ, దుర్గంధంతో ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలోని పట్టణ శివారు రహదారులు వ్యర్థాలకు నిలయంగా మారాయి. మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది నిత్యం ఇంటింటికీ తిరిగి చెత్తను సేకరిస్తున్నా, వాహనాలకు మైకు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నా ప్రజల్లో మార్పు రావడం లేదు. ఇళ్లు, దుకాణాల్లోని వ్యర్థాలను యథేచ్ఛగా దారి పక్కన పడేస్తుండటంతో దుర్గంధభరితమవుతున్నాయి.

**జాతీయ రహదారి పక్కన..**

జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ పురపాలికల్లో 683 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తుండగా నిత్యం సుమారు 143 మెట్రిక్ టన్నుల చెత్తను సేకరించి డంపింగ్ యార్డులకు తరలిస్తున్నారు. ఇందుకోసం 167 వాహనాలను వినియోగిస్తున్నారు. జగిత్యాల చుట్టూ



నిజామాబాద్, కరీంనగర్, ధర్మపురి రహదారులు, కోరుట్లలో జగిత్యాల, మెట్‌పల్లి రహదారులు, మెట్‌పల్లి చుట్టూ కోరుట్ల, నిజామాబాద్ మార్గాల్లో ప్రధాన రహదారుల పక్కన చెత్త దుర్గంధం వెదజల్లుతోంది.

బల్దియా వాహనాలకిస్తే ఖర్చవుతుందని..

పాత ఇళ్లు, భవనాలు, గోడలు తొలగించినపుడు వ్యర్థాలను మున్సిపల్ వాహనాలకు ఇస్తే ట్రాక్టరుకు రూ.1000 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. దీంతో ప్రైవేటు వాహనాల్లో తీసుకెళ్లి కాలనీల్లోని ఖాళీ స్థలాల్లో రహదారుల పక్కన పోస్తున్నారు.

మాంసం దుకాణాల వ్యర్థాలను శివారు ప్రాంతాల్లో రహదారులకు ఇరువైపులా, బహిరంగ ప్రదేశాల్లో పడేస్తున్నారు.

వేడుకల మందిరాల్లో వినియోగించిన ప్లాస్టిక్ పళ్లేలు, గ్లాసులు, కప్పులను, మిగిలిన ఆహారాన్ని, వ్యర్థాలను పారిశుద్ధ్య సిబ్బందికి ఇవ్వకుండా రహదారులపై పడేస్తుండటంతో డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. హొటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్ల నుంచి ఆహార వ్యర్థాలను, పళ్లేలను పడేస్తుండటంతో దుర్గంధం వెదజల్లుతోంది.

పట్టణ రహదారులపై చెత్త వేయడం నిషేధమని, అతిక్రమిస్తే రూ.500–1000 వరకు జరిమానా విధిస్తామంటూ పురపాలికల ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. కాగా ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదు.

# భవితకు భరోసా

ముస్తాబాద్ : ఎవరో ఒకరు తోడుంటే కానీ అడుగు కూడా వేయలేరు. సొంత అవసరాలు కూడా తీర్చుకోలేరు. ఇలా ప్రత్యేకావసరాలు కలిగిన శారీరక, మానసిక, వైకల్యం ఉన్న దివ్యాంగ చిన్నారులకు భరోసా కల్పించడం కోసం.. విద్యా, వైద్య సేవలు అందించేందుకు భవిత కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. వైకల్యంతో పుట్టిన చిన్నారుల భవితవ్యం తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తూ వారిలో ఆత్మవిశ్వాసం నింపుతున్నాయి.

**మండలానికో కేంద్రం..**

ప్రభుత్వం ప్రతి మండల కేంద్రంలో ఒక భవిత కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. జిల్లాలో 13 భవిత కేంద్రాలు ఉన్నాయి. అన్ని కేంద్రాల్లో కలిపి 988 మంది ప్రత్యేకావసరాల పిల్లలు ఉన్నారు.

ఒక్కో కేంద్రంలో ఇద్దరు టీచర్లు, ఒక ఫిజియోథెరపిస్ట్, ఒక ఆయా ఉండాలి. కానీ.. జిల్లాలోని 13 కేంద్రాల్లో 10 కేంద్రాల్లో ఉపాధ్యాయులు (ఐఆర్‌పీలు).. ముగ్గురు ఫిజియోథెరపిస్ట్‌లు ఉన్నారు.

సిరిసిల్ల, వేములవాడ, గంభీరావుపేట కేజీటూ పీజీలో పక్కా ప్రత్యేక భవిత కేంద్రం భవనాలు ఉన్నాయి. ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, రుద్రంగి మండలాల్లో ఐఆర్‌పీలులేక ఇన్‌ఛార్జిలతో కొనసాగుతున్నాయి.

ప్రతి వారంలో రెండు రోజులు ఫిజియోథెరపీ నిర్వహిస్తారు. కేంద్రాలకు రాని పిల్లల ఇళ్ల వద్దకు వెళ్లి విద్యాబోధన సేవలందిస్తున్నారు.

కేంద్రాలకు వచ్చే బాలికలకు రూ.700, బాలురకు రూ.500 రవాణా భత్యం కూడా ఇస్తున్నారు. పాఠశాలల్లో వారికి ఐఆర్‌పీలు విద్యాబోధన



చేస్తున్నారు.

**21 రకాల సేవలు**

విద్యార్థుల మానసిక, శారీరక పరిస్థితి అనుగుణంగా శిక్షణ, విద్యాబోధన ఉంటుంది. 5 నుంచి 18 ఏళ్ల మధ్య వయసుగల వారు 21 వైకల్యాలలో ఏదైనా ఒకదానితో బాధపడినా ఈ పాఠశాలల్లో ప్రవేశానికి అర్హులు. వినికిడి లోపం ఉన్నవారికి సైగలు, ఆటిజంతో బాధపడేవారికి స్పర్శ, సంగీతం, మాటలురానివారికి ధ్వనితో తమ పనులు తాము చేసుకునేలా సేవలు అందుతున్నాయి.

**పిల్లలు పాఠశాలకు వచ్చేలా చర్యలు**

ముందుగా గ్రామాల్లో ప్రత్యేకావసరాల పిల్లలను గుర్తిస్తాం. పాఠశాలకు (భవిత) కేంద్రానికి వచ్చేందుకు సంసిద్ధులుగా (స్కూల్ రెడీనెస్ ప్రోగ్రాం) నిర్వహిస్తాం. పాఠశాలకు వచ్చేలా చూస్తాం. ఫిజియోథెరపీ చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నాం. సదరం లేని పిల్లలను గుర్తించి సదరం క్యాంపునకు హాజరయ్యేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి శనివారం భవిత కేంద్రానికి రాలేని పిల్లలను గుర్తించి వారి ఇంటి వద్దకే వెళ్లి విద్యను అందిస్తున్నాం.

గౌతమి, ఐఆర్‌పీ, ముస్తాబాద్

**ఫిజియోథెరపీతో మార్పు** ప్రత్యేకావసరాల పిల్లలకు ప్రతి శుక్ర, శనివారాల్లో ఫిజియోథెరపీ చేస్తున్నాం. సానుకూల ఫలితాలు వస్తున్నాయి. పిల్లల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించి మండల కేంద్రంలో రెండు రోజుల పాటు నిర్వహించే ఫిజియోథెరపీ సేవలను తప్పనిసరిగా వినియోగించుకోవాలి. పిల్లల్లో సానుకూల మార్పు కోరుకోవాలి. అర్హులందరూ సద్వినియోగం చేసుకుంటే సత్ఫలితం ఉంటుంది. బొగన్నగారి రాజేశ్, ఫిజియోథెరపిస్ట్

# అందని శ్వాస.. చలితో గజగజ

పెద్దపల్లి : వాతావరణంలో మార్పులు, కాలుష్య కారకాలతో పిల్లలు, వృద్ధులు నిమోనియా బారినపడుతున్నారు. వైరస్, బ్యాక్టీరియా లక్షణాలు సోకి ఊపిరితిత్తుల సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. పుట్టిన బిడ్డకూ లక్షణాలు సోకడం ఆందోళన కలిగిస్తోంది. చలి నేపథ్యంలో ఈ పరిస్థితి మరింత తీవ్రంగా మారుతోంది. నేడు 'ప్రపంచ నిమోనియా దినోత్సవం' సందర్భంగా ప్రత్యేక కథనం.

**15 శాతం మందికి..**

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు వచ్చే ప్రతీ వంద మంది పిల్లలు, వృద్ధుల్లో పదిహేను శాతం మందికి నిమోనియా లక్షణాలు ఉన్నట్లు వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. చలికాలంలో చిన్నారులు, వృద్ధుల్లో శ్వాసకోశ సంబంధ వ్యాధుల తీవ్రత పెరగనుంది. రెండేళ్లలోపు పిల్లల్లో అధికంగా సమస్య ఉంటుంది. బరువు తక్కువగా పుట్టిన, పోషకాహారలోపం ఉన్న ఏడాదిలోపువారు అస్వస్థతకు గురవుతుంటారు. చలితో ఊపిరితిత్తులు బిగుసుకుపోతుంటాయి. శ్వాసతీసుకోవడానికి ఇబ్బంది పడుతుంటారు. చలికి దూరంగా ఉంచడం, వెచ్చదానికి మాస్కులు ధరించేలా చూస్తే కాస్త ఉపశమనం పొందొచ్చు.. కారణాలు ఇవి సిగరేట్, తంబాకు, బీడీ, మద్యపానం తాగడం. వాయు కాలుష్యం, పరిశ్రమల పొగ, భరించలేని దుమ్ము,



ధూళి సూక్ష్మ కారకాలు.

వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు, బలహీనులు.

తల్లి నుంచి పుట్టిన బిడ్డకు సోకే అవకాశం ఉంటుంది.

**లక్షణాలు ఇలా..**

వైరల్, బ్యాక్టీరియా, ఫంగస్ ఇలా మూడు రకాలుగా ఊపిరితిత్తులకు సోకుతుంది. తీవ్ర జ్వరం, ఒళ్లు నొప్పులు, దగ్గు, జలుబు, గొంతు నొప్పి. చెమట, తీవ్రత ఎక్కువైన వారిలో ఛాతి నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది. సకాలంలో వైద్యులను సంప్రదించాలి

ఊపిరితిత్తులకు వైరస్, బ్యాక్టీరియా సోకి శ్వాస తీసుకోవడం ఇబ్బంది అవుతుంది. పిల్లలు, వృద్ధుల్లో సమస్య తీవ్రంగా ఉంటుంది. రక్తపోటు, మధుమేహం, కిడ్నీ, ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్న వారిలో ఇది అధికం. దీనికి అత్యాధునిక వ్యాధి నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. సకాలంలో చికిత్స చేస్తే నయం కానుంది.

డాక్టర్ వినయ్ కుమార్, పల్మనాలజిస్టు, కరీంగర్

సొంత వైద్యం వద్దు

ఏడాదిలోపు బరువు తక్కువగా ఉన్న పిల్లలు, పోషకాహారలోపం ఉన్న వారిలో ఈ లక్షణాలు కనిపిస్తున్నాయి. పాలు తాగకపోవడం, వేగంగా శ్వాస తీసుకోకపోవడం, దగ్గుతో ఇబ్బంది పడుతుంటారు. సొంత వైద్యం తీసుకోకుండా ఆసుపత్రిలో సంప్రదించాలి.

# ఆదాయమెంత.. ఆమోదమెంత?



హైదరాబాద్: ప్రతిపాదనలు రావడమే ఆలస్యం.. జీహెచ్ఎంసీ కమిషనర్ కార్యాలయం పచ్చజెండా ఊపేస్తోంది. గతంలో ఏడాది పొడవునా రూ.1,100కోట్ల నిర్వహణ పనులకు ఆమోదించేవారు. గడిచిన ఆరు నెలల్లోనే జీహెచ్ఎంసీ ఆ రికార్డును పూర్తి చేసింది. కమిషనర్ కార్యాలయం తీసుకుంటున్న దూకుడు నిర్ణయాలపై జోనల్ కమిషనర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్ఎంసీకి వస్తోన్న ఆదాయం, తక్షణం చేపట్టాల్సిన ప్రాజెక్టులు, అధ్వానంగా మారిన రహదారుల గురించి పట్టించుకోకుండా.. జరుగుతాయో, లేదో తెలియని పనులను వందల సంఖ్యలో ఆమోదించడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**చార్మినార్‌కు రూ.500 కోట్లపైనే..**

జీహెచ్ఎంసీలో 6 జోన్లు ఉన్నాయి. రహదారులు, వరద నీటి కాలువలు, కాలిబాటలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, పార్కుల అభివృద్ధి, చెరువుల సుందరీకరణ, నాలాల నిర్వహణ, ఇతరత్రా పనులను జోన్లవారీగా చేపట్టాల్సి ఉంటుంది. ప్రతిపాదనలను జడ్సీ, ఇంజినీర్లు కేంద్ర కార్యాలయానికి పంపిస్తే కమిషనర్లు తనిఖీ చేయించేవారు. పనులు పూర్తయ్యాక కొత్త వాటిని ఆమోదిస్తామని ప్రజాప్రతినిధులకు నచ్చజెప్పేవారు. ఇప్పుడు మెజార్టీ ప్రతిపాదనలు నేరుగా ఆమోదం పొందుతున్నాయి. 6 నెలల్లో చార్మినార్ జోన్ రూ.500 కోట్లకుపైగా ఆమోదాలతో మొదటిస్థానంలో ఉంది. రూ.200 కోట్లతో శేరిలింగంపల్లి, ఖైరతాబాద్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. కూకట్‌పల్లి, ఎల్బీనగర్, సికింద్రాబాద్ నామమాత్రమే.

**పని చేయకుండానే..**

ఎక్కువ పనులను ఆమోదించుకోవడం, టెండర్లు పిలిచి, గుత్తేదారులకు పనులు అప్పగించడంపైనే ప్రజాప్రతినిధులు దృష్టి పెడుతున్నారు. పనులు చేయించడంపై ఆసక్తి చూపట్లేదనే విమర్శలున్నాయి. పనులు చేయకుండా బిల్లులు తీసుకున్న ఏజెన్సీలు, బిల్లులు ఇచ్చిన ఇంజినీర్ల విషయమై ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఇటీవల కమిషనర్‌కు లేఖ రాశారు. పని చేయకుండానే సింగరేణికాలనీలో సీసీ రోడ్డు, ఓ కమ్యూనిటీహాల్, వరద నాలా నిర్మించినట్టు బిల్లులు తీసుకున్న గుత్తేదారు, ఆమోదించిన ఇంజినీర్ల అవినీతిని సైదాబాద్ కార్పొరేటర్ వెలుగులోకి తెచ్చారు. ఇలాగే కొనసాగితే 2025–26 ఆర్థిక సంవత్సరం ఆమోదాల విలువ రూ.2 వేల కోట్లకు చేరుకుంటుందని, ఆర్థిక క్రమశిక్షణ పాటించాల్సి ఉంది.

అప్పుల కుప్ప..జీహెచ్ఎంసీ వార్షిక ఆదాయం రూ.4,500 కోట్లు

అప్పులు రూ.5,000 కోట్లు

ఉద్యోగుల జీతాలు, పింఛన్లు రూ.120 కోట్లు

ప్రతినెలా అప్పులకు చెల్లించే కిస్తీ రూ.320 కోట్లు (ఎస్సార్డీపీ ప్రాజెక్టు, ట్రెడ్స్ కార్యక్రమం)

# ఆరోగ్య పరీక్ష.. అతివకు రక్ష



సంగారెడ్డి : ఇంటి పనులు, పిల్లల పోషణ, ఇతరత్రా బాధ్యతలతో గృహిణులు నిత్యం తీరిక లేకుండా ఉంటున్నారు. మరికొందరు ఇంటి బాధ్యతలతో పాటు ఉద్యోగం, వ్యాపారం, వ్యవసాయం తదితర పనులతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. వీరు వేళకు తినకపోవడం, సరిపడా నిద్ర లేకపోవడం తదితర కారణాలతో అనారోగ్యానికి గురవుతున్నారు. సకాలంలో వైద్యం చేయించుకోక పోవడం వల్ల ఒక్కోసారి ప్రాణాలకూ ముప్పు వాటిల్లుతోంది. ఈ నేపథ్యంలో మహిళలకు బాసటగా నిలవాలని ప్రభుత్వం సంకల్పించింది. ప్రతి ప్రభుత్వ ఆసుపత్రుల్లో 'ఆరోగ్య మహిళ' పేరిట ఉచితంగా ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తున్నారు. వ్యాధి తీవ్రతను బట్టి అవసరమైతే జిల్లా ఆసుపత్రికి.. లేదంటే హైదరాబాద్‌కు పంపిస్తున్నారు. సకాలంలో వైద్యం అందేలా కృషి చేస్తున్నారు.

**జిల్లాలోని 13 పీహెచ్‌సీల్లో..**

జిల్లాలోని 13 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 'ఆరోగ్య మహిళ' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. బిలాల్‌పూర్, బొల్లారం, హత్నూర, ఝరాసంగం, జిన్నారం, కల్హేర్, కంది, కంగ్టి, కానుకుంట, కొండాపూర్, మునిపల్లి, న్యాల్‌కల్, రామచంద్రాపురంలోని పీహెచ్‌సీల్లో ఈ కార్యక్రమం పేరిటి ప్రతి మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా వివిధ రకాల క్యాన్సర్ల అనుమానితులు, థైరాయిడ్ సమస్య, సూక్ష్మ పోషక లోపాలు, రక్తహీనత తదితరాలపై దృష్టి సారిస్తున్నారు. ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. వ్యాధి తీవ్రత ఆధారంగా ఇతర ఆసుపత్రులకు పంపిస్తున్నారు. క్యాన్సర్ రోగుల కోసం ఇప్పటికే సంగారెడ్డిలో 20 పడకల ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకొచ్చారు.

**'ఆరోగ్య మహిళ' పరీక్షలు ఇలా..**

(ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు వరకు)

ఎంపిక చేసిన ఆరోగ్య కేంద్రాలు: 13

పేర్లు నమోదు చేసుకున్నవారు: 22,582

క్యాన్సర్ కేసులు: 19

మూత్రాశయ సమస్యలు: 1971

పోషక లోపం: 2399

థైరాయిడ్ సమస్యలు: 3608

రక్తహీనత: 5905

పీహెచ్‌సీల నుంచి పై ఆసుపత్రులకు తరలించిన రోగులు: 976

జాగ్రత్తలు పాటించాలి

మహిళలు పనుల్లో తీరిక లేకుండా ఉంటున్నప్పటికీ ఆహారం, ఆరోగ్యానికి తప్పనిసరిగా కొంత సమయాన్ని కేటాయించాలి. సమతుల ఆహారం తీసుకోవాలి. కనీసం 6–8 గంటలు నిద్రపోవాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. వయసుకు తగిన బరువు ఉండేలా చూసుకోవాలి. తాజా పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు తినాలి. శరీరంలో అనారోగ్య మార్పులు గమనిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. నాగనిర్మల, జిల్లా ఇన్‌ఛార్జి వైద్యాధికారిణి

# వసతులు భ్రాంతి.. రైతుకేదీ విశ్రాంతి?



హైదరాబాద్: నగరంలో పెద్దదైన బోయిన్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో గతంలో ఏర్పాటు చేసిన రైతుల విశ్రాంతి భవనం నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి కూరగాయలు తీసుకొచ్చే రైతులు సేదదీరేందుకు పరిపాలన భవనం పక్కనే ఉన్న క్యాంటీన్ పైఅంతస్తులో దీనిని ఏర్పాటు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే రైతులు కూరగాయలు, ఇతర పంటల విక్రయాలు పూర్తి చేసుకుని తిరిగి వెళ్లేందుకు కొన్ని రోజులు ఇక్కడ ఉండాల్సి ఉంటుంది. దీంతో వారు విశ్రాంతి తీసుకునేందుకు ఏర్పాటు చేసిన భవనంలో తొలుత అన్ని వసతులు కల్పించారు. అనంతరం దీని నిర్వహణను మార్కెట్ కమిటీ అధికారులు, ప్రతినిధులు పట్టించుకోక పోవడంతో అధ్వానంగా తయారైంది.

**నిత్యం వేలాది మంది రైతుల రాక**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2002లో 174 దుకాణాలు, మార్కెట్ కమిటీ కార్యాలయం, క్యాంటీన్, రైతులు, హమాలీల విశ్రాంతి భవనాలతో ఈ మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇరు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాలకు చెందిన వేలాది మంది రైతులు నిత్యం ఈ మార్కెట్‌కు 30 వేల నుంచి 35 వేల క్వింటాళ్ల కూరగాయలు తీసుకొస్తుంటారు. వీరు విశ్రాంతి తీసుకునేందుకు ఏర్పాటు చేసిన భవనంలోని ఫ్యాన్లు దెబ్బతిన్నాయి. మంచాలు శిథిలావస్థకు చేరాయి. భవనంలో అపరిశుభ్రత నెలకొంది. తాగునీటి వసతి లేదు. మరుగుదొడ్ల పరిస్థితి దయనీయంగా మారింది.

**వారం రోజులుగా ఇబ్బంది పడుతున్నా**

పల్లీల విక్రయం కోసం వారం కిందట మార్కెట్‌కు వచ్చా. అప్పటి నుంచి దుకాణం వద్దే ఉంటున్నా. గతంలో ఇక్కడి రైతు విశ్రాంతి భవనం ఎంతో బాగుండేది. ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. దీంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం.

నారాయణప్ప, అనంతపురం జిల్లా శింగనమల

రూ.10 లక్షలతో ప్రతిపాదనలు

శిథిలావస్థకు చేరిన రైతు విశ్రాంతి భవనాన్ని అభివృద్ధి చేసేందుకు రూ.10 లక్షలతో ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపాం. అప్పటి వరకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే రైతులు సేదదీరేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాం. రాగిరి ఆనంద్‌బాబుగౌడ్, మార్కెట్ కమిటీ ఛైర్మన్

# కామర్స్‌కే మొగ్గు..

కరీంనగర్ : ఇంటర్ పూర్తయిన తరువాత చాలా మంది విద్యార్థులు డిగ్రీలో ఉపాధి లభించే కోర్సులను ఎంపిక చేసుకోవడానికి మొగ్గు చూపుతున్నారు. విపణిలో త్వరగా ఉపాధి లభిస్తుందని కామర్స్ కోర్సు తీసుకుంటున్నారు. శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో గల డిగ్రీ కళాశాలల్లో గత మూడేళ్లలో బీకాం కోర్సులో చేరిన విద్యార్థుల సంఖ్యే అధికంగా ఉంది. దీన్ని బట్టి ఈ కోర్సు ప్రాధాన్యాన్ని అర్థం చేసుకోవచ్చు.

**ఏ గ్రూపు వారైనా చేరవచ్చు**

శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలో బీకాంలో కంప్యూటర్ అప్లికేషన్, ఫైనాన్స్, బిజినెస్ అకౌంటెన్సీ, రిటెయిల్ ఆపరేషన్స్ కోర్సులున్నాయి. ఇవి పూర్తి చేసినవారికి విపణిలో.. ముఖ్యంగా వ్యాపార రంగంలో అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. విద్యుత్తు శాఖలో జేఏఓగా ఈ కోర్సు చదివిన విద్యార్థులే 60 శాతం మంది ఉద్యోగాలు సాధిస్తున్నారు. అలాగే కార్పొరేట్ సంస్థల్లో, టాక్స్ కన్సల్టెంట్ వద్ద అకౌంటెంట్‌గా



చేరిపోవచ్చు. ఎంకాం పూర్తి చేసిన విద్యార్థులు బోధన రంగం వైపు వెళ్లవచ్చు. ఎంబీఏ చేస్తే మరింత మెరుగైన ఉద్యోగావకాశాలను పొందడానికి అవకాశం ఉంటుంది. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, ఆర్ట్స్ గ్రూపుల్లో ఏది పూర్తి చేసిన వారైనా డిగ్రీలో బీకాంలో చేరడానికి అవకాశం ఉంటుంది. ఈ కారణాలతోనే మెజార్టీ విద్యార్థులు ఈ కోర్సులో చేరుతున్నారు.

**అకౌంటెంట్‌గా ఉద్యోగం చేస్తా..**

మాది మల్కాపూర్. అమ్మ వ్యవసాయ పనులు చేస్తుంటుంది. నాన్న గతంలోనే మరణించారు. బీకాం పూర్తి కాగానే ఏదైనా సంస్థలో అకౌంటెంట్‌గా చేరి అమ్మకు సాయపడవచ్చని ఈ కోర్సులో చేరా. చాలా మంది నా తోటి విద్యార్థులు కూడా ఇలాగే కోర్సులో చేరినట్టు చెబుతుంటారు. ప్రస్తుతం కరీంనగర్ ఎస్సారార్ కళాశాలలో బీకాం ప్రథమ సంవత్సరం చదువుతున్నా. మరో రెండేళ్లు కష్టపడి ఉద్యోగంలో చేరి కుటుంబానికి అండగా నిలబడతా.

చాట్ల సమత, బీకాం, ఎస్సారార్ డిగ్రీ కళాశాల

**దోస్త్ ప్రవేశాల్లో ప్రథమ స్థానం**

బీకాం కోర్సు వైపే విద్యార్థులు మొగ్గు చూపుతున్నారు. దోస్త్ ప్రవేశాలను పరిశీలిస్తే ప్రథమ స్థానం బీకాం కోర్సుకే దక్కుతుంది. ప్రస్తుతం ప్రతి కార్పోరేట్ సంస్థలో తప్పనిసరిగా అకౌంటెంట్ అవసరం ఉంటుంది. దీంతో బీకాం చదివిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కోర్సు పూర్తవగానే చాలా మంది ఉద్యోగాల్లో చేరిపోతుంటారు. టి.రాజయ్య, బీకాం, హెచ్‌ఓడీ, ఎస్సారార్ కళాశాల

# 'భౌ'బోయ్.. బతకలేం..!

సూర్యాపేట: క్రీడా సముదాయాలు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, బస్, రైల్వేస్టేషన్లు తదితర జనసందడి, బహిరంగ ప్రదేశాల్లో వీధి శునకాలు సంచరించకుండా చేయండి. ఆయా సంస్థల ప్రాంగణాల్లోకి అవి చొరబడకుండా కంచెలు నిర్మించాలి. క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలి. వీధి కుక్కలను తక్షణమే షెల్టర్లకు తరలించాలి..' – సుప్రీంకోర్టు ఆదేశం సూర్యాపేట 43వ వార్డు నెహ్రూనగర్‌లో ఆదివారం పిచ్చికుక్క ఐదుగురిని తీవ్రంగా గాయపరిచింది. వీటితోపాటు బాతులు, మేకలపై దాడిచేసింది. యువకుడి చేతికి, వృద్ధురాలికి తీవ్రగాయాలయ్యాయి. బాధితులు చికిత్స పొందారు. వీరి పరిస్థితిని చూసైనా అధికారులకు కనువిప్పు కలగాలి.

పిచ్చికుక్కలు కరిస్తేనే తెలుస్తుంది బాధ. వాటి దాడితో మరణించిన కుటుంబాల దయనీయ పరిస్థితి ఎవరికీ తెలియదు. కానీ అధికారులు వీటి నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇటీవల సుప్రీంకోర్టు కూడా వీధి కుక్కలు బహిరంగ ప్రదేశాల్లో ఉండకుండా చూడాలని ఆదేశాలు జారీ చేసింది. నేటికీ పురపాలికల్లో చర్యలు చేపట్టిన దాఖలాలు కనిపించడం లేదు. కనీసం ఆదేశాల మేరకు నడచుకోవాలనే ఆలోచన కూడా రావడం లేదు. దీంతో వీధుల్లో పిచ్చికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. బయటకు వెళ్లాలంటేనే అరచేతిలో ప్రాణాలు పెట్టుకుంటున్నారు. ఉదయం, సాయంత్రం పాఠశాలలకు వెళ్లిన విద్యార్థులు ఇంటికి చేరుకొనే వరకు వారి తల్లిదండ్రుల్లో ఆందోళన ఉంటుంది.

**టీకాలు శూన్యం**

వీధి శునకాలకు ఎక్కడా టీకాలు వేయడం లేదు. జూనోసిస్ డే సందర్భంగా ఒక్కరోజు మాత్రమే పదుల సంఖ్యలో వేస్తున్నారు. కానీ అధికారులు మాత్రం అన్నింటికీ టీకాలు వేసినట్లు చెబుతున్నారు. ఒక్కో వార్డులో వందల సంఖ్యలో



సంచరిస్తున్నాయి. కొన్ని పిచ్చి సోకినవీ ఉన్నాయి. వీటిని గుర్తించి చికిత్స చేయకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

కుక్కల నియంత్రణకు త్వరలో చర్యలు తీసుకుంటామని పుర కమిషనర్లు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

**సంరక్షణ కేంద్రాలేవి?** ఉమ్మడి నల్గొండ జిల్లాలో 19 పురపాలికలు ఉన్నాయి. ఒక్క సూర్యాపేట పురపాలికలో మాత్రమే కుక్కల సంరక్షణ కేంద్ర నిర్మాణం చేపట్టారు. ఇక్కడ వార్డుల్లో సంచరిస్తున్న వాటిని పట్టుకొని కు.ని. శస్త్రచికిత్సలు అడపాదడపా చేస్తున్నారు. మిగతా పురపాలికల్లో రెండేళ్ల క్రితం కోర్టు ఆదేశాల మేరకు నిర్మాణాలు చేపట్టాల్సి ఉన్నా నేటికీ ఎలాంటి అతీగతి లేదు. నియంత్రణ కేంద్రాలున్న ప్రాంతాలకు తరలించాలంటే రవాణా భారంతో పాటు ఒక్కో చికిత్సకు రూ.1650 ఖర్చవుతుంది. దీన్ని మోయలేక పురపాలికలు చేతులెత్తేశాయి.

చురకలు



# చెత్త మాది.. వస్తువు మీది..!!

ఒంగోలు : ఇంట్లో చెత్త పారవేయకండి.. ఆ చెత్తతో మీకు కావాల్సిన వస్తువులు తీసుకోండంటూ కూటమి ప్రభుత్వం పిలుపునిస్తోంది. ప్రతి ఇంటికి స్వచ్ఛ రథాలను పంపించనుంది. సిబ్బందికి చెత్త ఇస్తే బియ్యం, కొబ్బరి నూనె, సబ్బు, షాంపు, పప్పులు, గోధుమ, జొన్న, రాగి పిండి, చక్కెర, ఉప్పు బెల్లం తదితర వస్తువులు అందిస్తారు. జిల్లాలో స్వచ్ఛరథాలు విడతలుగా అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. జిల్లాలో 30 మండలాలకు 912 పంచాయతీలకు గాను మొదటి దశలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున 8 నియోజకవర్గాలకు 8 స్వచ్ఛరథాలు అందిస్తారు. రెండో విడతలో ఎనిమిది నియోజకవర్గంలో 12 స్వచ్ఛరథాలు, మూడో విడతలో అన్ని మండలాలకు స్వచ్ఛరథాలు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. పట్టణ, గ్రామాల్లో కొత్తగా స్వచ్ఛరథాలు రావడం వల్ల కాలువలు, బహిరంగ ప్రదేశాల్లో ప్లాస్టిక్, ఇతర ఘన వ్యర్థాలు తగ్గే అవకాశం ఉ



ంటుంది.స్వచ్ఛరథాలు ఒప్పందం చేసుకున్న ఆపరేటర్ చెత్తను తీసుకుని నిత్యావసరాలు ఇవ్వాల్సి ఉంటుంది.

వాహనానికి జీపీఎస్ పరికరం అమర్చకపోతే రోజుకు రూ.వెయ్యి, చెత్తను సేకరించకపోయినా తక్కువ సేకరించినా ఒక్కో తప్పునకు రూ.5వేల నుంచి రూ. 10వేలు, నెలలో ఆరు రోజులు వరుసగా నడపకపోయినా, 25 రోజులకు తక్కువగా వాహనం నడిపినా రోజుకు రూ. 2వేలు, సరిగా చెత్తను తరలించకపోతే ఒక్కో తప్పునకు రూ. 100 నుంచి రూ. 1000 జరిమానా విధిస్తారు.

స్వచ్ఛరథాల తో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో శుభ్రత నెలకొంటోందని పంచాయతీ వనరుల కేంద్రం జిల్లా సమన్వయకర్త కె. నిశ్చల తెలిపారు.

# అతివలకు శిక్షణ.. ఆర్థిక రక్షణ!

సంతనూతలపాడు: ప్రస్తుత రోజురోజుకీ పెరిగిపోతున్న ఖర్చులతో ఇల్లు గడవడం కష్టంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో పది, ఇంటర్, డిగ్రీ తదితర చదువులు చదివిన గృహిణులు, యువతులు తమ కాళ్లపై తాము నిలబడేలా స్వయం ఉపాధి కోర్సులపై మొగ్గు చూపుతున్నారు. వీరికి ఎన్ఎస్పాడు మండలంలోని ఎండ్లూరుడొంకలో గల మహిళా ప్రాంగణం వేదికగా నిలుస్తోంది. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, స్కిల్ హబ్ ఆధ్వర్యంలో మహిళలకు కంప్యూటర్‌లో ఎకౌంట్స్, టాలీ తదితర కోర్సులను నేర్పిస్తున్నారు. ఇప్పటి వరకు 13 బ్యాచ్‌ల్లో 410 మంది వరకు శిక్షణ పొందగా.. పలువురు ఉద్యోగాలు సాధించి విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం శిక్షణకు హాజరవుతున్న మహిళలు తమ అభిప్రాయాలను పంచుకున్నారిలా..

**కంప్యూటర్ కోర్సులు నేర్చుకుంటున్నా..**

నా పేరు బి.సరిత. మాది ఎండ్లూరు. డిగ్రీ పూర్తి చేసి ఇంట్లో ఖాళీగా ఉంటున్నాను. నా భర్త ప్రైవేటు జాబ్ చేస్తున్నారు. కుటుంబానికి నేను కూడా చేదోడుగా ఉండాలని భావించి శిక్షణలో చేరాను. గతంలో ఒక ఉద్యోగం కోసం ఇంటర్వ్యూకు వెళ్లాను. కంప్యూటర్ నాలెడ్జ్ ఉ



ంటే బాగుంటుందని భావించి మహిళా ప్రాంగణంలో ఉచితంగా శిక్షణ అందిస్తున్నారనే సమాచారంతో మూడు నెలల పాటు టాలీ, అడ్వాన్స్ ఎక్సెల్, ఎకౌంట్స్ విభాగంలో తరగతులకు హాజరవుతున్నా.

**బ్యూటీ పార్లర్ ఏర్పాటు చేస్తా..**

నా పేరు ఎం.డి.నేహాబేగం, మాది చీమకుర్తి. డిగ్రీ వరకు చదువుకున్నా. నాతోపాటు పాటు మరికొంత మందికి ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ తీసుకుంటున్నాను. నా భర్త ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. ప్రస్తుతం మహిళా ప్రాంగణంలో ఉచితంగా ఇస్తున్న బ్యూటీషియన్ కోర్సులో రెండు వారాల నుంచి తరగతులకు హాజరవుతున్నాను. ఇక్కడ బాగా నేర్చుకొని సొంతంగానే బ్యూటీపార్లర్ ఏర్పాటు చేస్తాను.

# వైద్యసేవలకు పరీక్షే

ఒంగోలు : జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రక్త పరీక్షలకు అవసరమైన రసాయనాలు (రీఏజెంట్స్) కొరతతో గత మూడు నెలలుగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నామమాత్రంగా జరుగుతున్నాయి. వైద్య, ఆరోగ్యశాఖ ఆదేశాల ప్రకారం 64 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాల్సి ఉండగా, సగం కూడా జరగడం లేదు. జిల్లాలో 60 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుండగా, కొన్నిచోట్ల అడపాదడపా రీఏజెంట్ కిట్లు ఉండగా, మిగతాచోట్ల పూర్తిగా అయిపోయాయి. వైద్య, ఆరోగ్యశాఖ సెంట్రల్ స్టోర్ ద్వారా కొన్ని నెలలుగా అవసరం మేరకు సరఫరా జరగడంలేదు. త్రిపురాంతకం, బేస్తవార పేట, మొక్కగుండం, తిప్పాయపాలెం, కృష్ణంశెట్టిపల్లి, జరుగుమల్లి, అమ్మనబ్రోలు పీహెచ్‌సీల్లో రసాయనాలు పూర్తిగా అయిపోయి రక్త పరీక్షలు జరగడంలేదు. గత ప్రభుత్వంలో ఎర్బా కంపెనీతో పీహెచ్‌సీలకు రక్త పరీక్షలు చేసే యంత్రాలు, రీఏజెంట్స్ సరఫరా చేసేందుకు ఒప్పందం చేసుకున్నారు. ప్రభుత్వం మారాక ఆ కంపెనీ రీఏజెంట్స్ సరఫరా సక్రమంగా చేయడంలేదు. దీంతో వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యామ్నాయంగా ఇతర కంపెనీల రీఏజెంట్స్‌ను కొనుగోలు చేసి పీహెచ్‌సీలకు సరఫరా చేస్తోంది. ఎర్బా కంపెనీ సరఫరా చేసిన యంత్రంలో వేరే కంపెనీ రీఏజెంట్లు కంప్యూటర్ ప్రోగ్రాం సపోర్టు చేయడం లేదని ల్యాబ్ టెక్నీషియన్లు చెబుతున్నారు. ఈ విషయాన్ని కంపెనీ ఇంజినీర్ దృష్టికి తీసుకురాగా తమ కంపెనీ రీఏజెంట్లు వాడితేనే సపోర్టు చేస్తుందని చెబుతున్నారు. ప్రస్తుతం ప్రత్యామ్నాయంగా ఇచ్చిన ఇతర కంపెనీల కిట్లు కూడా అందుబాటులో లేక సిబ్బంది చేతులెత్తేస్తున్నారు. ఈ విషయమై డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇండెంట్ పెట్టిన వారందరికీ రీఏజెంట్స్ సరఫరా చేస్తున్నామన్నారు. పీహెచ్‌సీలకు మళ్లీ మిషన్లు ఇచ్చారని, ఏ రీఏజెంట్ కిట్ అయినా వినియోగించవచ్చన్నారు.

# పడితే కన్ను..మాయమే మన్ను!



మార్కాపురం: పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురంలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. మన్ను కోసం అక్రమార్కులు బరితెగిస్తున్నారు. నిన్నటి మొన్నటి వరకు ఆయకట్టు చెరువులను కొల్లగొట్టి మట్టిని దోచుకున్న అక్రమార్కులు దేవాదాయ, అసైన్‌మెంట్ భూములు, కొండలను కొల్లగొడుతున్నారు. పొలాల సమీపంలో ఇష్టానుసారంగా తవ్వకాలు చేపడుతుండడంతో రాకపోకలకు దారే లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. మట్టి తవ్వకాలతో పడిన భారీ గుంతల్లో చేరిన తమ పొలాలన ముంచెత్తుతున్నాయని కన్నీటి పర్యంతమవుతున్నారు. మట్టి తరలించేవారిని ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

**దేవాదాయ భూముల్లోనూ...**

మార్కాపురం మండలం గోగులదిన్నె పరిధిలోని సుంకేసుల వెలుగొండ నిర్వాసితుల కాలనీ సమీపంలో మార్కండేశ్వరస్వామి ఆలయానికి నాలుగెకరాలుండగా, దీని పక్కనే అసైన్‌మెంట్ భూమి మరో 2.50 ఎకరాలుంది. ఇక్కడ అక్రమార్కులు భారీగా మట్టి అక్రమ తవ్వకాలు సాగిస్తున్నారు. తవ్వకాలతో తమ పొలాలకు వెళ్లడానికి దారి లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెన్నరాయునిపల్లె-కేతగుడిపి రహదారి పక్కన 15 అడుగుల మేర మట్టి తవ్వకాలు చేపట్టినట్లు ఆందోళన చెందుతున్నారు.

**కరిగిపోతున్న కొండలు**

మట్టి తవ్వకాలతో మార్కాపురంలో కొండలు, గుట్టలు తరిగిపోతున్నాయి. మార్కాపురం మండలం కోలభీమునిపాడు గ్రామసమీపంలోని ముద్ద సానమ్మ గండి వద్ద ఉన్న కొండను ఇప్పటికే కొల్లగొట్టారు. పగలు రాత్రి అనే తేడా లేకుండా తవ్వకాలు జరుపుతున్నారు. ఇదే మండలం చింతకుంట నుంచి ఎల్‌బీఎస్ నగర్‌కు వెళ్లే రహదారిలోని కొండ వద్ద తవ్వకాలతో 320కేవీ విద్యుత్తు లైన్ ప్రమాదంలో పడింది. దరిమడుగు గ్రామసమీపంలోని నిర్వాసితుల కాలనీ వద్ద ఉన్న కొండను సైతం ఇష్టానుసారంగా తవ్వేశారు. దీనికి పక్కనే ఉన్న మాబుసాహెబ్ కుంటను సైతం చెరబట్టారు. మట్టి అక్రమ తవ్వకాల ద్వారా రోజుకు రూ. 3 నుంచి రూ. 4 లక్షల వరకు సంపాదిస్తున్నారు. టిప్పరుకు రూ. 4 వేల నుంచి రూ. 4,200 వరకు వసూలు చేస్తున్నారు.

మా పొలాలకు దారి లేకుండాపోయింది : గోగులదిన్నె గ్రామపరిధిలోని వెలుగొండ నిర్వాసితుల కాలనీ సమీపంలో అక్రమార్కులు ఇష్టానుసారంగా మట్టి తవ్వకాలు చేస్తున్నారు. మా పొలాల పక్కనే తవ్వకాలు చేపడుతుండడంతో దారి కూడా లేకుండాపోయింది. మట్టి తవ్వకాలతో పడిన గుంతల్లో చేరిన నీరు మా పొలాలను ముంచెత్తుతోంది. అధికారులు స్పందించి మట్టి అక్రమ తవ్వకాలు నిలుపుదల చేయాలి.
బత్తుల రమణారెడ్డి, రైతు

# తటాకాలకు పెద్దపీట

ఒంగోలు : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉపాధిహామీ పథకం నిధులతో ఇప్పటికే పల్లెల్లో సీసీ, బీటీ, మట్టి రహదారులు, మురుగు కాలువల నిర్మాణ పనులు చేపట్టింది. తాజాగా గ్రామాల్లోని చెరువుల అభివృద్ధిపై దృష్టి సారించింది. ఇందుకు వాటర్‌షెడ్ పథకం కింద నిధులు కేటాయించనుంది. ఇందులో భాగంగా జిల్లాలో ఎంపిక చేసిన అయిదు చెరువుల అభివృద్ధితోపాటు పార్కు, ఓపెన్ జిమ్, మొక్కల పెంపకం తదితర పనులతో సుందరంగా తీర్చిదిద్దనుంది. మిగతా చెరువులకు ప్రాధాన్యం ఇవ్వనుంది.

**ఒక్కోదానికి రూ. 50 లక్షలు**

సంప్రదాయ చెరువుల అభివృద్ధిలో భాగంగా 5 వేల జనాభా పైబడి, కనీసం పదెకరాల విస్తీర్ణం పైబడిన వాటిని గుర్తించారు. ఇందులో భాగంగా టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెం, కొత్తపట్నం, పామూరు, కొమరోలు, తర్లుపాడు పంచాయతీలను ఎంపిక చేశారు. టి.నాయుడుపాలెం మినహా, మిగతా వాటి ఎంపికకు సంబంధించి మండల కేంద్రాల్లో ప్రాధాన్యమిచ్చారు. వాకింగ్ ట్రాక్ ఏర్పాటుతోపాటు



చెరువు పక్కనే పార్కు ఉండేవిధంగా ప్రణాళిక చేయనున్నారు. ప్రత్యేకంగా ఆహ్లాదకరంగా ఉండేలా మొక్కలు నాటడంతోపాటు సిమెంటు బల్లలు తదితర వసతులు కల్పించనున్నారు. పార్కు ఏర్పాటు ద్వారా గ్రామానికి కొత్త అందాలు రానున్నాయి. ఒక్కో చెరువును సుమారు రూ. 50 లక్షలతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దనున్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో చేపట్టనున్న పనులకు జిల్లా నీటియాజమాన్య సంస్థ అధికారులు అంచనాలు తయారు చేశారు. దీని కోసం డ్వామా మండల, జిల్లా అధికారులు ముందుగా స్థానిక ప్రజాప్రతినిధులతో సంప్రదించి వారి సలహాలు తీసుకున్నారు. అనంతరం నిర్మాణ పనులను జిల్లా పంచాయతీరాజ్‌శాఖకు అప్పగించనున్నారు. ఈ మేరకు త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు డ్వామా పీడీ జోషఫ్‌కుమార్ తెలిపారు.

# పురపాలికను పంచుకున్నారు!



అమలాపురం : గత ప్రభుత్వంలో వైకాపా నేతలు అమలాపురం పురపాలక సంఘంలో ఇష్టారీతిన వ్యవహారాలు సాగించారు. ఖజానాలో ఉన్న అరకొర నిధులను ఖాళీచేయించేశారు. తమ అనుచరులకు ఇంటి, నీటి పన్నుల నుంచి మినహాయింపు ఇప్పించారు. వారికి వాణిజ్య దుకాణాలను కట్టబెట్టి అద్దె, లీజు సొమ్ములకు గండి గొట్టారు. ఇవన్నీ ఇప్పుడు వెలుగులోకి వస్తున్నాయి.

**నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టి..**

పురపాలికలో సాధారణ, 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టే పనుల్లో నిబంధనలు పాటించలేదు. కొన్నింటికి సింగిల్ టెండర్లకు అనుమతులిచ్చేశారు. మరికొన్నింటిని అనుయాయులకు నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టేశారు. వాస్తవానికి రూ. 10 వేలు మించిన పనికి టెండర్ పిలవాలి. కౌన్సిల్‌లో అత్యవసరమంటూ ప్రతిపాదన పెట్టడం, పనులు జరిగిన మూడు నాలుగు నెలలకు గాని ఎం.బుక్‌లో నమోదు చేయకపోవడం గమనార్హం.

**నిధులు మళ్లించేసి..**

పన్నుల రూపంలో చెల్లించిన సొమ్మును ప్రజా సమస్యల పరిష్కారానికే వినియోగించాలి. 2023-24లో పురపాలక నిధుల నుంచి నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ పథకాల పేరిట వైకాపా ప్రచారానికి రూ. 25.27 లక్షలు మళ్లించేశారు. కూటమి సర్కారు వచ్చాక పాత బకాయిలపై దృష్టిసారించి నోటీసులు జారీచేస్తున్నారు. బీపీఎస్, ఎల్‌ఆర్‌ఎస్ పథకాలతో అక్రమాలను సక్రమం చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఇటీవల అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు కొందరు ముందుకు వచ్చారు.

**ఆదాయానికి ఎసరు..**

అమలాపురం మున్సిపల్ వాణిజ్య సముదాయంలో సగం దుకాణాలు వైకాపా నేతల అనుచరులకే ఇచ్చి లీజు, అద్దె సక్రమంగా వసూలు చేయలేదు.

**షాపింగ్ కాంప్లెక్స్ నుంచి రూ. 24.92 లక్షల అద్దె రావాలి.**

హెూటళ్లు, వాణిజ్య అవసరాలకు తాగునీరు సరఫరా చేశారు. నీటి పన్ను బకాయి రూ. 1.88 కోట్లు ఉంది. 1 నుంచి 14 వార్డుల్లో 2,106 ఖాళీ స్థలాలున్నాయి. వీఎల్‌టీ రూపేణా రూ. 3.10 కోట్లు రావాల్సి ఉన్నా నేతల ఒత్తిళ్లతో రాలేదు. %-%27 అనధికార లేఅవుట్ల నుంచి ఓపెన్ స్పేస్, పది శాతం భాగస్వామ్య ఛార్జీలు రూ. 9.52 కోట్లు రావాలి. వాటిలో ఎక్కువ వైకాపా నేతలవే.

# ఊరన్నారు.. నూరన్నారు

కొయ్యలగూడెం : ఇళ్లపై సోలార్ యూనిట్ల ఏర్పాటుకు భారీగా రాయితీ అవకాశం కల్పిస్తున్నా సూర్యఘర్ పథకం అమలు తీరు నత్తనడకను సాగుతోంది. జిల్లాలో ఐదు ఆదర్శ గ్రామాలను ఎంపిక చేసి నూరు శాతం యూనిట్లు ఏర్పాటు లక్ష్యంతో.. రూ.కోటి నజరానా కూడా ప్రకటించిన విషయం విదితమే. అంతాబాగానే ఉన్నా..పథకం అమలులో అంతులేని జాప్యం వినియోగదారులు ముందడుగు వేయడానికి వెనకాడాల్సి వస్తోంది.

శతశాతం ఇళ్లపై సౌర వెలుగులు చిందించి మిగిలిన గ్రామాలకు ఆదర్శంగా నిలవాలని ఐదు గ్రామాలను ఎంపిక చేశారు. సోలార్ యూనిట్ల ఏర్పాటుకు ఇంటికి రూ. 78 వేలు వరకు రాయితీ ఇస్తుంది. అదే ఎస్సీ, ఎస్టీలకు పూర్తిగా ఉచితమే. బీసీలకు రూ. 50 వేల వరకు అదనంగా రాయితీ కల్పిస్తున్నారు. నివాస గృహాలపైనే కాకుండా వాణిజ్య అవసరాలకు కూడా సౌర పలకల ఏర్పాటుకు ఈ రాయితీ వర్తిస్తుంది. ద్వారకాతిరుమలలో వాణిజ్య అవసరాలకు తొమ్మిది మంది, దుగ్గిరాల, చిననింద్రకొలనులో ఒకరుచొప్పున, కామవరపుకోటలో



ఆరుగురు దరఖాస్తు చేసుకోగా సోలార్ యూనిట్లు బిగించారు.

**మార్చిలోగా గడువు**

ఆదర్శ గ్రామాల్లో సోలార్ యూనిట్లు ఏర్పాటుకు వచ్చే మార్చి గడువు. అయితే ఇప్పటికి 10 శాతం కూడా స్థాపించలేదు. కనీసం దరఖాస్తులు కూడా రాలేదు. ఇందుకు కారణం ప్రజలకు పూర్తి స్థాయిలో ఈ పథకంపై అవగాహన లేకపోవడమే. బ్యాంకులు కూడా సోలార్ పలకల ఏర్పాటుకు దరఖాస్తుదారులకు రుణాలు మంజూరు వేగవంతం చేయాల్సి ఉంది. 'యూనిట్ల స్థాపనకు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. మార్చిలోగా లక్ష్యాన్ని చేరుకునేలా కృషి చేస్తున్నాం. బ్యాంకుల వద్ద జాప్యం నివరణకు మాట్లాడుతున్నాం' అని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ సాల్మన్‌రాజు తెలిపారు.

# ఆస్తిపై హక్కు.. మీకే దక్కు



కాకినాడ : గ్రామ కంఠాల్లో నివసిస్తున్న ప్రజలకు.. ఆస్తిపై హక్కు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'స్వామిత్వ' సర్వేను నిర్వహిస్తోంది. మొదటి విడత సర్వే పూర్తి కాగా, ప్రస్తుతం రెండో విడత శరవేగంగా జరుగుతోంది. చాలామంది ప్రజలు గ్రామ కంఠాల్లో నివసిస్తున్నారు. ముత్తాతలు, తాతలు, తండ్రుల నుంచి సంక్రమించిన ఈ స్థలాల్లోనే వారు ఇళ్లు కట్టుకున్నారు. దశాబ్దాలుగా వారు అక్కడ ఉంటున్నా, వాటికి సంబంధించి ఎటువంటి హక్కు పత్రాలు లేవు. బ్యాంకులు నుంచి గాని, ఇతర సంస్థల నుంచి రుణాలు తీసుకునేందుకు అవకాశముండదు. ఇటువంటి వాటిపై 'స్వామిత్వ' సర్వే ద్వారా స్థల యజమానులకు హక్కు కల్పించనున్నారు.

**అయిదుగురి సభ్యులతో సర్వే**

ప్రతి గ్రామంలో అయిదుగురు సభ్యుల బృందం సర్వే చేస్తోంది. గ్రామ పరిధిలో పంచాయతీ కార్యదర్శి, ఇంజినీరింగ్ అసిస్టెంట్, సర్వేయర్, డిజిటల్ అసిస్టెంట్, వీఆర్వో ఈ బృందంలో ఉంటారు. వీరు గ్రామంలో పర్యటించి భూముల లెక్క తేలుస్తారు.

**డ్రోన్లతో పరిశీలన**

గతంలో డ్రోన్ల ద్వారా సర్వే చేసి మ్యాప్‌లు సిద్ధం చేశారు. వీటి ఆధారంగా క్షేత్రస్థాయిలో నివాసాల కొలతలు సరిచూస్తున్నారు. గ్రామ కంఠంలో ఉన్న ప్రతి స్థలాన్ని స్వామిత్వలో నమోదు చేస్తారు. రెవెన్యూ గ్రామాల వారీగా నివాసాలు, జిరాయితీ, శ్మశానవాటికలు, ఇతర ప్రభుత్వ భూములన్నింటినీ సర్వే చేస్తారు. నివాస స్థలాల హక్కుదార్లకు యాజమాన్య కార్డులు జారీ చేస్తారు. జిరాయితీ భూముల్లోనూ పదికి మించి నివాసాలున్న వాటిని పరిగణనలోకి తీసుకుంటున్నారు.

**మార్చికి ప్రక్రియ పూర్తి**

స్వామిత్వ సర్వే ద్వారా గ్రామ కంఠ భూములు, ఆస్తులకు హక్కు కల్పించడం పేద ప్రజలకు మంచి అవకాశం. ఇకపై వారి ఆస్తులపై భరోసా కలుగుతుంది. వచ్చే మార్చి నాటికి మొత్తం సర్వే ప్రక్రియను పూర్తి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. - రవికుమార్, డీపీవో, కాకినాడ

# బిల్లు కావాలా..రూ.1000 ఇచ్చుకోండి..!

నిడదవోలు : ఉచిత ఇసుక మాటున.. లోడింగ్ ఛార్జీల పేరిట రేవుల్లో ఇష్టారాజ్యంగా దోచేస్తున్నారు. బిల్లు ఇస్తే ఒక ధర.. లేకపోతే మరో ధరకు ఇసుక లోడింగ్ చేస్తున్నారు. ర్యాంపుల నుంచి రహదారులపైకి ఇసుక లోడుతో వస్తున్న లారీలపై కేసులు నమోదు చేసి భారీగా జరిమానాలు విధిస్తున్నారు. దీనిపై ఆగ్రహించిన లారీ యజమానులు రెండు రోజులుగా నిరసన చేపట్టి ఇసుక కోసం ర్యాంపులకు వెళ్లడం మానేశారు. దీంతో తవ్వకాలు నిలిచిపోయాయి.

చెల్లించాల్సింది రూ. 1900... వసూలు రూ. 5,500..

పెండ్యాల-కానూరు ఇసుక ర్యాంపులో ఆరు యూనిట్ల లారీకి టన్నుకు రూ. 95 చొప్పున లోడింగ్ ఛార్జీలు రూ. 1900 తీసుకోవాలి. బిల్లు కావాలంటే లోడింగ్ ఛార్జీ రూ. 5,500, బిల్లు లేకుండా అయితే రూ. 4,500 వసూలు చేస్తూ ర్యాంపుల నిర్వాహకులు దోపిడీకి పాల్పడుతున్నారు.

**ఆర్డీవోకు ఫిర్యాదు..**

ఇసుక ర్యాంపుల వద్ద జరుగుతున్న అక్రమాలు, అనధికారిక వసూళ్లను నిలుపుదల చేసి లారీలపై జరిమానాలు విధించకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ సీతంపేట, విజ్జేశ్వరం గట్టు సత్తెమ్మ లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు కొవ్వూరు రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆర్డీవో రాణి సుస్మితకు వినతిపత్రాన్ని అందించారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఉచిత ఇసుక విధానంలో బిల్లు రాస్తే ప్రభుత్వానికి టన్నుకు రూ. 23 వెళుతోందన్నారు. బిల్లు లేకుండా ఇసుక తరలిస్తున్న లారీలకు రూ. 25 వేల వరకు అపరాధ రుసుము విధిస్తున్నారని వాపోయారు. ప్రతి లారీకి కనీసం రోజుకు ఆన్‌లైన్‌లో గాని, ఆఫ్‌లైన్‌లో గాని రెండు ట్రిప్పులు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

చురకలు



# సైకిల్‌పై చలో.. చలో..!

నర్సీపట్నం : విశాఖలో కాలుష్య కారకాలు పెరిగి, ప్రజలు శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారని నివేదికలు అందడంతో.. పర్యావరణహిత రవాణాను ప్రోత్సహించేందుకు అధికారులు నిర్ణయించారు. ప్రజల ఆరోగ్యంతో పాటు, కాలుష్య తీవ్రతను తగ్గించేందుకు వీలుగా సైక్లింగ్ ప్రాజెక్టును వినియోగంలోకి తీసుకురానున్నారు.

**సరైన నిర్వహణతోనే..**

గతంలో జీవీఎంసీ అధికారులు ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినులతో ప్రతి వీఎంఆర్‌డీఏ సెంట్రల్ పార్కు చుట్టూ ఉన్న సర్వీసు రహదారిలో 1.25 కిలోమీటర్ల మేర సైక్లింగ్ చేయించేవారు. స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా ప్రతి ఆదివారం నగరవాసులు ఆర్కేబీచ్ నుంచి పార్క్ హోటల్ వరకు 2.5 కిలోమీటర్లు సైక్లింగ్ చేసుకోవడానికి



ఏర్పాట్లు చేశారు. ఆ తర్వాత సరైన నిర్వహణ లేకపోవడంతో...అవి ముందుకు సాగలేదు.

ఇప్పుడు కొత్తగా ప్రతిపాదించే ప్రాజెక్టుకు మెరుగైన నిర్వహణ ఉంటేనే.. ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.ఎక్కడెక్కడ..: నగరంలో బీచ్‌రోడ్డులోని రాడిసన్ బ్లూ హోటల్ నుంచి సాగర్‌నగర్ వరకు దాదాపుగా 1.9 కిలోమీటర్ల మేర సైక్లింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడానికి జీవీఎంసీ ప్రతిపాదించింది. అలాగే ముడసర్లోవ బీఆర్టీఎస్ రహదారి చుట్టు పక్కల 5 కిలోమీటర్లలో సైక్లింగ్ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

# రేషన్ కార్డుదారులకు కొత్త కానుక

అనంతపురం : కూటమి ప్రభుత్వం కొత్త ఏడాది నుంచి ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంపై దృష్టి సారించింది. జనవరి నుంచి కార్డుదారులకు అదనంగా సరకులు పంపిణీ చేయనుంది. అందుకు సంబంధించి అనంత జిల్లాకు కేటాయింపులు చేశారు. సరకులను ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి చౌక దుకాణాలకు రవాణా చేస్తున్నారు. బియ్యం, చక్కెరతో పాటు రాగులు, జొన్నలు, గోధుమపిండిని లబ్ధిదారులకు ఇవ్వనున్నారు. ఒకటో తేదీ నుంచి అందజేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

జిల్లాకు బియ్యం 9,783 టన్నులు, చక్కెర 334 టన్నులు, రాగులు 634 టన్నులు, జొన్నలు 559 టన్నులు వచ్చాయి. వాటితో పాటు గోధుమపిండి 43.57 టన్నులు వచ్చింది. ఒక కుటుంబం 25 కిలోల చొప్పున బియ్యం తీసుకుంటే అందులో మూడు కిలోలు చొప్పున బియ్యం తగ్గించి.. రాగులు లేదంట జొన్నలు కాని తీసుకోవచ్చు.

**గోధుమపిండి కిలో రూ.20**




బహిరంగ మార్కెట్‌లో గోధుమపిండి కిలో రూ.60 నుంచి 65 వరకు విక్రయిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చౌకదుకాణాల్లో కిలో రూ.20కే ప్యాకెట్ రూపంలో అందించనుంది. కాగా తొలుత అనంత నగరంలో మాత్రమే గోధుమపిండి అందుబాటులో ఉంటుంది. జనవరి 2న జిల్లా కేంద్రంలో అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో గోధమపిండి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ రమేశ్‌రెడ్డి పేర్కొన్నారు.

అనంత జిల్లాలో..

చౌక దుకాణాలు: 1,645

కార్డులు: 6,74,120

# మల్లప్ప నిబద్ధత.. ఆంగ్లేయుల కృతజ్ఞత

గుంతకల్లు: విధుల్లో చేరినప్పటి నుంచి విరమణ వరకు ఒక్కరోజు కూడా సెలవు పెట్టకుండా చేయడం ఎవరికైనా సాధ్యమయ్యే పనేనా? కానీ సుసాధ్యమని నిరుపించారు మల్లప్ప. ఇది 208 ఏళ్ల కిందటి మాట. ఆంగ్లేయుల కాలంలో.. 1887 సంవత్సరంలో గుంతకల్లుకు 6 కి.మీ దూరంలో ఉన్న నంచర్ల రైల్వేగేట్ వద్ద పని చేయడానికి మల్లప్ప గేట్‌మెన్‌గా నియమితులయ్యారు. 1921 వరకు పని చేశారు. అదీ ఒక్కరోజు కూడా సెలవుపెట్టకుండా.. ఆయన సేవలను



గుర్తించి ఆంగ్లేయులు ఘనంగా సత్కరించారు. నీవేదైనా కోరుకుంటే దాన్ని నెరవేరుస్తామని పదవీ విరమణ రోజు అతన్ని అడగ్గా.. నంచర్లలో రైల్వేస్టేషన్ నిర్మించి.. రైలు ఆగేలా చూడాలని కోరారు. ఆ విన్నపం మేరకు స్టేషన్‌ను నిర్మించి దానికి ఆయన పేరే పెట్టారు. అంతేకాదు ఆయన మరణానంతరం సమాధి కట్టించి కృతజ్ఞతను చాటుకున్నారు ఆంగ్లేయులు. మల్లప్ప దయ వల్లే తమకు రైళ్లలో ప్రయాణించే భాగ్యం దక్కిందని ఇప్పటికీ ఆ గ్రామస్థులు తలుచుకుంటున్నారు.

# హాస్టళ్లు బాగానే ఉన్నాయా?



నర్సీపట్నం : హాస్టళ్ల పనితీరుపై ఆరా ప్రారంభమైంది. వీటిలోని సదుపాయాలు, వార్డెన్ల విధుల తీరు తదితర వాటిపై పరిశీలన కొనసాగుతోంది. ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం (ఐవీఆర్‌ఎస్) ద్వారా ఈ గృహాల విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నారు. వీటి ఆధారంగా సేవలు సంతృప్తికరంగా లేని చోట అవి మెరుగుపడేలా చూడటంతోపాటు అధికారులు మరింత బాధ్యతగా పనిచేసేలా చర్యలు తీసుకోనున్నారు. ఈ విధానంతో వార్డెన్లు ఇప్పుడు మరింత జాగ్రత్తలతో అన్నీ సరిచూస్తున్నారు.

గతంలో వసతి గృహాల నిర్వహణ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. దీంతో ఇవి అవకతవకలకు నిలయాలుగా మారాయి. శిథిల భవనాలు, సదుపాయాల లోపంతో విద్యార్థులు అవస్థలు పడ్డారు. కూటమి సర్కారు వీటి ప్రక్షాళనకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఇప్పటికే అభివృద్ధి దిశగా మార్పులు చోటు చేసుకున్నాయి. ఇవి ఇప్పుడు పక్కాగా అమలవుతోంది లేనిది నిగ్గు తేల్చేందుకు ఐవీఆర్‌ఎస్‌ను వినియోగిస్తున్నారు. దీని పుణ్యమా అంటూ హాస్టళ్లో అన్నీ పక్కాగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఐవీఆర్‌ఎస్‌లో తమకు వ్యతిరేకంగా సమాచారం వెళ్లే పరిస్థితి రాకుండా ముందస్తుగా అప్రమత్తం అవుతున్నారు. జిల్లాలో 65 శాతం నిర్వహణ మెరుగ్గా ఉన్నట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కొందరు వార్డెనులు గృహాల్లో అన్నీ పక్కాగా చూసుకుంటూ విద్యార్థుల తల్లిదండ్రులతోనూ ఎంతో మర్యాద పూర్వకంగా వ్యవహరిస్తున్నారు. నర్సీపట్నంలోని ఒక వార్డెను తన హాస్టల్ పరిధిలోని విద్యార్థుల తల్లిదండ్రులతో వాట్సాప్‌లో ప్రత్యేక గ్రూపు ఏర్పాటు చేసుకుని అన్ని కార్యకలాపాలను ఎప్పటికప్పుడు ఫొటోలు తీసి వారికి పంపుతున్నారు. హాస్టల్‌లోని సేవలు మరింత మెరుగుపడడానికి ఈ విధానం ఎంతగానో దోహదపడుతుందని జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి రామానందం తెలిపారు.

జిల్లాలోని మొత్తం 135 సంక్షేమ వసతి గృహాల్లోని వేలాది మంది విద్యార్థులకు ఈ విధానం వల్ల ప్రయోజనం చేకూరనుంది. ప్రస్తుతం అమలవుతున్న... ఫీడింగ్ శాతాన్ని ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. ఏ జిల్లా ఏ స్థానంలో ఉన్నది గమనిస్తున్నారు. ఇందులో హాస్టళ్లలో మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా, స్వచ్ఛమైన తాగు నీరు సమకూర్చారా.. భవనాల పరిస్థితి ఎలా ఉంది. వార్డెన్ సక్రమంగా విధులు నిర్వహిసున్నారా, పారిశుద్ధ్యం ఎలా ఉంది వంటి ప్రశ్నలకు తల్లిదండ్రుల నుంచి సమాధానాలు తెలుసుకుంటున్నారు.

# టిఫా.. సొమ్ములు సఫా



ఆదోని : ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో టిఫా స్కానింగ్ సేవలు అందుబాటులో లేక గర్భిణులు ఇబ్బంది పడుతున్నారు. గర్భంలో బిడ్డ ఎదుగుదల.. అవయవాల పనితీరు తెలుసుకొనేందుకు టిఫా (టార్గెటెడ్ ఇమేజింగ్ ఫర్ ఫీటల్ అనామలైస్) స్కానింగ్ కీలకం. టిఫా స్కానింగ్‌తో బిడ్డ అవయవాల కదలికలు, ఎదుగుదల తెలుసుకోవచ్చు. జిల్లా కేంద్రం తప్ప.. మిగిలిన చోట్ల వీటి సేవలు అందుబాటులో లేవు. ఇదే అదనుగా ప్రైవేటు స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు దోచుకొంటున్నారు.

**నిత్యం రూ.6 లక్షల వ్యాపారం**

కర్నూలులో వంద, నంద్యాలలో 20, ఆదోనిలో మూడు స్కానింగ్ కేంద్రాలున్నాయి. ఒక్కో స్కానింగ్ పరీక్ష ధర రూ.1500- రూ.2 వేలు ఉంది. కర్నూలులో 20-25 మంది, నంద్యాల 15-20, ఆదోనిలో 10-15 మంది రోజూ స్కానింగ్ సేవల నిమిత్తం వెళుంటారు. ఈ లెక్కన సుమారు 300 మందికి రోజుకు రూ.6 లక్షల చొప్పున నెలలో 25 రోజులకు రూ.1.50 కోట్లు, ఏడాదికి లెక్కిస్తే రూ.18 కోట్లు జనం స్కానింగ్ సేవల కోసం ఖర్చు చేస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్నా.. ప్రభుత్వం మాత్రం సేవలు విస్తరించడం లేదు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోని యంత్రాలతో టిఫా స్కానింగ్ పరీక్షలు చేసే వీలుంది. సరైన నిపుణులు లేకపోవడంతో ఈ సేవలు అందుబాటులోకి రావడం లేదు. కర్నూలు, నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రుల్లో తప్ప మరెక్కడా రేడియాలజిస్టులు లేరు.

నంద్యాల ఆస్పత్రిలో ఒక్కటే స్కానింగ్ యంత్రం అందుబాటులో ఉంది. ఆదోని, ఎమ్మిగనూరు, డోన్, బనగానపల్లి, కోవెలకుంట్ల వంటి పెద్ద పట్టణాల్లో ఈ సేవల ఆచూకే లేదు.

మిగిలిన ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులున్నా.. వారికి స్కానింగ్ మెలకువలు తెలుసుకోవడంలో సరైన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం లేదు. కొందరిని ఎంపిక చేసి, వారికి శిక్షణ ఇస్తే.. అన్ని రకాల పరీక్షలు స్థానిక పట్టణాలు, మండల కేంద్రాల్లోనే అందించవచ్చనే అభిప్రాయాలు వెల్లడవుతున్నాయి.

**ఏటా 65 వేల ప్రసవాలు**

ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో కలిపి ఏటా 60-65 వేల ప్రసవాలు జరుగుతున్నాయి. ప్రతి నెలా సీహెచ్‌సీలలో సాధారణ స్కానింగ్ సేవలు అందిస్తున్నారు. స్థానికంగా టిఫా సేవలు అందుబాటులో లేకపోవడం, కర్నూలు, నంద్యాల కేంద్రాలు దూరాభారం కావడం, అందులోనూ గర్భిణులు ప్రయాణ సమయంలో ఏదైనా ఇబ్బందికర పరిస్థితులు తలెత్తే ప్రమాదం ఉంటుందనే ఉద్దేశంతో స్థానికంగానే ప్రైవేటు స్కానింగ్ కేంద్రాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఒక్కో పరీక్షకు సుమారు 15-25 నిమిషాల సమయం పడుతుంది.

ప్రతి నెలా సాధారణ వైద్య పరీక్షల కోసం ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తారు. ఇక్కడే వైద్యులు టిఫా స్కానింగ్ సేవల కోసం ఫలనా కేంద్రాలకు వెళ్లాలని సూచిస్తున్నారు. ఇలా సూచించినందుకు కమీషన్లు, నజరానాలు పొందుతున్నారు. దీంతో జనమంతా ప్రైవేటు బాట పట్టాల్సి వస్తోంది.

# ఖనిజ నేలల్ని 'గుట్ట'గా రాసిచ్చేశారు

నంద్యాల : బేతంచెర్ల మండలంలో గత వైకాపా సర్కారు హయాంలో ప్రభుత్వ భూముల ఆక్రమణ అడ్డూఅదుపు లేకుండా కొనసాగింది. ఎర్రమల కొండలను ఇష్టానుసారం పంచేసుకున్నారు. అసైన్‌మెంట్ కమిటీలు ఏర్పడకుండానే వందల ఎకరాల భూములను తమ వర్గీయులకు కట్టబెట్టారు. ఎన్నికల్లో లబ్ధి పొందడమే లక్ష్యంగా 2022 నుంచి 2024 ఫిబ్రవరి వరకు అడ్డగోలుగా డీకేటీ పట్టాలు పంపిణీ చేశారు. సేద్యానికి పనికిరాని కొండలు, గుట్టల్లోనూ పట్టాలు ఇచ్చారు. గత ప్రభుత్వంలో 'రాజా'గా పేరుగాంచిన అప్పటి ప్రజాప్రతినిధి సొంత మండలంలోనే కొనసాగిన ఈ భూ పందేరం ఆయన ఆదేశాలతోనే జరిగిందన్న ఆరోపణలు ఉన్నాయి.

అసైన్‌మెంట్ కమిటీ లేకుండానే భూములను పంపిణీ చేయడానికి అసైన్‌మెంట్ కమిటీ ఏర్పాటు తప్పనిసరి. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రితో పాటు స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ ఇందులో సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ సిఫార్సు చేసిన వారికే భూములను పంపిణీ చేయాలి.

బేతంచెర్ల మండలంలో పంపిణీ చేసిన 832.24 ఎకరాలకు సంబంధించి అసైన్‌మెంట్ కమిటీ సిఫార్సు చేయలేదు. అసలు ఇక్కడ అసైన్‌మెంట్ కమిటీనే ఏర్పాటు కాలేదు. ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందనగా.. 10 గ్రామాల పరిధిలో 502 మందికి 832.24 ఎకరాల భూమిని హడావుడిగా పంపిణీ చేశారు. అప్పటి డిప్యూటీ తహసీల్దారు (తహసీల్దారు ఎఫ్ఏసీ) పి.సత్యదీప్ అసైన్‌మెంట్ పట్టాలను పంపిణీ చేశారు. అసైన్‌మెంట్ కమిటీ సిఫార్సు లేకుండా పెండేకల్లు, గొర్లగుట్ల, యంబాయి, ఆర్ఎస్ రంగాపురం తదితర గ్రామాల్లో పంపిణీ చేశారు. లబ్ధిదారుల పేర్లను ఆన్‌లైన్‌లో ఎక్కించారు. ఈ విషయం రెవెన్యూ శాఖలో సంచలనంగా మారింది. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో స్పందించిన అధికారులు సత్యదీప్‌తో పాటు బేతంచెర్ల తహసీల్దారు, డోన్, ఆత్మకూరు ఆర్డీవోలకు కూడా తాఖీదులు



జారీ చేశారు. దీనిపై సత్యదీప్ ఇటీవలే నంద్యాల కలెక్టరేట్‌కు వచ్చి వివరణ ఇచ్చారు.

**వైకాపా నేతల ముందస్తు వ్యూహం**


గత వైకాపా ప్రభుత్వంలో డోన్ నియోజకవర్గంలోని ఒక్క బేతంచెర్ల మండలంలోనే 3,766 మంది లబ్ధిదారులకు 7687.21 ఎకరాలు పంపిణీ చేశారు. ఇందులో వ్యవసాయ యోగ్యం కాని భూమినే ఎక్కువగా ఇచ్చారు. ఎన్నికల్లో లబ్ధి పొందే ఉద్దేశంతోనే ఇలా చేశారన్న విమర్శలున్నాయి. లబ్ధిదారుల్లో నిరుపేదల కన్నా వైకాపా సానుభూతి పరులు, కార్యకర్తలు.. ఒకవర్గం నాయకులు సూచించిన వారే ఎక్కువగా ఉన్నారు. గూటుపల్లె, ముద్దవరం, బుగ్గానపల్లె, పెండేకల్లు గ్రామాల్లో వైకాపా సానుభూతిపరులకు పంపిణీ చేసిన భూమి సాగు యోగ్యమైంది కాదు. దీనికి సమీపంలోనే ఇనుప ఖనిజం తవ్వకాలు సాగుతుండటంతో వ్యూహం ప్రకారమే ఈ భూములను తమవారికి పంపిణీ చేశారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు పెండెకల్లు, రంగాపురం తదితర గ్రామాల్లో సౌర విద్యుత్తు ప్లాంట్లు ఏర్పాటయ్యాయి. వాటి సమీపంలోనే పట్టాలు ఇవ్వడం గమనార్హం.

# పురోగమన సూత్ర.. పురమిత్ర

అనంతపురం : చరవాణిలో పురమిత్ర యాప్ ఉంటే చాలు నగర, పురపాలకల్లో ఉన్న 8 విభాగాలకు సంబంధించి 119 సమస్యలను పరిష్కరించే వీలుంది. ప్రజాసమస్య, వ్యక్తిగత సమస్య ఇలా ఏ తరహా అయినా ఫొటో తీసి పంపగానే సంబంధిత విభాగాల అధికారులకు వెళుతుంది. వెంటనే వారు వచ్చి పరిష్కరిస్తారు. మీరు చేయాల్సిందల్లా 'పురమిత్ర' యాప్‌ను ఆండ్రాయిడ్ ఫోన్‌లో డౌన్లోడ్ చేసుకొని ఫొటో సంధించడమే..

ఉదాహరణకు అనంతపురం నగరం, ఉమ్మడి జిల్లాలోని ఏ పురపాలకలో అయినా ఏ ప్రాంతంలో అయినా రోడ్ల మీద గుంత ఉంటే పురమిత్ర యాప్ ద్వారా ఫొటో పంపొచ్చు. దోమలు, కుక్కల బెడద, పైపులైను లీకేజీ, పారిశుద్ధ్యం ఇలా ఒకే తరహా సమస్య ఒకే ప్రాంతానికి సంబంధించి ఐదు కంటే ఎక్కువగా యాప్‌లో ఫిర్యాదులు అందితే అది అత్యవసరం (హాట్ స్పాట్)గా చూపుతుంది. ఆరెంజ్ సంకేతం కమిషనర్ల లాగిన్‌లో చూపుతుంది. ఉదయం కమిషనర్లు పర్యటించే సమయంలో ముందు ఆ ప్రాంతాలకు ప్రాధాన్యం ఇస్తారు. పరిష్కరించిన అనంతరం హాట్ స్పాట్ ఆకుపచ్చ రంగులోకి మారుతుంది.

అనంతపురం నగరంలో యాప్ తీసుకొచ్చిన 5 నెలల్లో 932 ఫిర్యాదులు




నమోదు అయ్యాయి. ఇందులో 868 పరిష్కారం కాగా ఇంకా 64 పరిష్కరించాల్సి ఉంది.

**వినియోగం.. సేవలు సులభం**

ఆండ్రాయిడ్ ఫోన్ ప్లేస్టోర్‌లోకి వెళ్లి సెర్చిలో పురమిత్ర యాప్ అని టైప్ చేయాలి. ఆకుపచ్చ, పసుపు రంగుల్లో తెలుగు, ఇంగ్లీషు భాషల్లో లోగో కనిపిస్తుంది. ఇన్‌స్టాల్ చేసుకొని ఓపెన్ చేయగానే ఫోన్ నంబరు అడుగుతుంది. ఎంటర్ చేయగానే ఓటీపీ వస్తుంది. దాన్ని నమోదు చేయగానే పేరు, పురపాలిక, మీరు ఉన్న వార్డు సచివాలయం వివరాలు ఎంట్రీ చేయాలి.

యాప్‌లో పై భాగాన తొలిసారి నమోదు చేసిన ప్రాంతం ఉంటుంది. అక్కడ క్లిక్ చేస్తే మిగిలిన నగర, పురపాలికల పేర్లు కన్పిస్తాయి.

యాప్‌పై భాగాన ఉన్న 8 విభాగాల్లో మీకు అవసరం ఉన్న దాన్ని క్లిక్ చేస్తే అందులోని ఉపవిభాగాల్లో సమస్యను ఎంపిక చేసుకొని ఫొటోలు అప్‌లోడ్ చేయవచ్చు. వాయిస్ రికార్డు లేదా అక్షరాలు టైప్ చేసి వివరాలు నమోదుకు వీలుంది.

ఉమ్మడి జిల్లాలో పురపాలికలు: 12


పరిధిలో జనాభా: 13,62,117

# 'కరి' మింగిన వెలగలా పరిహారం

పలమనేరు : అరకొర పరిహారంతో ఏనుగుల దాడుల్లో నష్టపోయిన రైతులు కుదేలవుతున్నారు. అంచనాల మదింపులో అటవీ అధికారులు అన్యాయం చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం రాగానే పరిహారం పెంచినా అది చాలట్లేదని, రూ.లక్షల్లో నష్టపోతే రూ.వేలల్లో చెల్లిస్తున్నారంటూ వాపోతున్నారు. ఆరేళ్లలో వివిధ పంటలకు సంబంధించి 4,778 ఎకరాల్లో పంటనష్టం జరగ్గా రూ.4.93 కోట్లు చెల్లించారు. ఇది సగటున ఎకరాకు రూ.10 వేల వరకు మాత్రమే. ఎకరా వరి సాగుకు ఖర్చులన్నీ కలిపి రూ.40 వేలు అవుతుండగా అధికారులు నష్టం జరిగిన ప్రాంతంకంటే కొలతలు తక్కువ వేస్తున్నారని, మార్కెట్ ధర కంటే తక్కువగా పరిహారం ఇస్తున్నారని వాపోతున్నారు. పశువులు మరణిస్తే మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం ఇస్తుండటం కొంత ఊరటనిస్తోంది. ఆరేళ్లలో పశు మరణాలు 38 నమోదవగా వాటికి రూ.7.8 లక్షలు చెల్లించారు.

**రూ.1.50 లక్షలు నష్టపోతే రూ.7 వేలిచ్చారు**

ఏనుగులు గతేడాది నా పొలంలోని పది కొబ్బరి చెట్లు విరిచేశాయి.



అందివచ్చిన పంటనూ ధ్వంసం చేశాయి. అప్పట్లో కొబ్బరి చెట్టు విలువ రూ.10 వేలు కాగా పది చెట్లకు రూ.లక్ష.. కాగా పంటలకు మరో రూ.50 వేలు నష్టం వాటిల్లింది. అధికారులు మాత్రం రూ.7 వేలు ఇచ్చారు.

**అమ్ములు, మొగిలేపల్లె, గంగవరం**

దాడులు జరగకుండా చూస్తాం..

ప్రభుత్వం రైతులకు పరిహారం ఇచ్చే విషయంలో ఉదారంగా వ్యవహరిస్తోంది. గతంలోకంటే ఎక్కువ ఇస్తోంది. ఎక్కడా జాప్యం చేయడం లేదు. ఏనుగులు పంటలపై దాడులు చేయకుండా చర్యలు తీసుకుంటాం. రైతులకు నిబంధనల మేరకు న్యాయం చేసి ఆదుకుంటాం.

## మంగలేటీ.. 'భూ'తాల లూటీ

నంద్యాల : రెండు కార్ల పంటలకు సాగునీటిని అందించే కాల్వ ఆక్రమణకు గురైంది. ఏళ్లుగా కొద్దికొద్దిగా ఆక్రమణలకు గురవుతూ రావడంతో చివరకు కాల్వ రూపు కోల్పోయే దుస్థితి నెలకొంది. భారీ వర్షం వస్తే కాల్వ పొంగిపొర్లి పొలాలను ముంచడంతోపాటు ఏకంగా గ్రామమే మునిగిపోయే పరిస్థితి ఏర్పడింది.

**200 ఎకరాల ఆక్రమణ**

నారాయణపురం పరిధిలో 605, 606, 608, 612, 614, 615 తదితర సర్వే నంబర్లలో 17 మీటర్ల వెడల్పుతో మంగలేటి కాల్వ ఉంది. 1996 నుంచి వెలుగోడు రిజర్వాయరు ద్వారా తెలుగుగంగ కాల్వలకు నీటి విడుదల ప్రారంభమైంది. దీంతో పంట పొలాలకు 'కళ' వచ్చింది. మంగలేటి కాల్వకు కూడా అప్పటి నుంచే సాగునీటి విడుదల జరగ్గా.. కాల్వ ఆక్రమణకు గురవుతూ వచ్చింది. ప్రస్తుతం కాల్వ వెడల్పు మూడు మీటర్లు మాత్రమే ఉంది. దీంతో నిర్దేశిత పరిమాణంలో నీటిని తీసుకోలేకపోతోంది. 5 కి.మీ.ల పొడవునా కాల్వ వెంట ఆక్రమిత భూమి విస్తీర్ణం 200 ఎకరాల వరకు ఉంటుందని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు.

**9 కి.మీ. పొడవునా..**

తెలుగుగంగ ప్రధాన కాల్వ నుంచి బండిఆత్మకూరు మండలం నారాయణపురం, సంతజూటూరు, చిన్నదేవళాపురం తదితర గ్రామాలకు 'కృష్ణా' వెనుక జలాలను అందించేందుకు 'మంగలేటి కాల్వ' ఉంది. టీజీపీ ప్రధాన కాల్వ నుంచి సంతజూటూరు వరకు 9 కి.మీ. పొడవునా ఈ



కాల్వ ఉంది. ప్రధాన కాల్వ నుంచి నారాయణపురం గ్రామం వరకు 5 కి.మీ.ల పొడవునా కాల్వ ఆక్రమణకు గురైంది.

**నారాయణపురం జల దిగ్బంధం**

మంగలేటి కాల్వ ఆక్రమణలతో సాగునీరు విడుదల సమయంలో కాల్వ పొంగి పొర్లుతుంది. ఇదే సమయంలో భారీ వర్షం కురిసినా.. తుపాను సమయంలో కాల్వ పోటెత్తి సమీపంలోని పొలాలను ముంచెత్తుతోంది. సమీపంలోని నారాయణపురం గ్రామాన్ని దిగ్బంధం చేస్తుంది. చుట్టుపక్కల ప్రాంతాలకు సంబంధాలు తెగిపోతున్నాయి. తాగునీరు కలుషితం అవుతుంది. ఇక్కడి ప్రజలు ఇలా ఇబ్బందులు పడడం రెండు దశాబ్దాలుగా సాధారణంగా మారిపోయింది.

**పొలాలకూ దెబ్బ**

తెలుగుగంగ ప్రధాన కాల్వ నుంచి నారాయణపురం మీదుగా సంతజూటూరు వరకు 9 కి.మీ.ల పొడవునా మంగలేటి కాల్వ ప్రవాహం ఉంది. నారాయణపురంతోపాటు సమీప గ్రామ పొలాలు దెబ్బతింటున్నాయి. గ్రామానికి చెందిన 300 ఎకరాల పంట పొలాలు భారీ వర్షాల సమయంలో మునిగి రైతులు నష్టపోతున్నారు. గతనెల మొంథా తుపానుతో గ్రామంతోపాటు పొలాలు మునిగాయి.

## జామాయిల్ సాగు.. లాభాలు బాగు

తాళ్లూరు : రైతులు ఎంతో ఆశతో సాగు చేపట్టిన జామాయిల్ పంట ప్రస్తుతం కనక వర్షం కురిపిస్తోంది. నీటి వసతి తక్కువగా ఉండడం, పెట్టుబడులు పెట్టి పంట సాగుకోసం అధిక శ్రమను చేయలేని రైతులు జామాయిల్ సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు.

**జిల్లా పరిధి గ్రామాల రైతులు కూడా..**

తాళ్లూరు, విఠలాపురం, కొత్తపాలెం, బొద్దికూరపాడు, వెలుగువారి పాలెం, తదితర గ్రామాల రైతులతోపాటు జిల్లా పరిధిలోని చీమకుర్తి, మద్దిపాడు, ముండ్లమూరు, దర్శి, టంగుటూరు, జరుగుమల్లి, సంతనూతలపాడు, తదితర మండ లాల పరిధిలో విస్తారంగా సాగులో ఉంది. పెట్టుబడులు చాలా తక్కువగా ఉండడంతో రైతులు పంట సాగు పట్ల అసక్తి చూపుతున్నారు. దీంతో జిల్లా పరిధిలో సుమారు నలభైవేల ఎకరాల్లో సాగవుతోంది. తొలి ఏడాదిలో కేవలం రూ.20వేలు వంతునే పెట్టుబడులు పెట్టి సాగు చేశారు. తదుపరి రెండేళ్లలో అవసరమైనమేర శ్రమతో పంటను కాపాడుకోవడంతో ప్రస్తుతం కాసులు కురిపిస్తున్నాయి. ఒక్కో ఎకరాలో సాగు ఖర్చులు, కౌలు, ఇతరత్రా పెట్టుబడులన్నీ కలిపి మొత్తం రూ. 50వేలమేరకు రైతులు ఖర్చు చేశారు. గత రెండు, మూడేళ్ల కాలంలో గిట్టుబాటు ధరలు దక్కక రైతులు ఎన్నో విధాలుగా ఇబ్బందులకు గురయ్యారు. ప్రస్తుతం ఊహించిన రీతిలో పుష్కలంగా లాభాలు వస్తుండడంతో ఆనందంగా ఉన్నారు.

**భూముల స్థితిగతుల ఆధారంగా..**

ఒక్కో ఎకరాలో రైతుల భూముల స్థితిగతులు ఆధారంగా 25 నుంచి 40 టన్నుల వరకూ దిగుబడులు వస్తున్నాయి. సరాసరిగా 25 టన్నుల మేరకు అధిక మంది రైతులు దిగుబడులు సాధించ గలిగారు. ప్రస్తుతం ప్రైవేటు వ్యాపారులు టన్ను ధర రూ.ఐదువేల వంతున రైతులకు చెల్లిస్తున్నారు. కూలీలకు అవుతున్న ఖర్చులు, వాహనాల బాడుగలు, ఇతరత్రా ఖర్చులు పోగానే ఆమేర ధరలు దక్కుతున్నాయి. దీంతో ఎకరాలో రూ. 1,25,000ల వరకూ వస్తుండగా పెట్టుబడులు పోగా నికరాదాయం రూ. 75 వేలుపైగా దక్కుతోంది. ఇతర పంటలు దెబ్బతిని నష్టాలను చవిచూసి ఆందోళనలో ఉన్న రైతాంగానికి సుబాబుల్ పంట బాగా ఊరటనిస్తోంది.

## బిందు సేద్యం.. మొక్కకు ప్రాణం

కంభం : సాగును ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం ఎన్నో కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. అందులో భాగంగా బిందు, తుంపర్ల సేద్యం పరికరాలను రాయితీపై అందజేస్తోంది.

**రాయితీలు ఇలా...**ఎస్సీ, ఎస్టీల్లో 5 ఎకరాల్లోపు ఉన్న చిన్న, సన్నకారు రైతులకు వంద శాతం, ఇతర చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం, 5 నుంచి 10 ఎకరాలు కలిగిన మధ్య తరగతి రైతులు 90 శాతం, 10 నుంచి 12.5 ఎకరాలు కలిగిన పెద్ద రైతులకు 50 శాతం రాయితీతో బిందు సేద్యం పరికరాలు అందిస్తున్నారు. రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించి భూమి పత్రాలు (పాస్ పుస్తకాలు), ఆధార్ కార్డు, పాస్‌పోర్టుసైజు ఫొటో, బ్యాంకు ఖాతా వివరాలు, ఫోన్ నంబర్‌తో సంప్రదించాలి. రైతు వాటా ఆన్‌లైన్‌లో చెల్లించాలి. నిర్దేశించిన లక్ష్యం పూర్తి అయినప్పటికీ, అర్హులైన రైతులు ముందుకు వస్తే ఏడాది పొడవునా బిందు, తుంపర్ల సేద్యం పరికరాలు మంజూరు చేస్తామని గిద్దలూరు ఉద్యాన శాఖ అధికారి శ్వేత తెలిపారు. లక్ష్యం... 10 వేల హెక్టార్లు జిల్లా వ్యాప్తంగా 2025-26 ఏడాదికి 10 వేల హెక్టార్లలో బిందు సేద్య పరికరాలను ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుంది. కానీ ఇప్పటి వరకూ సగం లక్ష్యం కూడా పూర్తి చేయలేదు. 4805 హెక్టార్లకు పరిపాలన అనుమతులు మంజూరయ్యాయి. మరో 5194 హెక్టార్లకు బిందు సేద్యం పరికరాలు అందజేయాల్సి ఉంది. నిర్దేశించిన లక్ష్యం కంటే ఎక్కువగా బిందు, తుంపర్ల సేద్యం పరికరాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అధికారులు చెబుతున్నారు.

## తూకాల్లో తేడా.. సరఫరాలోనూ స్వాహా!



పుట్టపర్తి: ధర్మవరం మార్కెట్ ప్రాంతంలో మంగళవారం ఓ మహిళ చౌక దుకాణం నుంచి బియ్యం తీసుకువెళ్లింది. ఇంటికి వెళ్లి తూకం వేయగా.. 15 కిలోలకుగాను 13.50 కిలోలే వచ్చాయి. వెంటనే వెళ్లి డీలర్‌ను ప్రశ్నించారు. ఆయన బియ్యం బస్తాని తూకం చూడగా 47.600 కిలోలు వచ్చింది. జిల్లాలో చాలా చోట్ల ఇదే పరిస్థితి. జిల్లాలో చౌకదుకాణాల ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్ బియ్యంలో అవకతవకలు జరుగుతున్నాయని లబ్ధిదారులు వాపోతున్నారు. డీలర్లు తూకాల్లో మోసాలకు పాల్పడుతుండటంతో అన్యాయం జరుగుతోందని వాపోతున్నారు. ఈ విషయమై డీలర్లను ప్రశ్నిస్తే.. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచే తూకాలు తక్కువతో సరఫరా చేస్తున్నారని చెబుతున్నారు. అంటే.. గుత్తేదారులు తమకు తక్కువ ఇస్తుండటంతోనే తామూ లబ్ధిదారులకు సరఫరా చేసే మొత్తంలో కొంత తగ్గించి ఇస్తున్నామని పరోక్షంగా చెబుతున్నారు. ప్రభుత్వం ఉచితంగా ప్రతి లబ్ధిదారుకు నెలకు ఐదు కిలోలు చొప్పున బియ్యం అందిస్తోంది. ఇందుకోసం ప్రభుత్వం కిలోకు రూ.44 వెచ్చిస్తోంది. జిల్లాకు ప్రతి నెలా 87,10,680 కిలోలు సరఫరా చేస్తోంది. అంటే.. నెలకు రూ.38.32 కోట్లకు పైగా వెచ్చిస్తోంది. ఈనేపథ్యంలో బియ్యం తూకాల్లో మోసాలు జరుగుతుండటంతో కార్డుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**నిల్వ కేంద్రాల్లోనూ తక్కువగా..**

జిల్లాకు పశ్చిమగోదావరి నుంచి రేషన్ బియ్యం సరఫరా చేస్తున్నారు. వాటిని బుక్కపట్నం, గాండ్లపెంట, గోరంట్ల, కదిరి, ముదిగుబ్బ, పెనుకొండ, తనకల్లు, ధర్మవరం, మడకశిర, హిందూపురం, సీకే పల్లి, ఓబుళదేవరచెరువులో ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్లకు చేరవేస్తున్నారు. అక్కడి నుంచి వాటి పరిధిలోని డీలర్లకు సరకు సరఫరా చేస్తున్నారు. ఇక్కడే తూకాల్లో తేడాలొస్తున్నాయని డీలర్లు అంటున్నారు. ఇటీవల ఓ మండలంలో 50 కిలోల బస్తాను తూకం వేయగా 43.060 వచ్చింది. అంటే.. అన్ని బస్తాల్లోనూ ఇదే తూకాలు ఉండవు. సగటున రెండు కిలోలు తక్కువ వస్తున్నాయని, బస్తా బరువు అదనమని డీలర్లు చెబుతున్నారు. నిల్వ కేంద్రాల్లో బియ్యం తీసుకునే సమయంలో డీలర్లు వేలిముద్రలు తప్పక వేయాలి. అలాంటప్పుడు తూకాల్లో తక్కువ వస్తే అక్కడే ఎందుకు అడగటం లేదని అధికారులు ప్రశ్నిస్తున్నారు.

**తనిఖీలు చేస్తున్నాం- వంశీకృష్ణారెడ్డి, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి**చౌక దుకాణాల్లో డీలర్లు తూకాల్లో మోసాలకు పాల్పడినట్లు ఫిర్యాదులు వస్తే వెంటనే తనిఖీలు చేస్తున్నాం. నిల్వ సరకులో తేడాలుంటే నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రతినెలా 20 వరకు కేసులు నమోదు చేస్తున్నాం. తనిఖీలు మరింత విస్తృతం చేస్తాం.

## ఆకలి తీర్చి.. దప్పిక మరచి..!



చిత్తూరు : ఇది గుడుపల్లెలోని జడ్పీ ఉన్నత పాఠశాల. ఇక్కడ 470 మంది విద్యార్థులు చదువుతున్నారు. బుధవారం 404 మంది హాజరయ్యారు. గతంలో ఇచ్చిన నీటిశుద్ధి యంత్రం పనిచేయడం లేదు. దీంతో విద్యార్థులు ఇళ్ల నుంచి బాటిళ్లలో నీరు తెచ్చుకుంటున్నారు. ఇప్పటికైనా దీనికి మరమ్మతులు చేస్తే వారికి ప్రయోజనకరంగా ఉంటుంది. పాఠశాలలకు వచ్చే చిన్నారులు ఆకలితో ఉండకూడదనే ఉద్దేశంతో మధ్యాహ్న భోజన పథకానికి శ్రీకారం చుట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చాక దీన్ని మరింత మెరుగుపరిచింది. రోజూ మెనూను సక్రమంగా అమలు చేస్తున్నారు. ఎంఈవో-2లు రోజూ పర్యవేక్షిస్తున్నారు. ఇంతవరకూ బాగానే ఉన్నా అడపాదడపా అన్నం గట్టిగా ఉండటం, ముద్దగా తయారవుతోన్న ఉదంతాలు వెలుగు చూస్తున్నాయి. కొన్నిచోట్ల రక్షిత నీటిశుద్ధి యంత్రాలు లేకపోవడం, మరమ్మతులకు గురవ్వడం, వంట చేసే ప్రదేశాలు శుభ్రంగా లేనందున విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మరికొన్నిచోట్ల స్థలాభావంతో ఆరుబయటే వండుతున్నారు. ఫలితంగా దుమ్ము, ధూళి చెలరేగి వంటల్లో పడుతున్నాయి. చిత్తూరు జిల్లాలోని పాఠశాలలు: 2,436

విద్యార్థులు: 1,33,917 మంది

మరమ్మతులు చేస్తేనే..చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ప్రధానంగా ఆర్వో ప్లాంట్లు లేకపోవడమే సమస్యగా మారింది. వైకాపా హయాంలో 'నాడు- నేడు' కింద తొలి, రెండో విడత పనులు చేపట్టిన పాఠశాలల్లో వీటిని అమర్చినా నిర్వహణ కరవైంది. దీంతో అవి మూలకు చేరాయి. సంబంధిత ఏజెన్సీలకు ప్రధానోపాధ్యాయులు సమాచారం ఇచ్చినా బాగు చేయడానికి ముందుకు రావడంలేదు. పలుచోట్ల ఉపాధ్యాయులే కొంత మొత్తం వేసుకుని మరమ్మతులు చేయిస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో అలాగే వదిలేయడంతో విద్యార్థులు బయటి నుంచి నీళు తెచ్చుకుంటున్నారు. పలువురు మధ్యాహ్న సమయంలో పాఠశాలను వదిలి ఇళ్లకు వెళుతున్నారు. కుప్పం, పలమనేరు, శ్రీకాళహస్తి, గూడూరు, సత్యవేడు నియోజకవర్గాల్లో ప్రధానంగా మరమ్మతులు చేయాలి. **వర్షమొస్తే అంతే**

జిల్లాలోని దాదాపు 30 శాతం పాఠశాలలకు సరిపడా వంట గదులు లేవు. దాంతో ఆరుబయటే భోజనాలు వండుతున్నారు. ఇలాంటి చోట వర్షం వచ్చినప్పుడు అవస్థలు ఎదురవుతున్నాయి. పలమనేరు, పుంగనూరు, సత్యవేడు, చంద్రగిరి నియోజకవర్గాల్లో ఈ దుస్థితి అధికంగా ఉంది. వరండాలూ సరిగ్గా లేక చెట్ల కింద తినాల్సి వస్తోంది.

## బండి తీయాలంటే భయం!



అనకాపల్లి : జిల్లాలో వాహనదారులకు ట్రాఫిక్ ఇక్కట్లు తప్పడం లేదు. అనకాపల్లి, ఎలమంచిలి, నర్సీపట్నం మున్సిపాలిటీల పరిధిలో ఈ సమస్య తీవ్రంగా ఉంది. ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ వాహనదారులను హడలెత్తిస్తోంది. ముఖ్యమైన కూడళ్లలోనూ ట్రాఫిక్ పోలీసులు లేకపోవడంతో పరిస్థితి అస్తవ్యస్తంగా మారుతోంది. జిల్లా పోలీసు యంత్రాంగం ఈ సమస్య పరిష్కారంపై దృష్టి పెట్టడం లేదు. సాయంత్రమైతే కొందరు రోడ్డు మధ్యలో బళ్లు పెట్టి వ్యాపారాలు నిర్వహిస్తుండటంతో.. సమస్య మరింత జటిలమవుతోంది.

**వాహనాలు నిలిపేందుకు ఇక్కట్లు..**

అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలి మున్సిపాలిటీలు క్రమంగా విస్తరిస్తున్నాయి. ఎక్కడికక్కడ వ్యాపార సముదాయాలు వెలుస్తున్నాయి. కానీ.. పట్టణంలోని ఏ ఒక్క షాపింగ్ మాల్ దగ్గర కూడా పార్కింగ్ సదుపాయాలు లేవు. రోజూ సాయంత్ర వేళల్లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా.. అటు మున్సిపాలిటీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు కనీసం పట్టించుకోవడంలేదు. పట్టణంలో ఎక్కడా పార్కింగ్ చేసేందుకు కూడా స్థలం లేదు. ఫలితంగా రోడ్లపైనే వాహనాలు నిలుపుతుండటంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది.

అనకాపల్లి పట్టణంలోని ంగ్ రోడ్డు, గాంధీబొమ్మ సెంటర్లు నిత్యం రద్దీగా ఉంటాయి. వారాంతాల్లో అయితే.. చెప్పనక్కర్లేదు. దీంతోపాటు ఈ కూడలి మధ్యలోనే ఆర్టీసీ బస్సులు, ఆటోవాలాలు నిలుపుతున్నారు. ఫలితంగా ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంటోంది. కనీసం వారాంతాల్లోనూ ట్రాఫిక్ సిబ్బంది ఉండకపోవడంతో ఏ కూడలి దాటాలన్నా 20 నిమిషాలకు పైనే పడుతోంది. ఎలమంచిలి పట్టణంలో పార్కింగ్ స్థలాలు లేవు. దుకాణాల ముందే వాహనాలు నిలపాలి. దిమిలి రోడ్డులో వాహనాలు ఇరువైపులా వాహనాలు నిలుపుతుంటారు. అచ్యుతాపురం నాలుగు రోడ్ల కూడలి మీదుగా నిత్యం వందల వాహనా లు రాకపోకలు సాగిస్తున్నా.. ఒక ట్రాఫిక్ పోలీస్‌తో నెట్టుకొస్తున్నారు.

నర్సీపట్నం శ్రీకన్య కూడలి, అబీద్ కూడలి, ఐదురోడ్ల కూడలిలో ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుంది. అబీద్ కూడలి – కృష్ణదేవిపేట వెళ్లే దారి ఇరుగ్గా ఉండటంతో ఎదురెదురు వాహనాల రాకపోకలకు వీలవడం లేదు. నర్సీపట్నం ప్రధాన రహదారిలో చిన్నచిన్న ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. ఐదురోడ్ల కూడలిలో సిగ్నల్ పెట్టాలని ఎప్పటి నుంచో ప్రతిపాదనలు ఉన్నా.. కార్యరూపం దాల్చలేదు. ఈ కూడలిలో కనీసం ముగ్గురు ట్రాఫిక్ సిబ్బంది అవసరమున్నా.. ఒక్కరితో సరిపెట్టారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కరిస్తాం: జిల్లాలో ట్రాఫిక్ అధికంగా ఉన్న కూడళ్లను గుర్తిస్తున్నాం. ప్రధాన కూడళ్లలో నిత్యం ట్రాఫిక్ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. రద్దీ ప్రాంతాల్లో బారికేడ్లు, ఫ్రీ లెఫ్ట్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ఇటీవల ఆధునిక సీసీ కెమెరాలు కూడా ప్రధాన కూడళ్లలో పెట్టాం. వాటితో కూడా ట్రాఫిక్ సమస్యను గుర్తించి సమీపంలోని సిబ్బందిని పంపించి సరిచేస్తాం. తుహిన్ సిన్హా, ఎస్పీ, అనకాపల్లి

## పసివాళ్లు.. శుద్ధినీరందక వెక్కిళ్లు

ఆళ్లగడ్డ : అంగన్‌వాడీల్లో చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు సురక్షిత జలం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం శుద్ధజల యంత్రాలను(వాటర్ ప్యూరిఫయర్) అందించింది. వీటిలో కొన్ని పనిచేయక పోగా, మరికొన్ని నీటి వనరులు, పైప్‌లైన్ నిర్మాణం, నీటి ట్యాంకులు లేకపోవడంతో వృథాగా మారాయి. 'సక్షం' పథకంలో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో సొంత భవనాలున్న 246 అంగన్‌వాడీ కేంద్రాలకు శుద్ధజల యంత్రాలను నాలుగు నెలల క్రితం మంజూరయ్యాయి. మరమ్మతులు, నిర్వహణ లోపించడంతో యంత్రాలు అలంకారప్రాయంగా మారాయి.

**అనారోగ్యం పాలవకుండా..**

కలుషిత తాగునీటితో టైఫాయిడ్, గ్యాస్ట్రోఎంటరైటిస్, కామెర్లు తదితర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. నీటిలో ప్రమాదకరమైన క్రిములను, అపరిశుభ్రతను దూరం చేసేందుకు శుద్ధజల యంత్రాలను వినియోగించాల్సి ఉంటుంది. అంగన్‌వాడీలకు వచ్చే చిన్నారులకు బాలింతలు, గర్భిణులు శుద్ధజలం అందించాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కేంద్రాలపై ఉంది. సక్షం పథకంలో భాగంగా నాణ్యమైన యంత్రాలు ఇచ్చినా నిరుపయోగంగా మారాయి.

**ముగింపు దశకు వచ్చినా..**

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సక్షం పథకాన్ని 2021లో అమల్లోకి తీసుకు వచ్చింది. ఈ కార్యక్రమం గడువు వచ్చే ఏడాదితో ముగియనుంది. గడువు ముగింపు దశకు వచ్చినా ఇప్పటికీ కనీసం



80 శాతం కేంద్రాల్లో యంత్రాలు పనిచేయక పోవడం గమనార్హం. దీతో లబ్ధిదారులకు సురక్షిత జలం అందని స్థితి నెలకొంది. సక్షం పరిధిలోని రాని కేంద్రాల్లో శుద్ధజలం ఎండమావిగానే మిగిలింది.

ఆళ్లగడ్డ మండలం జి.జంబులదిన్నెలో కేవలం ఒకటిన్నర సెంటు విస్తీర్ణం ఉన్న శిథిల భవనంలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. శుద్ధజల యంత్రం, ఆండ్రాయిడ్ టీవీ, ఆట వస్తువులు మంజూరైనా వసతి సరిగా లేకపోవడతో పక్కన పెట్టేశారు.

ఆళ్లగడ్డ మండలం శాంతినగరం, ఉయ్యాలవాడ మండలం తుడుములదిన్నె, సర్వాయిపల్లె, అల్లూరు, మాయలూరు కేంద్రాలకు యంత్రాలు మంజూరైనా ట్యాంకులు లేకపోవడం, నీటి గొట్టాల కనెక్షన్ పూర్తి లేకపోవడంతో వీటి సేవలు అందడం లేదు. దొర్నిపాడులో మూడు కేంద్రాలు ఉన్నా తాగు నీటి సేవలు అందడం లేదు.

అంగన్‌వాడీ కేంద్రాలు: 3,558

బాలింతలు, గర్భిణుల సంఖ్య: 70,766

చిన్నారులు: 2,33,921


సక్షం కేంద్రాలు: 246

## వృద్ధులంటే చౌక.. బియ్యం ఇవ్వకుండా ధోకా

కర్నూలు: 65 ఏళ్ల వయో వృద్ధులు.. దివ్యాంగులు.. నడవలేని వారికి రేషన్ సరకులు ఇళ్ల వద్దనే పంపిణీ చేయాలని ప్రభుత్వం చెబుతోంది. నెలనెలా డీలర్లు తమ పరిధిలోని వృద్ధుల ఇంటి వద్దకే వెళ్లి వేలిముద్రలు వేయించుకొని బియ్యం ఇవ్వాల్సి ఉంది. డీలర్ల నిర్లక్ష్యం.. అధికారుల ఉదాసీనత కారణంగా ఇది ఎక్కడా అమలు కావడం లేదు. పండుటాకులకు కష్టాలు తప్పడం లేదు. నవంబరు ముగిసినా వీరిలో సగం మందికే రేషన్ పంపిణీ చేశారు. డిసెంబరు 1 నుంచి సాధారణ రేషన్ పంపిణీ మొదలైనా తమను మాత్రం పట్టించుకోవడం లేదని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2,437 చౌకదుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో 65 ఏళ్లు దాటిన వయోవృద్ధులు, దివ్యాంగులైన కార్డుదారులు 1,02,015 మంది ఉన్నారు.

వీరికి ప్రతినెలా 25 నుంచి నెలాఖరు వరకు ఇంటి వద్దే సరకులు పంపిణీ చేయాల్సి ఉంది. క్షేత్రస్థాయిలో ఇది సవ్యంగా అమలు కావడం లేదు. డిసెంబరు 2వ తేదీ నాటికి ఉమ్మడి జిల్లాలో 58,278 మందికి మాత్రమే రేషన్ పంపిణీ చేశారు. 43,737 మందికి ఇప్పటికీ ఇవ్వలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. దీంతో గత్యంతరం లేక వృద్ధులే చౌకదుకాణాలకు వెళ్లి సరకులు తెచ్చుకుంటున్నారు.

నగదు అంటగడుతున్నారు



అధికారుల పర్యవేక్షణ, తనిఖీలు లేకపోవడంతో డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నెల గడిచిపోయినా వృద్ధులు, దివ్యాంగులకు రేషన్ ఇవ్వకుండా.. బియ్యానికి బదులు నగదు చెల్లిస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

చాలామంది వృద్ధుల ఇళ్లకు వెళ్లి బయోమెట్రిక్ తీసుకొని కిలోకు రూ.10 చొప్పున డబ్బులు ఇస్తున్నారు. మాకు డబ్బు వద్దు బియ్యమే కావాలంటే మాత్రం చౌకదుకాణాల వద్దకు రావాలని చెబుతున్నట్లు వృద్ధులు వాపోతున్నారు. కొందరు డీలర్లు ఒకటో తేదీ తర్వాతనే చౌకదుకాణాల వద్ద సరకులు పంపిణీ చేస్తున్నారు. అదీ రెండ్రోజులే. తర్వాత వెళ్తే బియ్యం అయిపోయాయని తిప్పి పంపుతున్నారు. వారికి రాజకీయ నేపథ్యం ఉండటంతో అధికారులు ఏమీ చేయలేకపోతున్నారు. సాయిబాబా సంజీవయ్య నగర్‌కు చెందిన ఈ వృద్ధురాలి పేరు లక్ష్మీదేవమ్మ. రేషన్ కార్డులో ఈమె ఒక్కరే ఉన్నారు. ఒక్కనెల కూడా డీలరు తమ ఇంటి వద్దకు వచ్చి సరకులు ఇచ్చింది లేదని ఈమె చెబుతున్నారు. బియ్యం తెచ్చుకునేందుకు ఈమె అష్టకష్టాలు పడుతూ.. పాత సాయిబాబా థియేటర్ సమీపంలోని 87వ చౌకదుకాణానికి వెళ్లారు. ఈ-పోస్ యంత్రంలో వేలిముద్రలు వేశారు. ఈమెకు 5 కిలోల బియ్యం ఇవ్వాల్సి ఉంది. డీలరు మాత్రం బియ్యం లేవని చెప్పారని.. బియ్యానికి బదులుగా రూ.50 చేతికిచ్చారని ఈమె చెబుతున్నారు. అంతదూరం నుంచి ఉసూరుమంటూ తిరుగుముఖం పట్టారు.

# హస్తకళ గ్రామానికి ఊపిరి

శ్రీకాళహస్తి : హస్తకళలకు కాణాచిగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తి కేంద్రంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హస్తకళ గ్రామం (క్రాఫ్ట్ విలేజ్) ఏర్పాటుకు శ్రీకారం చుట్టాయి. వైకాపా హయాంలో ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు భూమి పూజ చేశారు. కేంద్రం నుంచి నిధులు సమకూరినా, రాష్ట్ర ప్రభుత్వ వాటాగా ఇవ్వాల్సిన నిధులు ఇవ్వని కారణంగా పనులు ప్రారంభించిన ఏడాదిన్నరకే ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లు ఆగిపోయాయి. శ్రీకాళహస్తి కలంకారీతో పాటు ఇక్కడి కొయ్యబొమ్మలకు గుర్తింపు ఉంది. ఏర్పేడులోని మాధవమాల, పాపానాయుడుపేట, కేవీబీపురంలోని కర్లపూడి, బీఎన్‌కండ్రిగలోని పల్లమాలతో పాటు తిరుపతి గ్రామీణ ప్రాంతాల్లో వెదురుతో చేసే వస్తువులకు డిమాండ్ ఉంది. చేనేత వస్త్రాలకు గుర్తింపు లభిస్తోంది. పర్యాటకుల ఆసక్తికి తగ్గట్టుగా హస్తకళల గ్రామం (క్రాఫ్ట్ విలేజ్) ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

**'కూటమి' నిర్ణయంతో ఆశలు:** హస్తకళా గ్రామాన్ని అభివృద్ధి చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించడంతో కళాకారుల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. రాష్ట్ర హస్తకళాభివృద్ధి సంస్థ ఛైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ ఇటీవల ఇక్కడి పనులు పరిశీలించారు. నిర్ణీత వ్యవధిలోగా పూర్తి చేయాలని అధికారులకు సూచనలు చేశారు. 30 రెసిడెన్షియల్



వర్క్‌షాప్‌లు, ఉత్పత్తుల విక్రయాలకు 130 ఎంపోరియాలను అభివృద్ధి చేస్తున్నట్లు కళాకారులకు హామీ ఇచ్చారు. ఆడియో విజువల్ గది, శిక్షణ గదులతో పాటు పర్యాటకులు, హస్తకళాప్రియుల కోసం ఫుడ్‌కోర్టు తదితర వసతులు అందుబాటులోకి తేనున్నట్లు వెల్లడించారు.

ప్రాజెక్టు: హస్తకళ గ్రామం
మంజూరైన నిధులు: రూ.9.25 కోట్లు
భవన నిర్మాణాలకు: రూ.7.55 కోట్లు
తొలి విడత కేటాయింపు: రూ.4.77 కోట్లు
ప్రాజెక్టు పరిధిలోని కళాకారులు: 10 వేల మందికిపైనే

# తూర్పు తీరం.. రక్షణ కవచం

సింధియా : దాయాది దేశం పాకిస్థాన్‌కు చెందిన పీఎన్ఎస్ ఘాజీ (జలాంతర్గామి)పై 1971లో భారత నౌకాదళం వ్యూహాత్మకంగా దాడిచేసి విజయ బావుటాను ఎగరేయడంతో ఏటా డిసెంబరు 4న భారత ప్రభుత్వం 'నౌకాదళ దినోత్సవం' జరుపుకోవడం ఆనవాయితీ.

**విశాఖలో ఉత్సవాలు ఇలా..:** పదేళ్ల కిందటి వరకు ఏటా నవంబరు ఆఖరి గురు, శుక్ర, శని, ఆదివారాల్లో విశాఖలోని పైపులైను జంక్షన్ వద్ద పెద్దఎత్తున 'నేవీ మేళా'ను నిర్వహించేవారు. ఈ మేళాలో యుద్ధనౌకలు, క్షిపణులు, టార్పెడోలు, జలాంతర్గాముల నమూనాలను ప్రదర్శించేవారు. ఐఎన్ఎస్ శాతవాహన మైదానంలో హెలికాప్టర్, తదితర విన్యాసాలు ఉండేవి. అలాగే శుక్ర, శని, ఆదివారాల్లో నేవల్‌డాక్‌యార్డులో జెట్టీల వద్ద యుద్ధనౌకల సందర్శనకు నగర పౌరులను అనుమతించేవారు.

నవంబరు ఆఖరు, డిసెంబరు ఒకటి నుంచి కూడా ఆర్కేబీచ్ వద్ద భారత నేవీ యుద్ధనౌకలు, ఎయిర్‌క్రాఫ్ట్‌లతో సిబ్బంది కవాతు, విన్యాసాలను మూడు రోజుల పాటు ప్రదర్శించి నాలుగో రోజు (డిసెంబరు 4న) తీరంలో ఎంతో అట్టహాసంగా వేడుక జరిపేవారు. ఈ వేడుకల్లో అతిథులకు సైనిక వందనం చేసేవారు.

కొవిడ్ తర్వాత కొంత విరామం వచ్చింది. గత ఏడాది ఒడిశాలోని



పూరీ తీరాన నేవీ డే వేడుకలు జరపగా.. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ ఏడాది కేరళలోని తిరువనంతపురం తీరంలో ఉత్సవాలు జరుపుతుండటం విశేషం. **జాతికి అంకితం:** ప్రపంచస్థాయిలో శత్రుదేశాల నుంచి తలెత్తే ఎలాంటి ముప్పునైనా అలవోకగా ఎదుర్కొనేలా భారత నేవీ తన శక్తి సామర్థ్యాన్ని ఏటికేడాది పెంచుకుంటోంది. ఏడాదికాలంలో 12 యుద్ధనౌకలను జాతికి అంకితం చేసి రక్షణ సేవల్లోకి తీసుకున్నారు. వీటిలో ఉదయగిరి, హిమగిరి వంటి ప్రతిష్ఠాత్మక నౌకలు ఉండటం విశేషం. అలాగే వార్‌షిప్ డిజైన్ బ్యూరో ద్వారా అభివృద్ధి చేసిన నౌకగా ఉదయగిరి పేరుగాంచింది. **రాంబిల్లిలో :** ఇప్పుడు ఉన్న విశాఖ పాత బేస్‌కు అనుసంధానంగా విశాఖపట్నానికి 40 కి.మీ.దూరంలోని రాంబిల్లిలో అత్యంత ఆధునిక భద్రతతో కూడిన ఐ.ఎన్.ఎస్. వర్ష స్థావర నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. త్వరలో సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇది జలాంతర్గాముల స్థావరంగా పనిచేయనుంది.

# నిబంధనలకు పరదా!

అనకాపల్లి : ఎలమంచిలి పట్టణంలో ఏర్పాటు చేసిన రెండో బార్ వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది. జిల్లా అధికారులే తెరవెనుక ఉండి మద్యం దుకాణాల యజమానుల నుంచి బలవంతంగా డబ్బులు వసూలు చేసి ఇక్కడ బార్ పెట్టించారని ఇప్పటికే వివాదం రేగింది. ఈ బార్ ఏర్పాటే కాదు.. నిర్వహిస్తున్న తీరూ వివాదాస్పదంగా ఉంది. నిబంధనలకు నీళ్లొదిలేసి.. చుట్టూ పరదాలు కట్టి, పక్కనే ఉన్న ఓ చిన్న రేకుల షెడ్‌లో నడిపిస్తున్నారు. రాంబిల్లి మండలం నారాయణపురంలో దీనిని తాత్కాలిక లైసెన్స్‌తో సెప్టెంబర్ 27న బార్ పెట్టారు. నవంబరు 8న అక్కడ మూసివేసి నాలుగు రోజుల తరువాత ఎలమంచిలి పాత పెంకులమిల్లు ప్రాంతానికి మార్చారు. అప్పటి నుంచి ఇక్కడ చిన్న షెడ్డులో నడుపుతున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం.. బార్ నిర్వహణకు 150 చదరపు మీటర్ల విస్తీర్ణంలో పక్కా భవనం ఉండాలి. ఇక్కడ మరుగుదొడ్లు, కూర్చోవడానికి కుర్చీలు బల్లలు ఏర్పాటు చేయాలి. సీసీ కెమెరాలు ఉండాలి. కానీ.. ఇక్కడ ఇవేవీ పాటించడంలేదు. కేవలం చిన్న షెడ్ తప్పితే.. ఎటువంటి వసతులూ లేవు. ఖాళీ ప్రదేశంలో పరదా కట్టి దాన్నే బారుగా చూపిస్తున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే చందాన ఇక్కడ పరిస్థితులు ఉన్నాయి. ఆరుబయట తాగుతున్నారని స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు అయినా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై స్థానిక ఎక్సైజ్ ఇన్‌ఛార్జి సీఐ రాజారావును వివరణ కోరగా తాత్కాలిక లైసెన్స్‌తో ఇక్కడ బార్ పెట్టారన్నారు. దీనికి నిబంధనలు వర్తించవన్నారు. ఈ బార్ ఏర్పాటుకు తమ నుంచి డబ్బులు వసూలు చేశారంటూ వ్యాపారులు ఉన్నతాధికారులకు ఇప్పటికే ఫిర్యాదు చేశారు. ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారులు స్పందించారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్, సీఐ జ్ఞానేశ్వరిని విజయవాడ కమిషనర్ కార్యాలయానికి రమ్మని ఆదేశించారు.

# నకిలీ పత్రాలతో.. ఇళ్ల పట్టాలు



గుత్తి : గుత్తిలో నకిలీ ఇళ్ల పట్టాల దందా యథేచ్ఛగా సాగుతోంది. కొందరు నాయకులకు అనుచరులుగా ఉంటూ అక్రమ మార్గంలో సొమ్ము చేసుకుంటున్నారు. నకిలీ సృష్టిస్తూ... ఒక్కో పట్టాకు రూ.10వేల నుంచి 15 వేలు దండుకుంటున్నారు. ఇక్కడ పనిచేసి మరోప్రాంతానికి బదిలీ అయిన అధికారులతోపాటు మృతుల సంతకాలను ఫోర్జరీ చేస్తున్నారు. దీంతో రూ.కోట్లు విలువైన ప్రభుత్వ స్థలాలను సొంతం చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి రూ.2.50 లక్షలు ఇస్తామని ప్రకటించింది. ఈనేపథ్యంలో నిజమైన పట్టాలు ఉన్నవారితోపాటు నకిలీవి ఉన్నవారు కూడా దరఖాస్తు చేసుకుంటున్నారు. గుత్తిలోనే సుమారు వెయ్యి నకిలీ పట్టాలు ఉన్నట్లు అంచనా. పట్టణానికి చెందిన నలుగురు నకిలీ పట్టాల దందాను నడిపిస్తున్నారు. పట్టణంలోని చెర్లోపల్లికాలనీలో ఓ వైకాపా నాయకుడు రూ.లక్షలు విలువైన సుమారు 10 సెంట్ల స్థలానికి నకిలీ పట్టాలతో ఇళ్ల మంజూరుకు దరఖాస్తు చేసుకున్నాడు.

సర్వే నంబరు 609లో ప్రభుత్వం పదేళ్ల కిందట పేదలకు ఇళ్ల పట్టాలను మంజూరు చేసింది. అనేక మంది స్థలాలను ఆక్రమించి నివాసాలను ఏర్పాటు చేసుకుని పట్టాల కోసం నిరీక్షిస్తుండగా... ఓ నాయకుడు వారి నుంచి డబ్బు వసూలు చేసి నకిలీ పట్టాలు అంటగట్టాడు.

జెండాగేరిలో ఇద్దరు ఓ స్థలం తమదంటే తమదని పోటీపడుతున్నారు. అందులో ఒక దళారీ ద్వారా నకిలీ పట్టాను సృష్టించుకున్నాడు. దీంతో ఇరు వర్గాల వారు పరస్పరం దాడులకు పాల్పడ్డారు.

ఓ ప్రజాప్రతినిధి సమీప బంధువు నేమితాబాదు రోడ్డులో రెండు ఎకరాల అసైన్డ్ భూమిలో ప్లాట్లు వేసి... ప్రజలకు విక్రయించి, నకిలీ పట్టాలు ఇచ్చి సొమ్ము చేసుకున్నాడు.

ఓ మాజీ ప్రజాప్రతినిధి కుమారుడు గుత్తిలోని ధోబీఘాట్ స్థలంలో 80 మందికి నకిలీ పట్టాలు తయారు చేయించి ఇచ్చాడు. పాత ఇళ్లకు పట్టాలు లేకపోవడంతో అనేక మంది దళారుల ద్వారా వాటిని తీసుకున్నారు. నకిలీవని వారికి తెలియదు.

ఇదిలా ఉండగా కొత్తగా ప్రభుత్వం 250 ఇళ్లను మంజూరు చేసింది. గృహ నిర్మాణానికి నకిలీ పట్టాలు పుట్టుకొస్తున్నాయి. పొజిషన్ సర్టిఫికెట్లను ఇవ్వాలని గృహనిర్మాణశాఖ అధికారులు చెబుతుండటంతో నకిలీ పట్టాలకు సొమ్ములిచ్చిన వారు లబోదిబోమంటున్నారు. కొందరు రెవెన్యూ ఉద్యోగులు దళారీల అవతారం ఎత్తి కార్యాలయానికి వచ్చే ప్రజలతో సమాచారం సేకరిస్తూ నకిలీ పట్టాలను జారీ చేస్తున్నారు.

**అక్రమంగా రిజిస్ట్రేషన్లు...**

నకిలీ పట్టాలతో చాలా మంది తమ ఆధీనంలో ఉన్న నివేశన స్థలాలు, ఇళ్లను రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారు. ఈ వ్యవహారంలో కొందరు వీఆర్వోలు ప్రజల నుంచి రూ.వేలల్లో లంచాలు తీసుకుంటూ స్థల ధ్రువీకరణపత్రాలు జారీ చేస్తున్నారు. వాటిని ఆధారం చేసుకుంటూ అధికారులు రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు.

**పొజిషన్ సర్టిఫికెట్లు తీసుకుంటున్నాం**

–సూర్యనారాయణ, ఏఈఈ, గృహనిర్మాణశాఖ

తాము పట్టాలు తీసుకోవడంలేదు. స్థలాలు తమ ఆధీనంలో ఉన్నట్లు రెవెన్యూ అధికారులతో పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలని ప్రజలకు సూచిస్తున్నాం. నకిలీ పట్టాల ఆటకట్టించేందుకే ధ్రువీకరణపత్రాలు కోరుతున్నాం. వాస్తవ పట్టాలను పరిశీలించి.. తీసుకుంటున్నాం.

# కొనుగోళ్లు లేక.. వేదన తీరక!



కళ్యాణదుర్గం : ఖరీఫ్‌లో రూ.వేలల్లో పెట్టుబడులు పెట్టి.. ఆరుగాలం శ్రమించి పండించిన కంది పంట దిగుబడులు తీరా చేతికొచ్చేసరికి తుపాను ప్రభావం అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తోంది. ముసురుతోపాటు చిరుజల్లులు కారణంగా పంటను రక్షించుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. ఇప్పటికే చేతికొచ్చిన పంటను కొందరు కల్లాలు.. మరికొందరు రహదారులపైన ఆరబోసుకొంటున్నారు. ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 3,37,500 ఎకరాల్లో కంది సాగైంది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో పంట చేతికొచ్చినా.. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో కర్షకుల పరిస్థితి దయనీయంగా మారింది. చేసేదేమి లేక పంటను దళారులకు అమ్ముకోవాల్సి వస్తోందని, కనీసం పెట్టుబడి వ్యయం కూడా దక్కని దుస్థితి నెలకొందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**దళారులకు తెగమ్ముకోవాల్సిందే...**

– చంద్రశేఖర్‌రెడ్డి, బోరంపల్లి

పదకొండు ఎకరాల్లో పంట సాగుకు రూ.1.70 లక్షలు పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది. గతంలో ఎకరాకు ఐదు క్వింటాళ్ల దిగుబడి వచ్చేవి. ప్రస్తుతం రెండు క్వింటాళ్లకు పడిపోయింది. చిరుజల్లులు పడుతున్నాయి. పంటను రక్షించుకోలేకపోతున్నాం. బళ్లారి మార్కెట్‌కు తరలిస్తే దళారి కమీషన్, రవాణా ఖర్చులు పోతే మిగిలేది ఏమీ ఉండదు.

**రోడ్డుపైనే ఆరబోస్తున్నాం**

– చిన్నమారెన్న, గోళ్ల

చేతికొచ్చిన అరకొర పంటను రోజుల తరబడి రోడ్లపైనే ఆరబోస్తున్నాం. ఐదు ఎకరాలు సొంత పొలంలో, ఆరున్నర ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేశాను. మొత్తంగా 18 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఇప్పటికీ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయలేదు. వెంటనే ప్రభుత్వం స్పందించి కొనుగోలు చేయాలి.

**ఆదేశాలు రాగానే ఏర్పాటు చేస్తాం**

– పెన్నేశ్వరి, మేనేజరు, జిల్లా మార్క్‌ఫెడ్

కంది కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో పంట చేతికొస్తోంది. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే క్వింటాలు ధర రూ.8 వేలకు కొనుగోలు చేస్తాం.

# భూమి పోయింది.. బతుకు వేదనైంది


హిందూపురం : సమస్య పరిశ్రమలొస్తాయి, ఉద్యోగాలొస్తాయి, ఉపాధి లభిస్తుందని కొండంత ఆశలతో తక్కువ ధరకు రైతులు భూములిచ్చారు. దశాబ్దాలు గడిచిపోతున్నా వాటి ఊసేలేదు. సాగు భూములన్నీ బీళ్లుగా మారాయి. భూములు ఇచ్చిన రైతులు ఉపాధి లేక కూలీలుగా వలస బాటపట్టారు. ఎక్కడెక్కడ హిందూపురం నియోజకవర్గం 1984లో 38 మంది రైతుల వద్ద 354 ఎకరాల భూమి, చిలమత్తూరు మండలంలో 2008–09లో 11,352 ఎకరాలు, పరిగి మండలంలో 2006–08లో 2,200 ఎకరాలు.

**అప్పనంగా..** 1984లో ఏపీఐఐసీ తూముకుంట, గోళ్లాపురం, చౌళూరు గ్రామాలకు చెందిన 38 మంది రైతుల వద్ద 354 ఎకరాల భూమిని రూ.45 వేలచొప్పున సేకరించారు. ఆ భూములను అప్పటి ప్రభుత్వం అతి తక్కువ ధరకు రహేజా కంపెనీకి అందజేసింది. 40 ఏళ్లయినా ఒక్క ఇటుక వేసింది లేదు. అప్పనంగా కొనేసి.. ప్రస్తుతం ప్లాట్లుగా మార్చి స్థిరాస్తి వ్యాపారం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

**ఎన్నో చెప్పారు..**

చిలమత్తూరు మండలం కొడికొండ చెక్‌పోస్టు, గోరంట్ల ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు 2008–09లో 11,352 ఎకరాలు... ఎకరాకు రూ.1.75 లక్షలు చెల్లించి అప్పటి ప్రభుత్వం సేకరించింది. సదరు భూమి లేపాక్షి నాలెడ్జ్‌హబ్‌కు కేటాయించారు. 1.50 లక్షల మందికి ఉపాధి కల్పిస్తామన్నారు. దాని ఊసేలేదు.

పరిగి మండలం శ్రీరంగరాజుపల్లి, పాపిరెడ్డిపల్లి, పరిగి, మడకశిర



మండలం కేతేపల్లి, సి కొడిగేపల్లి గ్రామాల్లో రసాయి ప్రాపర్టీస్ వారు భూములిచ్చిన రైతు కుటుంబాల వారికి ఉద్యోగాలు, ఉపాధి కల్పిస్తామని చెప్పి 2006–08లో ఎకరా రూ.30వేల చొప్పున 2,200 ఎకరాలు సేకరించారు. ఇప్పటికీ ఒక్క అడుగూ ముందుకు పడలేదు.

**గొర్రెల కాపరిగా మారాను**

– నరసింహప్ప, శ్రీరంగరాజపల్లి, పరిగి మండలం

పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి చూపుతామంటే 3.46 ఎకరాల భూమి ఇచ్చాం. 19 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు పరిశ్రమలు ఏర్పాటు చేయలేదు. ఉపాధి చూపలేదు. ప్రస్తుతం గొర్రెల కాపరిగా మారి జీవనం సాగిస్తున్నా.

# నర్సీపట్నానికి నాలుగులైన్ల రోడ్డు

నర్సీపట్నం : నర్సీపట్నం పురపాలక సంఘం పరిధిలోని పెదబొడ్డేపల్లి కూడలి నుంచి మాకవరపాలెం మీదుగా కశింకోట మండలం తాళ్లపాలెం వరకు 32 కి.మీ. రోడ్డును జాతీయ రహదారిగా మార్పు చేసి నాలుగు వరసలుగా అభివృద్ధి చేయనున్నారు. దిల్లీకి చెందిన ప్రైవేట్ కన్సల్టెన్సీ బృందం, రోడ్లు భవనాల శాఖ అధికారులు ఇటీవల ఈ రోడ్డును పరిశీలించి వెళ్లారు. సమగ్ర ప్రాజెక్టు నివేదికను త్వరలో కేంద్ర ప్రభుత్వానికి అందజేయనున్నారు.

మాకవరపాలెం మండలం పారిశ్రామికంగా విస్తరిస్తోంది. రాచపల్లిలో ఇప్పటికే అల్యూమినియం కర్మాగారం నడుస్తోంది. కాఫీ పరిశ్రమ ఏర్పాటుకు జీసీసీ ఇటీవల భూములు తీసుకుంది. చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు వందల ఎకరాలను సిద్ధం చేస్తున్నారు. ఎంఎస్ఎంఈ పార్కుకు ఇటీవల సభాపతి అయ్యన్న శంకుస్థాపన చేశారు.

ప్రస్తుతం 7 మీటర్ల వెడల్పు ఉన్న ఈ రోడ్డును 14 మీటర్లకు విస్తరించనున్నారు. 21 చోట్ల కల్వర్టులు నిర్మించాల్సి ఉంటుంది. కొండల అగ్రహారం, తాళ్లపాలెం సంత సమీపంలో వంతెనలను విస్తరిస్తారు.

మాకవరపాలెం మండలం యరకన్నపాలెం నుంచి ఎలమంచిలి మండలాన్ని కలుపుతూ రెండు కొండల మధ్య నుంచి రోడ్డు నిర్మాణానికి



కొద్దిరోజుల కిందట చర్యలు మొదలయ్యాయి. రెవెన్యూ శాఖకు సంబంధించిన భూముల్లో తొలుత పనులు పూర్తి చేసి అనంతరం విస్తరణకు అవసరమైన అటవీ భూమిని సేకరించనున్నారు. ఎలమంచిలి రైల్వేస్టేషన్ నుంచి రాకపోకలు సాగించేందుకు ఈ రహదారి ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

భవిష్యత్తు అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని రోడ్డు విస్తరణ దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అల్యూమినియం కర్మాగారం నుంచి తాళ్లపాలెం వరకు రహదారి మరమ్మతుకు కొద్దిరోజుల కిందట పరిశ్రమ యాజమాన్యం రూ.25 లక్షలు కేటాయించింది. కలెక్టర్ నుంచి అనుమతులు రాగానే పనులు ప్రారంభంకానున్నాయి.

# నగరానికే తలమానికం.. హెల్త్ సిటీ!

విశాఖపట్నం: హనుమంతవాక కూడలి నుంచి ముడసర్లోవ రోడ్డు వరకు వరుసగా అన్నీ ఆసుపత్రులే. ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న విశాఖ వైద్య విజ్ఞాన సంస్థతోపాటు అనేక ప్రైవేటు ఆసుపత్రులున్నాయి. అదే చినగదిలి పరిధిలోని హెల్త్ సిటీ. రాష్ట్రంలోనే తొలిసారిగా ఏర్పాటుచేసిన హెల్త్ సిటీ వైద్య పర్యాటకాన్ని ఆకర్షిస్తోంది. రోగులు అత్యాధునిక చికిత్స కోసం బెంగళూరు, హైదరాబాద్, చెన్నై వంటి నగరాలకు వెళ్లకుండా.. ఇక్కడే అన్నిరకాల శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నాయి.

వాటిలో ఆర్థోపెడిక్, కీళ్ల మార్పిడి, గుండె, సంతాన సాఫల్య, రోబోటిక్ క్యాన్సర్ సర్జరీలు జరుగుతున్నాయి. ఇక్కడి ఆసుపత్రుల్లో అధునాతన వైద్య పరికరాలతోపాటు అనుభవజ్ఞులైన వైద్య నిపుణులున్నారు.

**2006లో ఏర్పాటు:** ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలందించేందుకు 2006లో చినగదిలిలో హెల్త్‌సిటీ ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఐఐసీ) దాదాపు 100 ఎకరాలు కేటాయించింది. ప్రైవేటు ఆసుపత్రులు నెలకొల్పడానికి మార్కెట్ ధర కంటే తక్కువకే స్థలాలు కేటాయించారు. అప్పట్లో ఎకరాకు రూ.2.4 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకు తీసుకున్నా రు. ప్రస్తుతం అక్కడ 18 ప్రైవేటు ఆసుపత్రులుండగా.. ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి రోగులు వస్తుంటారు.

**ఫిర్యాదులూ ఉన్నాయ్..**



మెరుగైన వైద్యం అందుతుందనే ఆశతో వెళ్తున్న రోగులను కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు దోచుకుంటున్నాయనే ఫిర్యాదులున్నాయి. శస్త్రచికిత్స చేయించుకుంటే వివిధ రుసుముల పేరిట జేబులు గుల్ల చేస్తున్నాయనే ఆరోపణలున్నాయి. హెల్త్‌సిటీలోని ఆసుపత్రుల్లో మొత్తం ఓపీ సేవల్లో 10 శాతం పేద, దారిద్ర్య రేఖకు దిగువనున్న ప్రజలకు ఉచితంగా సేవలందించాలి.

15 శాతం పడకలు ఉచితంగా పేదలకు చికిత్స అందించేందుకు కేటాయించాలి. ప్రభుత్వ గురుకుల పాఠశాలల విద్యార్థులకు ఉచిత చికిత్స అందించాలి. కొన్ని ఆసుపత్రుల్లో ఏపీఐఐసీ విధించిన ఈ నిబంధనలను పట్టించుకోవట్లేదని ఆరోపణలున్నాయి.

# మెదడుకు రక్షణ.. రోగికి సాంత్వన

కర్నూలు : మారిన జీవనశైలి ప్రభావంతో చాలామంది అధిక రక్తపోటు బారినపడుతున్నారు. వీరిలో కొందరికి బ్రెయిన్‌స్ట్రోక్ వచ్చి మృతి చెందుతున్నారు. మరికొందరు పక్షవాతంతో మంచాన పడుతున్నారు. సకాలంలో వైద్యం అందించగలిగితే వీరిని ప్రాణాపాయం నుంచి రక్షించవచ్చని వైద్యులు చెబుతున్నారు. స్ట్రోక్ వచ్చిన వెంటనే టెనెక్టెప్లేస్ ఇంజెక్షన్ ఇస్తే ముప్పు తప్పే అవకాశం ఉంది. రూ.40 వేల విలువైన ఈ సూదిమందును కర్నూలు సర్వజన వైద్యశాలలో ఉచితంగా వేస్తున్నారు. బ్రెయిన్‌స్ట్రోక్ కేసులు పెరుగుతున్న దృష్ట్యా.. జీజీహెచ్‌లో ప్రత్యేకంగా పది పడకలతో న్యూరో ఐసీయూ స్ట్రోక్ యూనిట్ ఏర్పాటు చేశారు. బ్రెయిన్‌స్ట్రోక్‌తో పక్షవాతం బారినపడిన వారు, మెదడులో కణితులు ఉన్నవారికి ఇక్కడ మెరుగైన చికిత్సలు అందించి ప్రాణాలు కాపాడుతున్నారు.

**4.30 గంటల్లోపు తీసుకొస్తే..** బ్రెయిన్‌స్ట్రోక్ వచ్చిన వారిని వెంటనే సర్వజన వైద్యశాలలోని అత్యవసర విభాగం లేదా న్యూరో ఫిజీషియన్ విభాగంలో చేర్చాలి. వైద్యులు సీటీ స్కాన్ తీస్తారు. మెదడులో రక్తం గడ్డ కట్టి ఉంటే కుటుంబ సభ్యుల అనుమతితో టెనెక్టెప్లేస్ సూదిమందు వేస్తారు. బయట దీని ఖరీదు రూ.40 వేల వరకు ఉంటుంది. స్ట్రోక్ వచ్చిన తర్వాత 4.30 గంటల్లోపు దీన్ని వేయాలి.

చాలామంది బాధితులను మొదట ప్రైవేటు ఆసుపత్రులకు తీసుకెళ్తున్నారు. అక్కడ రూ.20– 30 వేలు ఖర్చయ్యాక.. ఆపై ఖర్చు భరించలేని పేదలు సర్వజన ఆసుపత్రికి తీసుకొస్తున్నారు. ఆలస్యం కావడం వల్ల టెనెక్టెప్లేస్ ఇంజెక్షన్ వేయలేని పరిస్థితని వైద్యులు చెబుతున్నారు. **సకాలంలో వస్తేనే** ఉమ్మడి జిల్లా నుంచి జీజీహెచ్‌కు ప్రతినెలా 50 వరకు బ్రెయిన్ స్ట్రోక్స్ కేసులు వస్తున్నాయి. చాలామంది స్ట్రోక్ వచ్చిన చాలా గంటలు గడిచాక.. లేదా మరుసటి రోజు తీసుకొస్తున్నారు. దీంతో ఇంజెక్షన్ అందుబాటులో ఉన్నా వేయలేని పరిస్థితి. టెనెక్టెప్లేస్ సూదిమందును అందరికీ వేయరు. వైద్య పరీక్షలు చేసి.. రోగి దృఢంగా ఉండి.. రక్తపోటు, మధుమేహం నియంత్రణలో ఉంటేనే వేయాల్సి ఉంటుంది. డాక్టర్ శ్రీనివాసులు, న్యూరో విభాగాధిపతి

చురకలు



# మతిపోగొట్టే శోభిత లుక్స్

టాలీవుడ్‌లో ఎక్కువ సినిమాలు చేయకున్నా శోభితా ధూళిపాళ గురించి ప్రత్యేకంగా పరిచయం చేయనక్కర్లేదు. ఎందుకంటే శోభిత అక్కినేని వారి ఇంటి కోడలు అనే విషయం తెల్సిందే. నాగ చైతన్యను వివాహం చేసుకున్న తర్వాత, చేసుకోక ముందు కూడా శోభితా తనకంటూ ప్రత్యేక ఇమేజ్ సొంతం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తూనే ఉంది. బాలీవుడ్‌లో ఈమెకు మంచి ఆఫర్లు లభించాయి, తద్వారా ఇప్పటికే బాలీవుడ్‌లో గుర్తింపు ఉన్న హీరోయిన్స్ జాబితాలో చేరింది. అంతే కాకుండా ఇతర భాషల్లో కూడా ఈమె సినిమాలు చేసిన కారణంగా అన్ని చోట్ల మంచి పాపులారిటీని సొంతం చేసుకుంది. తెలుగు అమ్మాయి అయినప్పటికీ ఇతర భాషల్లో ఎక్కువగా శోభితా కనిపించడం తెలుగు వారికి గర్వించదగ్గ విషయం అనడంలో సందేహం లేదు. నాగ చైతన్యతో వివాహం తర్వాత కూడా శోభిత వరుస ప్రాజెక్ట్‌లు కమిట్ అవుతూనే ఉంది.

**నాగ చైతన్యతో పెళ్లి తర్వాత శోభిత దూళిపాళ...** తెలుగులో నాగ చైతన్యతో కలిసి శోభిత ఒక సినిమా చేయాలని అక్కినేని ఫ్యాన్స్ బలంగా కోరుకుంటున్నారు. ప్రస్తుతానికి అలాంటి చర్చలు ఏమీ లేవు. కానీ



భవిష్యత్తులో చేయాలని అనుకుంటున్నట్లుగా మాత్రం వార్తలు వస్తున్నాయి. ఆ విషయాన్ని వారు అధికారికంగా ధృవీకరించాల్సి ఉంది. గత ఏడాది కాలంగా కొత్త సినిమాలతో రాని శోభిత వచ్చే ఏడాదిలో బ్యాక్ టు బ్యాక్ ప్రాజెక్ట్‌లతో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతానికి ఒక హిందీ సినిమా, ఒక వెబ్ సిరీస్ లో ఈమె నటిస్తున్నట్లు సమాచారం అందుతోంది. ఇక రెగ్యులర్‌గా సోషల్ మీడియాలో ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్‌లో శోభిత తన అందమైన ఫోటోలు, ఫ్యామిలీ ఫోటోలు, సినిమాలకు సంబంధించిన విషయాలను షేర్ చేసుకోవడం మనం చూస్తూనే ఉన్నాం. తాజాగా మరోసారి ఈమె తన అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది.

**ఇన్‌స్టాగ్రామ్‌లో శోభిత ఫోటోలు వైరల్...** బ్లాక్ టాప్‌తో పాటు, బ్లూ జీన్స్ ధరించిన శోభిత అల్ట్రా స్టైలిష్ గా కనిపిస్తోంది. అందాల ఆరబోత చేసినప్పటి కంటే ఇప్పుడు మరింత అందంగా ఈమె కనిపిస్తుంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ అమ్మడి ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. మతి పోగొడుతున్న ఈ ఫోటోలు ఆమె అందం గురించి మరోసారి చర్చ జరిగేలా చేశాయి అనడంలో సందేహం లేదు. తెలుగు అమ్మాయి అయినప్పటికీ ముంబై ముద్దుగుమ్మలకు ఏమాత్రం తగ్గకుండా అందం విషయంలో, అన్ని విషయాల్లోనూ శోభిత ముందు ఉంటుంది. అందుకే బాలీవుడ్‌లో ఏకంగా ముంబై ముద్దుగుమ్మలకు పోటీగా నిలుస్తుందని ఆమె అభిమానులు అంటున్నారు. ఈమె అందంకు తగ్గట్లుగా టాలీవుడ్‌లో, కోలీవుడ్‌లో ఆఫర్‌లు రావడం లేదు అంటూ అభిమానులు కొందరు సోషల్ మీడియా ద్వారా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# సూర్య సినిమా రీ రిలీజ్.. డైరెక్టర్ కి ప్లస్ అవుతుందా..?

కోలీవుడ్ స్టార్ సూర్య నటించిన ఒక సినిమా రీ రిలీజ్ హంగామా మొదలైంది. ఐతే 11 ఏళ్ల క్రితం రిలీజైన ఈ సినిమా అప్పట్లో పెద్దగా ప్రేక్షకులను మెప్పించలేదు. ఐతే ఆ తర్వాత మాత్రం ఆ సినిమా గురించి డిస్కస్ చేస్తూ వచ్చారు. 11 ఏళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు ఆ సినిమా రీ రిలీజ్ చేస్తున్నారు. ఆ సినిమా డైరెక్టర్ కూడా అప్పటి రోజులను గుర్తు చేసుకుంటూ రీ రిలీజ్ పై ఆసక్తిగా ఉన్నాడు. ఇంతకీ ఏ సినిమా గురించి ఇదంతా అంటే.. సూర్య, లింగుసామి కాంబినేషన్ లో వచ్చిన అంజాన్ సినిమా గురించే అన్నమాట.

**తమిళ్ తో పాటు తెలుగులో కూడా..** అంజాన్ 2014లో రిలీజైన ఈ సినిమాలో సూర్య డ్యూయల్ రోల్ చేయగా సినిమాలో హీరోయిన్ గా సమంత నటించింది. ఈ సినిమాను తెలుగులో సికిందర్ అనే టైటిల్ తో రిలీజ్ చేశారు. ఐతే తమిళ్ తో పాటు తెలుగులో కూడా ఈ సినిమాను ప్రేక్షకులు పట్టించుకోలేదు. అప్పట్లో సూర్య మంచి ఫాం లో ఉండగా అతని ఫాం కి ఈ సినిమా బ్రేక్ వేసినట్టు అయ్యింది. సూర్య సినిమా రీ రిలీజ్ టైంలో డైరెక్టర్ లింగుసామి ఆ సినిమా



రిలీజ్ టైంలో కొన్ని కారణాల వల్ల ఎడిటింగ్ సరిగా చేయలేదని.. ఐతే ఇన్నేళ్ల తర్వాత కూడా ఈ సినిమా రీ రిలీజ్ కోసం ఆడియన్స్ చూపిస్తున్న ప్రేమ ఆకట్టుకుందని అన్నారు.

లింగుసామి అంజాన్ అదే సికిందర్ సినిమా రీ రిలీజ్ ని తనకి ప్లస్ అయ్యేలా చేసుకోవాలని చూస్తున్నారు. రామ్ తో ది వారియర్ తర్వాత 3 ఏళ్లుగా లింగుసామికి మరో మూవీ ఛాన్స్ రాలేదు.

**లింగుసామి యాక్షన్ సినిమాలు..** పాతికేళ్ల కెరీర్ లో 10 సినిమాలు మాత్రమే చేసిన లింగుసామి తిరిగి స్ట్రాంగ్ కంబ్యాక్ ఇవ్వాలని చూస్తున్నారు. అప్పట్లో తెలుగు స్టార్స్ తో లింగుసామి కథాచర్చలు అంటూ హడావిడి చేశారు కానీ ఆయన ఫాంలో లేరని తెలిసి సైలెంట్ అయ్యారు. లింగుసామి యాక్షన్ సినిమాలను తెలుగు ఆడియన్స్ కూడా బాగా ఎంజాయ్ చేశారు. ఆవారా సినిమా తెలుగులో సక్సెస్ అయ్యింది. పందెంకోడి సూపర్ హిట్ అయ్యింది. ఐతే మళ్లీ పందెం కోడి లాంటి సినిమా తీసిన లింగుసామిని చూడాలని ఆడియన్స్ కోరుతున్నారు. రామ్ తో ది వారియర్ అటెంప్ట్ కూడా నిరాశపరచడంతో లింగుసామికి ఛాన్స్ లు లేకుండా అయ్యాయి. అంజాన్ సినిమా రీ రిలీజ్ లింగుసామికి ఏమైనా కలిసి వస్తుందా లేదా అన్నది చూడాలి. లింగుసామి కూడా అంజాన్ రీ రిలీజ్ టైం లో యాక్టివ్ గా ఉండటం వల్ల తనకు ఎంతోకొంత హెల్ప్ అవుతుందని భావిస్తున్నారు.




# సంక్రాంతి తర్వాత సమ్మర్ సమరమే!



ఈ సంక్రాంతి సీజన్ ఆల్కాహాల్ రిలీజ్ తో మొదలువుతుంది. అటుపై జనవరి 9న రాజాసాబ్, జన నాయగన్ పోటీ బరిలో ఉన్నాయి. రెండు సినిమాలు ఒకే రోజు రిలీజ్ కావడంతో పోటీ కనిపిస్తోంది. అలాగే మన శంకరవరప్రసాద్ గారు, భర్త మహాయశులకు లాంటి చిత్రాలు రేసులో ఉన్నాయి. ఆరెండు సినిమాల రిలీజ్ తేదీ ఖరారు కావాల్సి ఉంది. సంక్రాతి టార్గెట్ గానే ఈ రెండు రిలీజ్ కానున్నాయి. అనంతరం పరాశక్తి, అనగనగా ఒక రాజు లాంటి చిత్రాలు నెలఖారున రిలీజ్ అవుతాయి. దీంతో జనవరి రిలీజ్ లు పూర్తవుతాయి.

**ఒక్క రోజు గ్యాప్ లో ఆ ఇద్దరు:** అనంతరం సమ్మర్ హీట్ మొదలు కానుంది. ఫిబ్రవరిలో ఇంత వరకూ ఎలాంటి రిలీజ్ లేవు. దీంతో అసలైన వేడి మార్చి నుంచి మొదలు కానుంది. మార్చి 19న డెకాయిట్, టాక్సిక్ రిలీజ్ అవుతున్నాయి. ఈ రెండు సినిమాలపై పాన్ ఇండియాలో భారీ అంచనాలున్నాయి. రెండు యాక్షన్ థ్రిల్లర్లు కావడంతో బాక్సాఫీస్ వద్ద టఫ్ ఫైట్ తప్పదు. అదే నెల 26న నేచురల్ స్టార్ నాని హీరోగా నటిస్తోన్న ది ప్యారడైజ్ భారీ అంచనాల మధ్య రిలీజ్ అవుతుంది. అనంతరం ఒక్క రోజు గ్యాప్ లోనే మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తోన్న పెద్ది పాన్ ఇండియాలో రిలీజ్ అవుతుంది.

**అన్నదమ్ములిద్దరు ఒకేసారి:** ప్యారడైజ్ కూడా పాన్ ఇండియా రిలీజ్ కావడంతో? రఎండు సినిమాల మధ్య పోటీ తప్పదు. ఇక ఏప్రిల్ రెండవ వారంలో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తోన్న ఉస్తాద్ భగత్ సింగ్ రిలీజ్ కానుంది. రిలీజ్ తేదీ ప్రకటించాల్సి ఉంది. ఆ సినిమా రిలీజ్ అనంతరం చిరంజీవి హీరోగా నటిస్తోన్న విశ్వంభర కూడా రిలీజ్ అవుతుంది. ఇప్పటికే రిలీజ్ అవ్వాల్సిన సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో జాప్యంగా కారణంగా డిలే అయింది. ఏప్రిల్ లో మాత్రం పక్కా రిలీజ్ అని చిత్ర వర్గాల నుంచి తెలిసింది. అలాగే యంగ్ టైగర్ ఎన్టీఆర్ నటిస్తోన్న డ్రాగన్ కూడా సమ్మర్ బరిలో నిలిచే అవకాశం ఉంది.

**స్టార్స్ తో పాటు టైర్ 2 హీరోలు:** దేవర తర్వాత తారక్ నుంచి రిలీజ్ అవుతున్న పాన్ ఇండియా ప్రాజెక్ట్ కావడంతో? అంచనాలు భారీగా ఉన్నాయి. ఇక మేలో మేలో ఫంకీ, గుడఛారి 2 లాంటి చిత్రాలు రేసులో ఉన్నాయి. మొత్తంగా ఈ సమ్మర్ లో రిలీజ్ లు భారీగానే కనిపిస్తున్నాయి.

కొత్త రిలీజ్ లతో థియేటర్లు కళకళలాడున్నాయి. ఈ ఏడాది సరైె సమ్మర్ రిలీజ్ లు లేకపోవడంతో థియేటర్లు వెలవెలబోయిన సంగతి తెలిసిందే. 2026 వేసవి మాత్రం హీటెక్కడం ఖాయం.

# రిలీజ్ సంగతి సరే టీజర్ మాత్రం పక్కానా?



సూపర్ స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో జైలర్ 2 తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. తొలి భాగం జైలర్ భారీ విజయం సాధించడం సహా బాక్సాఫీస్ వద్ద ఏకంగా 700 కోట్లకు పైగా వసూళ్లు సాధించడంతో? కోలీవుడ్ కి తొలి 1000 కోట్ల సినిమా గా జైలర్ 2 రికార్డు సృష్టించడం ఖాయమంటూ అంచనాలు భారీగా ఏర్పడుతున్నాయి. చెన్నై సహా వివిధ ప్రాంతాల్లో చిత్రీకరణ జరుగుతోంది. ఈ క్రమంలో సినిమా రిలీజ్ ను రజనీ కాంత్ ప్రకటించిన సంగతి తెలిసిందే. జూన్ లో రిలీజ్ చేస్తామంటూ ప్రకటించారు.

**టీజర్ బర్త్ డేకి ఫిక్సేనా?....** అయితే మేకర్స్ నుంచి మాత్రం ఎలాంటి ధృవీకరణ రాలేదు. దీంతో రిలీజ్ పై కాస్త సస్పెన్స్ కూడా కొనసాగుతుంది. రజనీ ఇచ్చిన సమాచారం సరైంది కాదనే వార్తలు కూడా నెట్టింట వైరల్ అయ్యాయి.

అయితే షూటింగ్ ప్రారంభంకాక ముందే నిర్మాతలు ఒక ప్రకటన వీడియో రిలీజ్ చేశారు. జైలర్ 2 టీజర్ రజనీకాంత్ పుట్టిన రోజు సందర్భంగా రిలీజ్ చేస్తామని ఆ వీడియోలో పేర్కొన్నారు. మరి టీజర్ చెప్పిన తేదీకి రిలీజ్ చేస్తారా? లేదా? అన్నది చూడాలి. కానీ సన్నిహితుల సమాచారం ప్రకారం టీజర్ పై వర్క్ జరుగుతుందని తెలిసింది.

**అభిమానులెంతో ఆసక్తిగా:** దీనిపై సంగీత దర్శకుడు అనిరుద్ పని చేస్తున్నట్లు వినిపిస్తోంది. మరి ఇది జరుగుతుందా? లేదా? అన్నది మరో సారి అధికారికంగా ప్రకటన వస్తే తప్ప ఫిక్స్ చేయడానికి లేదు. ఈ సినిమా షూటింగ్ కూలీ సెట్స్ లో ఉన్నప్పుడే ప్రారంభమైంది. ఇది జరిగి కొన్ని నెలలు గడుస్తుంది. కానీ ఆ తర్వాత మళ్లీ సినిమాపై ఎలాంటి అప్ డేట్ రాలేదు. రజనీ కాంత్ గత సినిమా కూలీ అంచనాలు అందుకోవడంలో విఫలమైన నేపథ్యంలో? జైలర్ 2 రిలీజ్ కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆ ఫ్లాప్ ని వీలైనంత త్వరగా హిట్ సినిమాతో భర్తీ చేయాలనే ఒత్తిడి కనిపిస్తోంది.

**కొత్త ఏడాది లో కొత్త సినిమా:** కానీ దర్శకుడు నెల్సన్ ఎంత మాత్రం కంగారు పడకుండా పని చేస్తున్నాడు.

రజనీ అభిమానులు అంచనాలకు మించే ఉంటుందంటూ గతంలోనే ఓ ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. అందుకు తగ్గట్టే స్టార్ నటుల్ని ఎంపిక చేసాడు. ఎస్. జె సూర్య, సురజ్ వెంజారాముదు, రమ్య కృష్ణ, యోగి బాబు, మిర్నా ముఖ్యమైన పాత్రల్లో కని పించనున్నారు. ప్రస్తుతం రజనీకాంత్ సహా ఆ నటులపై కాంబినేషన్ సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. దీంతో రజనీ పై షూటింగ్ దాదాపు ముగింపు దశకే చేరుకుంటుందని చిత్ర వర్గాల నుంచి తెలిసింది. వచ్చే ఏడాది ఆరంభంలోనే రజనీ కొత్త సినిమా మొదలు పెట్టే అవకాశం ఉందంటున్నారు.

# గ్లామర్‌లోనే కాదు అభినయంలోను భాగ్యశ్రీ ది గ్రేట్

ఎవరికైనా ఒక టైమ్ రావాలి. అలాంటి టైమ్ కలిసొచ్చింది భాగ్యశ్రీకి. కేవలం గ్లామరస్ పాత్రల్లోనే కాదు, నటించేందుకు అవకాశం ఉన్న పాత్రలు ఆఫర్ చేస్తే, తాను కూడా తగ్గేదేలే అని ఇటీవల నిరూపిస్తోంది. ఇంతకుముందు దుల్కర్ సల్మాన్ కాంత సినిమాలో అద్భుత అభినయంతో ఆకట్టుకున్న భాగ్యశ్రీ ఇప్పుడు రామ్ సరసన నటించిన ఆంధ్రా కింగ్ తాలూకాలోను తనదైన అద్భుత ప్రదర్శనతో రక్తి కట్టించింది.

**గ్లామర్ ని మించి అభినయం..** భాగ్యశ్రీ బోర్సే గ్లామర్ డాళ్ ఇమేజ్ నుంచి పూర్తిగా బయటికి వచ్చినట్లే. కాంతలో అదరగొట్టిన ఆమె..ఆంధ్ర కింగ్ తాలూకాలోనూ ఆకట్టుకుంది అంటూ ప్రశంసలు కురుస్తున్నాయి. అందంతో పాటు అభినయంతోనూ భాగ్యశ్రీ మెప్పించింది. సినిమాలోని కీలక సన్నివేశాలలో తన అభినయానికి క్రిటిక్స్ మంచి మార్కులే వేసారు. ముఖ్యంగా భాగ్యశ్రీ గ్లామర్ డాళ్ అనుకుంటే, తనలోని నటిని ఈ సినిమాలో చూడొచ్చు! అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. రామ్ ఇంతకుముందు ప్రీరిలీజ్ వేదికపై భాగ్య శ్రీ గురించి అంత



ఎమోషనల్ గా ఎందుకు మాట్లాడాడో ఈ సినిమా చూసిన తర్వాత ప్రజలకు అర్థమైంది. భాగ్యశ్రీ ఇంత గ్లామర్ డాళ్ లా ఉంది.. కానీ ఆడిషన్స్ లో తన అభినయం చూసి వెంటనే ఓకే చేసామని రామ్ చెప్పారు. దానికి తగ్గట్టే భాగ్యశ్రీ సినిమా ఆద్యంతం నటిగా రాణించింది. ఆంధ్రా కింగ్ తాలూకా చిత్రానికి క్రిటిక్స్ యునానిమస్ గా అద్భుతమైన రేటింగులు ఇచ్చి ప్రోత్సహించారు.

**వరుస విజయాలతో దూకుడు..** ఇప్పుడు కాంత, ఆంధ్రా కింగ్ తాలూకా లాంటి విజయాలతో భాగ్యశ్రీ రేంజ్ అమాంతం పెరగనుంది. పారితోషికాన్ని చుక్కల్లోకి తీసుకెళ్లే కథానాయికల జాబితాలో భాగ్యశ్రీ కూడా చేరిపోనుంది. ఈ రెండు విజయాలతో భాగ్యశ్రీ ఫోటోషూట్ల పరంగాను దూకుడును ప్రదర్శిస్తోంది. తాజా ఫోటోషూట్ లో ఈ ముగ్ధమనోహరి అందచందాలు మరో లెవల్ లో ఎలివేట్ అయ్యాయి. సింపుల్ డిజైనర్ డ్రెస్ లో భాగ్యశ్రీ ఎంతో క్యూట్ గా లవ్వబుల్ గా కనిపిస్తూనే, తనలోని గ్లామర్ ని ఎలివేట్ చేసిన తీరుకు బోయ్స్ ముగ్ధులైపోతున్నారు. ప్రస్తుతం ఈ ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది.

**ప్రతిభకు పట్టం:** టాలీవుడ్ లో అత్యంత వేగంగా ఎదిగేసిన కథానాయికల జాబితాలో సాయిపల్లవి, కియరా అద్వాణీ, రష్మిక మందన్న, శ్రీలీల పేర్లు మార్మోగుతున్నాయి. ప్రతిభకు ప్రజలు పట్టంగడగారనడానికి వీరంతా ఉదాహరణలు. ఇప్పుడు ఈ జాబితాలో భాగ్యశ్రీ పేరు కూడా చేరిపోనుందని అభిమానులు భావిస్తున్నారు. భాగ్యశ్రీ భవిష్యత్ ఉజ్వలంగా వెలిగిపోవాలని కూడా ఫ్యాన్స్ ఆకాంక్షిస్తున్నారు.

# 8 గంటల పనిదినం వెనక కష్టం చెప్పిన కీర్తి

ఈరోజుల్లో 8గంటల పనిదినం గురించి దేశవ్యాప్తంగా అన్ని సినీపరిశ్రమల్లో విస్తృతంగా చర్చ సాగుతోంది. దీపిక పదుకొనే కేవలం 8గం.ల పని దినం కారణంగా రెండు పెద్ద అవకాశాల్ని కోల్పోవడంతో ఈ చర్చకు మరికాస్త ప్రాధాన్యత పెరిగింది. అయితే ఎనిమిది గంటల పనిదినం లేదా 9-6 జాబ్ గురించి నటి కీర్తి సురేష్ ని ప్రశ్నిస్తే, తను ఇచ్చిన జవాబు నిజంగా ఆశ్చర్యపరుస్తోంది. నిజానికి తాను 24గంటల షిఫ్ట్ పని చేస్తానని కీర్తి సురేష్ అన్నారు. 9-6 షిఫ్ట్... 9-9 షిఫ్ట్.. 9-2 షిఫ్ట్ కూడా తనకు అలవాటు అని తెలిపారు. నిజానికి నేను మహానటి షూటింగ్ చేసేప్పుడు ఒకేసారి ఐదు సినిమాలకు పని చేసాను. అజ్ఞాతవాసి, సామి 2, సర్కార్, పందెంకోడి 2 (సందకోడి2) , వీటితో పాటు మహానటి సినిమా చేసాను. చాలామందికి ఎనిమిది గంటల పని దినం అంటే అర్థం కావడం లేదు. దీని గురించి తెలుసుకోవాల్సింది చాలా ఉంది. వాస్తవానికి 9కి మేకప్ తో ఆర్టిస్టు రెడీ అవ్వాలంటే 7గంటలకే సెట్లో ఉండాలి. ఆర్టిస్టు 6 గంటలకు బయల్దేరితేనే సెట్ కి రాగలడు. అలా రావాలంటే, 5 గంటలకు నిద్ర లేచి రెడీ అవ్వాలి. 6 గంటలకు ప్యాకప్ చెబితే, మేకప్ రిమూవ్ చేసి ప్రయాణించి ఇంటికి వెళ్లడానికి



అదనంగా మరో గంట పడుతుంది. 9-6 పని అంటే ఇంత ఉంటుంది.. అని కీర్తి డీటెయిలింగ్ ఇచ్చారు. ఇది కేవలం ఆర్టిస్టు వరకే, టెక్నీషియన్లు, లైట్ మెన్లు వీరంతా ఆర్టిస్టులు సెట్ కి రాకముందే అక్కడ ఉండాలి. ఆర్టిస్టులు వెళ్లిపోయిన తర్వాత సెటప్ మొత్తం సర్దుకోవడానికి చాలా సమయం పడుతుంది. అంటే వాళ్లు ఎంత అదనపు సమయం పని చేయాలో, ఎంతగా వేచి చూడాలో ఆలోచించండి! అని కీర్తి సురేష్ సినిమా కష్టాల గురించి మాట్లాడారు. మహానటి చిత్రీకరణ సమయంలో మరో నాలుగు సినిమాలతో తాను 24 బై 7 కాల్షీట్లను మ్యానేజ్ చేసానని తెలిపారు. సహజంగా మనిషికి 8గంటల నిద్ర అవసరం. కానీ మాకు అంత నిద్ర ఎక్కడ కుదురుతుంది. 5గంటలు నిదురపోవడం కూడా గగనం. సాయంత్రం 8గం.లకు ఇంటికి చేరితే ఆ తర్వాత ఒక గంట వర్కవుట్ల కోసం, అర్థగంట షవర్ కింద సరిపోతుంది. 11- 11.30 పీఎం మధ్య నిదురపోతే మళ్లీ 5గంటలకే నిద్ర లేవాలి అని ఆర్టిస్టు రోజువారీ సైకిల్ గురించి కీర్తి వర్ణించిన తీరు నిజంగా కళాకారుల కష్టానికి అద్దం పట్టింది. తెలుగు తమిళంలో 9-6 పని చేస్తారు కానీ, మలయాళం, హిందీలో 12గంటలు వర్క్ షెడ్యూల్ ఉంటుందని కూడా కీర్తి వెల్లడించారు. రివాల్వర్ రీటా విడుదల ప్రచారంలో బిజీగా ఉన్న కీర్తి ఈ విషయాలన్నిటినీ చెప్పారు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536